Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక



ఆదివారం 12 జనవరి 2025 / సంపుటి: 24 సంచిక: 09 పేజీలు: 12 వెల: రూ.4.00

TELANGANA & ANDHRA PRADESH

## నెలాఖరులోగా కొత్త ఉస్మానియా నిర్మాణానికి శంకుస్థాపన

- పలు నమూనాలు పరిశీలించిన సిఎం
- ఉస్మానియాపై అధికారులతో సమీక్ష
- కార్పోరేట్‌కు దీటుగా ఉండాలని రేవంత్ ఆదేశం
- ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎం





హైదరాబాద్,జనవరి11 : ఈ నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ప్లై ఓవర్

మిగతా 2లో..

## కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిస్తున్నారు

**ఫార్ములా కేసులో అవినీతి అన్నది ఎసిబి, ఇడి తేలస్తాయి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**



ఖమ్మం,జనవరి11: కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిసతున్నారని, ఆయనకు ఎలా బుద్ది చెప్పాలో వారికి తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిఎంను తిడుతూ వాడుతున్న భాష ఆయన దిగజారుడు రాజకీయాన్ని సూచిస్తోందన్నారు. మా ప్రభుత్వం ఏ ఒక్కరి మీద కక్ష్యపూరితంగా చర్యలు చేపట్టడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కారు రేసింగ్ లో చట్టం తన పని తానే చేసుకుని పోతుంది.. కేటీఆర్

మిగతా 2లో..

## అయోధ్య రామ మందిరానికి తొలి వార్షికోత్సవం

**ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ,జనవరి 11 : అయోధ్యలో కొత్త నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లాను ప్రతిష్టాపన చేసి ఏడాది కావొస్తోంది. ఈ నేపథ్యంలో తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎక్స్ అకౌంట్‌లో ఆయన పోస్టు చేస్తూ.. భారతీయ

మిగతా 2లో..

## హైదరాబాద్ తరవాత వరంగల్‌లో రియల్ బూమ్

**క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

వరంగల్,జనవరి11: హనుమకొండ జిల్లాలో 3వ ఎడిషన్ క్రేడాయి వరంగల్ ప్రాపర్టీ షోను మంత్రి పొన్నం

మిగతా 2లో..



## ఆదివాసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి

**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను అభివృద్ధికి వినయోగిస్తాం**


**సాగర్ ఆదివాసీ సభలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క**

నల్లగొండ,జనవరి11 :ఆదివాసీల కోసం చట్టాలు చేసి వాటిని అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

మిగతా 2లో..

## సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యిలు

- భువనగిరి బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి
- కాంగ్రెస్ దాడిని ఖండించిన కెటిఆర్, హరీష్ రావు



భువనగిరి/హైదరాబాద్,జనవరి11 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై భారాస భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని భారాస కార్యాలయంపై

మిగతా 2లో..

## ఢిల్లీలో ముక్కోణపు సిరీస్..!

- ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేడి
- ఆప్ ప్రతిష్టకు సవాల్ కానున్న ఎన్నికలు
- వరుసగా మూడోసారి విజయంతో హ్యాట్రిక్‌పై కన్ను
- ప్రతిష్టగా తీసుకుని పోరాడుతున్న బిజెపి



న్యూఢిల్లీ,జనవరి11:దేశరాజధానికి అసెంబ్లీగా ఉన్న ఢిల్లీ ఎన్నికలపై పట్టుకోసం బిజెపి ఎత్తులు వేస్తోంది. ఇప్పటి వరకు రెండు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఆప్ మరోమారు గెలుపు ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. అయితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ సహా అనేకమంది నేతలు అవినీతి కేసుల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లడంతో ఆప్ ప్రతిష్ట కొంత మసకబారింది. మరోవైపు ఆప్‌కు చెందిన పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలో ఆప్‌కు గతంలో ఉన్న ఛరిష్మా కనబడడం లేదు. అందువల్ల బిజెపి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫిబ్రవరిలో జరిగే ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదన్నది ఆసక్తిగా మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రధానంగా ఢిల్లీ ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది.. ఎందుకంటే దేశానికి

మిగతా 2లో..

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

### - మంత్రి శ్రీధర్ బాబు

**సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా ప్రతినిధులు. ఉన్నతాధికారులు**




మిగతా 2లో..

, హైదరాబాద్ , జనవరి 11: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేద వారికి లబ్ధిచేకూరే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

## గ్రీన్‌కో ప్రాజెక్టుతో తీరనున్న విద్యుత్ సమస్య

**పిన్నాపురం ప్రాజెక్టు ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి**

**ప్రత్యక్షంగా 10వేలమందికి..పరోక్షంగా 40వేలమందికి ఉపాధి**

**ఐటి తరవాత గ్రీన్ ఎనర్జీపై సిఎం చంద్రబాబు దృష్టి**

**అటవీ,రెవెన్యూ శాఖల మధ్య భూసమస్యలపై దృష్టి**

**ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించిన డిప్యూటి సిఎం పవన్**



మిగతా 2లో..

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

- పార్టీలో పనిచేసిన వారికే పదవులు
- సంక్రాంతి తరవతా మంత్రివర్గ విస్తరణపై స్పష్టత
- దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,జనవరి11 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్

మిగతా 2లో..

## రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

- కాలుష్య రహిత వాతావరణం ఏర్పాటు
- గ్రీన్ ఎనర్జీ ద్వారా రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు
- హరిత ఇంధన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు నాయుడు



అమరావతి,జనవరి11 : రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం రానుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యుత్ రంగలో ఇదో విప్లవానికి నాంది కానుందని అన్నారు. రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ తయారవుతుందని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో తయారయ్యే సౌర, పవన, పనీపడ్ స్టోరేజ్ విద్యుత్‌ను పూడిమాడకకు తెస్తే వాటి ద్వారా హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్టి సందర్భంగా హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని దీంతో ఎగుమతులు పెరిగి మనకు లాభం వస్తుందని చెప్పారు.

మిగతా 2లో..

## అయోధ్య రామ మందిరానికి తొలి వార్షికోత్సవం

సంస్కృతి, ఆధ్యాత్మికతకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నో శతాబ్దాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంశంలో ఈ దివ్య, భవ్య అయోధ్య రామాలయం దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

### హైదరాబాద్ తరవాత వరంగల్‌లో రియల్ బూమ్

ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రెడాయి ప్రాపర్టీ షో మూడవ ఎడిషన్ వరంగల్ లో విజయవంతంగా నిర్వహిస్తున్న క్రెడాయి ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్ తరువాత వరంగల్, హనుమకొండ, కాజీపేట మూడు సిటీ లు కలిసి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు.. ఇటీవలే ఈ ప్రాంతంలో ఆరు వేల కోట్లతో ముఖ్యమంత్రి అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రాపర్టీ షో జరుగుతుంది అంటే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంత వాసులు తాము కోనాలనుకున్న ప్రాపర్టీ ఎక్కడికో వెళ్లకుండా ఇక్కడే మనకి నచ్చింది తీసుకోవచ్చున్నారు . ఉత్తర దక్షిణ భారతదేశంలో కలిపే రైల్వే జంక్షన్లు వరంగల్ లో ఉన్నాయని, రాబోయే కాలంలో వరంగల్ నగరానికి ఎయిర్‌పోర్ట్ రాబోతుందని, వైద్య రంగంలో కాకతీయ మెడికల్ కాలేజి ఎంజీఎం లాంటి ప్రభుత్వ హాస్పిటల్ లు ఉన్నాయన్నారు. కాకతీయ యూనివర్సిటీ , నిట్ లాంటి విద్యాసంస్థలు ఉన్నాయని, టెంపుల్ టూరిజం లో సమ్మక్క సారలమ్మ ఆలయం , రామప్ప ఆలయం ,వెయ్యి స్థంభాల గుడి ఉన్నాయన్నారు. వరంగల్ హనుమకొండ కాజీపేట లో మరింత అభివృద్ధి చెందడానికి చుట్టూ జాతీయ రహదారులు ఉన్నాయని, క్రెడాయి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానన్నారు. నియోజకవర్గ రెండు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి..నేను జిల్లా మంత్రిగా మీకు అండగా ఉంటానని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ఛైర్పర్సన్ బండా ప్రకాశ్ , ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వరంగల్ మేయర్ గుండు సుధారాణి,కూడా ఛైర్మన్ ,ఇనగాల వెంకట్ రామిరెడ్డి , క్రెడాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

### సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారాస కార్యాలయంపై దాడి చేసి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఇదిలావుంటే యాదాద్రి భువనగిరి జిల్లా భారాస పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని ఆక్షేపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న భారాస కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ.. అరాచకాలకు చిరునామాగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారాస కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలతో పాటు వారి వెనకున్న నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 'ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాడులు చేసే సంస్కృతిని ఎక్కువైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడి చేస్తే, ఆ పార్టీ నాయకులు భౌతికదాడులకు పాల్పడుతున్నారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ ప్రజాపాలన?' అని హరీశ్ రావు ప్రశ్నించారు.

### ఆదివాసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి

ఇక, చట్టాలను అమలు చేయించుకునే బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తూచా తప్పకుండా అమలు చేసే బాధ్యత నాది అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టే.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు అవుతుంది.. ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్ నిధులను పకడ్బందీగా ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ లో ఆదివాసి ప్రజా ప్రతినిధుల సాధికారత శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఒక లక్ష రూపాయలు అదనంగా ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారుల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉంటారు.. ఒక్క రక్తం చుక్క బయటకు రాకుండా పేదల కోసం తెచ్చిన గొప్ప పథకం ఉపాధి హామీ పథకం.. పోసా చట్టన్ని, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతు బంధు ఉండదని బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసింది.. కానీ, తాము అధికారంలోకి వచ్చాక మారో 2 వేలు అదనంగా కలిపి మొత్తం 12 వేల రూపాయలను ఇవ్వబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, కాంగ్రెస్ నేత కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

### కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిస్తున్నారు

సీఎం రేవంత్ రెడ్డినీ లొట్టపీస్ ముఖ్యమంత్రి అన్నారు ఆయన బాషకు నమస్కారం.. ఆయన మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారు.. విచారణ కాకుండా ఈ ప్రభుత్వం ఏ ఒక్కరినీ అరెస్టు చేయదు.. అది బండి సంజయ్ కి కూడ బాగా తెలుసు.. విచారణ లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని అరెస్ట్ చేయరు.. ఏసీబీ రంగంలోకి రాగానే ఈడీ ఎంటర్ వచ్చింది.. స్టేట్ గవర్నమెంట్ పొల్యూట్ అయిందంటే కేంద్ర ప్రభుత్వం కూడా ఈడీ కూడా ఎందుకు రంగంలోకి వచ్చింది.. అందులో అవినీతి జరిగిందని రుజువైంది కాబట్టి ఈడీ రంగంలోకి వచ్చింది అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతికి ముందే అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేని వారు ఎవరో రెచ్చగొడితే వాళ్ల మాటలు విని మీరు అభద్రతకు లోనూ కావొద్దని చెప్పుకొచ్చారు. అలాగే, ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఇక, రైతు బంధు ఇవ్వలేదని, ఇళ్లు ఇవ్వలేదని మాజీ ముఖ్యమంత్రి టీం దుష్ప్రచారం చేస్తుంటుంది.. వారి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు అని చెప్పారు. అలాగే, యోగ్యమైన భూమి ఉన్న వారందరికీ రైతుబంధు అందిస్తాం.. కానీ, రియల్ ఎస్టేట్ భూములకి మాత్రం ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం చెల్లించదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.ఇక, రైతు బంధు విషయంలో ఎవరు అభద్రతకు లోనూ కావొద్దు అందరికీ ప్రభుత్వ పథకాలు వస్తాయని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపుల్లో ప్రత్యర్థులు రెచ్చగొట్టే చర్యలకు మీరు లోనూ కావద్దు.. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టి వదిలేసిన అన్ని ఇండ్లని పూర్తి చేసి ప్రజలకి అందిస్తాం..

# నెలాఖరులోగా కొత్త ఉస్మానియా నిర్మాణానికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి..)

లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భగా గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించి శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన ఉస్మానియా ఆసుపత్రి, ఇతర నిర్మాణాలకు సంబంధించి నమూనా మ్యాప్ లను సీఎంకు వివరించిన అధికారులు. పలు మార్పులు, చేర్పులను రేవంత్ రెడ్డి సూచించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. ప్రతి ఒక్కరూ ఊరెల్లి నలుగురితో కలవాలి.. ఇక, రాబోయే 50 ఏళ్ల కాలానికి గాను అవసరాలను అంచనా వేసి కొత్త ఆసుపత్రిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రికి నలువైపులా రహదారులు ఉండేలని చూడాలన్నారు. చికిత్స కోసం అన్ని జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను డెవలప్ చేయాలని సూచించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## ఢిల్లీలో ముక్కోణపు సిరీస్..!

(మొదటి పేజీ తరువాయి..)

రాజధానిగా ఉన్న ఢిల్లీలో ఏ పార్టీలో అధికారంలోకి వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. అయితే ఢిల్లీలో ఎవరు గెలుస్తారో అటుంచితో అసలు ఢిల్లీ ఎన్నికలు ఎప్పుడు మొదలయ్యాయి.. మొదటిసారిగా ఎవరు అధికారంలోకి వస్తారు అనే విషయాలపై ఒక్కసారి వెనుక్కు వెళదాం.. ఢిల్లీ లెజిస్టేటీవ్ అసెంబ్లీ మొదటిసారిగా మార్చి 7 1952న పార్ట్ సీ కింద ఏర్పాటైంది. దీనిని హోంమంత్రి కట్జూ ప్రారంభించారు. అసెంబ్లీలో అప్పుడు 48 మంది సభ్యులు ఉన్నారు. ఢిల్లీ ప్రధాన కమిషనర్‌కు సలహాదారు పాత్రలో మంత్రుల మండలి ఉంది. అయినప్పటికీ చట్టాలు చేసే అధికారాలు కూడా దీనికి ఉన్నాయి. మొదటి మంత్రి మండలికి చౌదరి బ్రహ్మప్రకాష్ నాయకత్వం వహించారు. ఆయన ఢిల్లీకి మొదటి ముఖ్యమంత్రి కూడా. అయితే 1953 రాష్ట్రాల పునర్వవస్థీకరణ కమిషన్, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం 1956 ద్వారా రాజ్యాంగ సవరణకు దారితీసింది. ఇది నవంబర్ 1 1956 నుంచి అమలులోకి వచ్చింది. దీని అర్థం ఢిల్లీ ఇకపై పార్ట్ సీ రాష్ట్రం కాకుండా యూనియన్‌గా మార్చబడింది. భారత రాష్ట్రపతి ప్రత్యక్ష పరిపాలనలో పాలించబడింది. దీంతో అప్పటి వరకు ఉన్న శాసన సభ, మంత్రి మండలి కూడా ఒక్కసారిగా రద్దయ్యాయి. తదనంతరం ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1957 అమల్లోకి వచ్చింది. అలాగే 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ 56 మంది ఎన్నికై, ఐదుగురు నామినేట్ చేయబడిన సభ్యులుతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను అధిపతిగా నియమించారు. అయితే కౌన్సిలుకు శాసన అధికారాలు మాత్రం లేకుండాపోయాయి. ఇలా 1990 వరకు కొనసాగుతూ వచ్చింది. మళ్లీ 1993 సంవత్సరంలో ఢిల్లీ 70 శాసన సభా శాసన సభ ఏర్పాటైంది. అయితే 1993 నుంచి 2008 జరిగిన నాలుగుసార్ల ఎన్నికల్లో ప్రజలు ఏకపక్ష తీర్పునిచ్చారు. ఒకసారి బీజేపీకి ఇస్తే, మిగిలిన మూడుసార్లు కాంగ్రెస్సుకు ఇచ్చారు. మొట్టమొదటిసారిగా 2013లో జరిగిన ఎన్నికల్లో హంగు వచ్చింది. ఇందులో బీజేకీ 32 సీట్లు వచ్చి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అప్పటికి పార్టీ స్థాపించి ఒక ఏడాది మాత్రమే అయిన ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసి 28 స్థానాలను కైవశం చేసుకుంది. కేవలం 8 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ ఆప్ పార్టీకి మద్దతు ఇవ్వటంతో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అవినీతి నిరోధక ఎజెండాపై అదికారాన్ని జేజిక్కించుకున్న ఆప్ పార్టీ అవినీతిని దర్యాప్తు చేయటానికి స్వతంత్ర సంస్థను రూపొందించటానికి జన్‌లోక్‌పాల్ బిల్లును ఆమోదించటానికి ముందుకొచ్చింది. కానీ దాని పదవీకాలం రెండు నెలలలోపే ఉండటంతో ఆప్ జాతీయ కన్వీనర్, మొదటిసారి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించడంలో విఫలమయ్యారు. దీంతో ఆయన రాజీనామా చేయడంతో మళ్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. అయితే 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు వచ్చాయి. ఆప్ పార్టీ అఖండ విజయంతో తిరిగి అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీలో సీట్లలో 67 సీట్లు మరియు అత్యదికంగా 54.34 ఓట్ల శాతం సాధించింది. బీజేపీ మూడు స్థానాలు రాగా కాంగ్రెస్ ఖాతా తెరవకుండాపోయింది. అధికారంలోకి వచ్చిన ఆప్‌పార్టీ మహిళలకు ఉచిత నీరు, విద్యుత్, ప్రజా రవాణా సహా అనేక సంక్షేమ పథకాలు అమలుతో ఆప్ పార్టీ 2020 మరోసారి భారీ మెజార్టీ విజయం సాధించింది. అయితే 2025 కంటే కొంచెం తక్కువగా 62 సీట్లు మాత్రమే వచ్చి 53.57 శాతం ఓట్ల శాతానికి సాధించింది. బీజేపీకి 8 స్థానాలు రాగా ఓట్లు శాతం 38.51 శాతానికి పెంచుకుంది. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో కూడా ఖాతా తెరవకుండాపోయింది. అయితే 2025 ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేది వీడని చిక్కుముడిగా మిగిలిపోయింది.

ఎందుకుంటే ఇప్పుడు 2024 గత రెండేళ్లుగా ఆప్‌పార్టీకి అవినీతి మరకలు అంటుకొని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు హోంమంత్రి కూడా జైలు ఊసలు లెక్కించారు. ఇంకా ఆ కేసుపై విచారణ కూడా నడుస్తునే ఉంది. అందుకే ఈ ఎన్నికలు ఆప్‌పార్టీకి చాలా కీలకంగా మారాయి. ఒకవేళ ఈ ఎన్నికల్లో ఓడిపోతే బీజేపీ నుంచి మరింత ఒత్తిడి పెరిగి ఇంకా అనేక కేసులు బనాయించే అవకాశం ఉంది. ఇక బీజేపీకి విషయానికొస్తే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సమయాల్లో కేవలం ఒకేసారి ఒక్కసారి అధికారంలోకి రావటం, ఢిల్లీ దేశ రాజధాని కావడం దానికి పరువు ప్రతిష్టకు సవాల్‌గా మారింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి రాకున్నా అటు ఆప్ పార్టీని, బీజేపీ ఓట్ల పరంగా ఏ మేరకు దెబ్బతిస్తుందో వేచి చూడాలి. అయితే 2024 జరిగిన లోక్‌సభ ఫలితాలను బట్టి చూస్తే 52 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఆధిక్యంలో ఉండగా, 10 స్థానాల్లోనే ఆప్‌పార్టీ ఆధిక్యత కనపిస్తుంది. 8 స్థానాల్లో మాత్రం కాంగ్రెస్ బలంగా కనిపిస్తున్నట్లు ఫలితాలు వచ్చాయి. మరీ వచ్చేనెల 5న జరిగే ఎన్నికల్లో ఢిల్లీ పీఠం ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే..?

## రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

(మొదటి పేజీ తరువాయి..)

అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని తెలిపారు. ఎన్టీపీసీలో బొగ్గు మండించటం ద్వారా వచ్చే కార్బన్ డైయాక్సైడ్‌ని పూడిమడక తెచ్చి హైడ్రోజన్ ఉత్పత్తికి వాడితే కాలుష్యం తగ్గుతుందన్నారు. గ్రీన్ కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టెకోవర్ చేసి గ్రీన్ ఆమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారని చెప్పారు. ఈ ఎ÷-లాంట్ మీద రూ.25వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు జరుగుతాయని చెప్పారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్సెడ్ గ్యాస్ తయారీకి 500కేంద్రాలు పెడుతోందని వివరించారు. ఒక్కో కేంద్రం రూ.130కోట్ల పెట్టుబడి పెడుతున్నారని చెప్పారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుందని తెలిపారు. ఈ గడ్డి పెంచటానికి ఎకరాకు రూ.30వేల కౌలు రైతులకు రిలయన్స్ చెల్లిస్తుందన్నారు. ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుందని చెప్పారు. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ను కుప్పంకి తెచ్చిందన్నారు. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుందని అన్నారు. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుంది. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ని కుప్పంకి తెచ్చింది. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుంది. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాల ఏర్పాటు ఉచితంగా పెడుతున్నాం. మిగిలిన వారికి కూడా సౌర ఫలకాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీ పోను మిగిలిన ఫలకాలను రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ పెట్టుబడి తిరిగి వచ్చే వరకూ కొంత మొత్తం విద్యుత్ వెనక్కి తీసుకుంటాం. ప్రభుత్వ పెట్టుబడి తిరిగి వచ్చాక యూనిట్ మొత్తం ఇంటి యజమానికి అప్పగిస్తాం. కుప్పంలో కొంతమందికి మానసిక ఎదుగుదల సమస్యలు, వినికిడి, మాటలు రాని సమస్యలు ఉన్నాయి. పిల్లల్లో సృజనాత్మకత పెంచటానికి యాప్‌ల సాయంతో శిక్షణ ఇస్తున్నారు. ఇది సత్ఫలితాలు ఇస్తున్నందున రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# గ్రీన్‌కో ప్రాజెక్టుతో తీరనున్న విద్యుత్ సమస్య

(మొదటి పేజీ తరువాయి..)

**కర్నూలు,జనవరి11 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రీన్ కో ప్రాజెక్టు కోసం రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారని, ఇంకా పెడుతూనే ఉన్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. భారతదేశంలో ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టారని పవన్ వెల్లడించారు. కర్నూలులో ఏర్పాటు చేసిన గ్రీన్ కో ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ రంగం తర్వాత గ్రీన్ ఎనర్జీ మీద ఫోకస్ చేస్తున్నారని, అందుకే వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఇలాంటి అద్భుతమైన ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి చెప్పారు. శనివారం కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో ప్రాజెక్టును పవన్ కల్యాణ్ సందర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్‌కో సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుకు సంబంధించి 45 హెక్టార్ల భూమి రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకే తాను వచ్చినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఆఫీసులో కూర్చుని చూడటం వేరని, ఫీల్డ్‌కి వచ్చి నేరుగా చూడటం వేరని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే తానే స్వయంగా గ్రీనో కో ప్రాజెక్టు చూసేందుకు వచ్చినట్లు పవన్ చెప్పుకొచ్చారు. గాలి, నీరు, సౌర కాంతితో విద్యుత్ తయారు చేయడంలో ప్రపంచంలోనే ఇది మొదటి అతిపెద్ద ప్రాజెక్టని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇదో గొప్ప పర్యాటక ప్రాంతం అవుతుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఏపీలో మూడో వంతు విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్టు తీర్చగలదని ఆయన చెప్పారు. ప్రాజెక్టు విషయంలో ఏ వివాదం ఉన్నా.. కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. అటవీ భూములు ఎంతమేర అన్యాక్రాంతం అయ్యాయనే దానిపై త్వరలో డ్రైవ్ పెడతామని ఉపముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఎన్ని ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయి, అలాగే ఇంకా ఎంతమేర మిగిలి ఉన్నాయనే విషయాలను డ్రైవ్ ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. ఆ తర్వాత తానే నేరుగా ఫీల్డ్‌లోకి దిగనున్నట్లు పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది. అందుకు నెల్లూరులో రూ. 36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది. 11.49 ఎకరాలు రైతుల నుంచి గ్రీన్‌కో కంపెనీ తీసుకుంది. గ్రీన్‌కో కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరుంది. దేశంలో రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడి పెడుతోంది. మన రాష్ట్రంలో రూ.35వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం 2,800 ఎకరాల్లో నిర్మిస్తోన్న ప్రాజెక్టు ఇది. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదు. ఈ భూమిపై రెవెన్యూ, అటవీశాఖ మధ్య చిన్న వివాదం వచ్చింది. వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం అని అన్నారు. ఇంత భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉంది. సీఎస్ఆర్ కింద పలు కార్యక్రమాలు చేయాలని కోరుతున్నా. పాఠశాలలు, సేంద్రియ సాగు, గోవుల సంతతి పెంచేలా చూడాలి. 50వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రీన్ కో కంపెనీకి ధన్యవాదాలు' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సుకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసన సభ్యులు పార్లమెంటు సభ్యుల సూచనలను అభిప్రాయాలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఎంపిక చేయుటలో ప్రణాళిక బద్ధకంగా అమలు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామస్థాయిలో మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను వార్డు వద్ద ఉండే విధంగా చూడాలని, గ్రామసభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతంలో టామ్ టామ్ వేయించాలని తెలిపారు. రాబోయే ఉగాది నుండి పౌర సరఫరాల దుకాణాలలో సన్నబియ్యం ఇవ్వటానికి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన తెలియజేశారు. గ్రామస్థాయి, మున్సిపల్ స్థాయిలో పర్యటించే బృందంలో వ్యవసాయ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ప్రతినిధులు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లోభూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడుతలుగా 12,000 అందజేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అవకాశం ఇవ్వాలని అన్నారు. శాసన సభ్యులు సూచించిన విధంగా అర్బన్ ప్రాంతంలో గాని రూరల్ ప్రాంతంలో గాని ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే రెండో విడతలో రాజీవ్ స్వగృహ మాదిరిగా 10 అంతస్తుల భవన సముదాయం నిర్మించి ఇల్లులేని వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు ఎంపికలు 2014 జిఓ ప్రకారం అర్హత గల వారికి వచ్చే విధంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అన్నారు. వ్యవసాయ యోగ్యంకానీ భూములను నిర్ధారించి, రాళ్లు రప్పలు ఉన్న భూములను గుర్తించి, వ్యవసాయం సాగు చేయబడే భూములకు మాత్రమే రైతు భరోసా అందే విధంగా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూఈ నాలుగు పథకాలకు సంబంధించి ఈ నెల 11 నుండి 13 వరకు షెడ్యూలు తయారు చేయడం జరిగిందని, 16 నుండి 20 వరకు ఆయా శాఖల బృందాలు లబ్ధిదారులలో అర్హులను గుర్తించి 21 నుండి 24 వరకు ఆయా గ్రామసభల్లో మున్సిపల్ వార్డులలో లిస్టులను ఉంచడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ యోగ్యం భూములను గుర్తించాలని, కొత్త రేషన్ కార్డులు ఎంపికలు బృందాలుగా వెళ్లి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనిలో 2023-24 సంవత్సరంలో జాబ్ కార్డులు కలిగిన వారిని ఎంపిక చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు శాసన సభ్యులు కొంత మంది రైతులకు రుణమాఫీ రాలేదని, సన్నబియ్యం బోనస్ 500 రూపాయలు కొన్ని ప్రాంతాలలో బ్యాంకుల నుండి రైతులకు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో జమ కాలేదని తెలుపగా దానిపై స్పందించిన మంత్రి వెంటనే లీడ్ బ్యాంక్ అధికారికి వివరాలు ఇచ్చి ఆ రైతుల ఖాతాలో జమ అయ్యే విధంగా చూడాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, అరికె పూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్ కమీషనర్ కె.శశంక,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మూడు జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాగృతం చేసిన స్వామి వివేకానంద !

## సంపాదకీయం



జాతిని భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానంది. ఆయన ఎప్పుడూ యువతను మేల్కొల్పుతూనే ఉంటారు. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే 'డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు'వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా 'గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని' దేనికి భయపడవద్దని అంటారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను' అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను 'నేషనల్ యూత్ డే' గా జరుపుకుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగు తుంది. జీవితానికి అసలైన అర్ధం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేయడం ద్వారా భారత కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. యువత తమ తెలివితేటలతో ఆధునిక భారత నిర్మాణానికి పూనుకోవడం ద్వారానే ఆయనకు నివాళి అర్పించగలదు.. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్దాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఆయనే. తూర్పు దేశాల తత్త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో 1893 లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారత దేశం వచ్చిన వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ఇంతటి ఘనత సాధించిన స్వామి వివేకానంద కేవలం ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది. వివేకానందుడు తన సందేశంలో భారతదేశ మత సామరస్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి వివరించాడు. ప్రాచీన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో దాడులు ఎదుర్కొన్న నుంచి ఇజ్రాయెలీలు, పార్సీలు వంటివారిని స్వీకరించి హృదయాలకు హత్తుకున్న భారతదేశానికి చెందినవాడినని గర్విస్తున్నానన్నాడు. వివిధ మార్గాల ద్వారా సాగిన మానవులంతా భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పే హిందూ సూక్తులను, భగవద్గీత శ్లోకాన్ని ప్రస్తావించాడు. చారిత్రకంగా ఎన్నో నాగరికతలు, దేశాలను నాశనం చేసిన మూఢభక్తి, మతతత్వాలను సర్వమత సమ్మేళనం దూరం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పాడు. తరవాత రామకృష్ణ పరమహంస సాహచర్యలో జీవితం గడిపాడు. రామకృష్ణ పరమహంస నుంచి నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు. కుటుంబ కష్టాలను ఈదుస్తున్న సమయంలోనే 1886లో రామకృష్ణ పరమహంస మరణించారు. రామకృష్ణులవారు చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవారు. వాళ్ళకి నరేంద్రుడు నాయకుడిగా ఉండేవారు. కొంతకాలం తరువాత వివేకానంద దేశమంతటా పర్యటించాలనుకున్నారు. భారతదేశమంతటా ప్రయాణించి భారతీయుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసారు.ఆ సమయంలో పేదవాళ్ళ పరిస్థితి చూసి చలించి పోయారు. భారత దేశం బానిసత్వంలో మగ్గిపోవడానికి, మూఢనమ్మకాలే కారణమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ మతాలను వాటి తత్వాలలను అర్ధం చేసుకున్నారు. భారతీయ ఆద్యాత్మిక సందేశాన్ని ఇతర దేశాలకు అందించాలనుకున్నారు. అలా దేశమంతా పర్యటిస్తూ చివరికి కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ సముద్రంలో కొంత దూరంలో కనపడుతున్న ఒక చిన్న కొండ లాంటి ప్రదేశానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజుల పాటు ధ్యానం చేసారు. ఆ ధ్యానంలో తాను ఇన్ని రోజుల నుండి చుసిన వాటిని స్పష్టంగా అర్ధం చేసుకున్నారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించు కున్నారు. అయితే చికాగో లో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అలా షికాగో ద్వారా భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11 న తేదీన ప్రారంభమయ్యాయి. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ అయ్యి ఉంటారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో 'అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా' అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట. అప్పటి వరకు అందరు 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్' అంటూ స్పీచ్ మొదలు పెట్టారు కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులో ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్ధం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారు. ఆ చప్పట్ల శబ్దం ఆగిన తరువాత ఆయన భారతదేశ గొప్పతనం గురించి మన దేశంలో ఆధ్యాత్మికత, సనాతన దర్మం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. దానితో సభ మొత్తం చప్పట్లతో మారుమోగిపోయింది. సభలో ఉన్న మేధావులు, గొప్ప గొప్ప వాళ్లంతా తమ స్థాయిని కూడా మర్చిపోయి చిన్న పిల్లల్లా ఎగబడుతూ స్టేజి వద్దకు వచ్చి స్వామీజీకి షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అప్పటి వరకు భారత దేశం అంటే, మూఢ నమ్మకాలతో, చెట్లకు పుట్లకు పూజలు చేసే ఒక అనాగరికమైన దేశం అనే భావన ఉన్న వాళ్లందరికీ భారత దేశం పట్ల ఉన్న అపోహలను తొలగించారు. గౌరవం కలిగేలా చేసారు. భారత దేశపు స్థాయిని పెంచారు. ఆ తరువాత కూడా చాలా కాలం పాటు దేశమంతా పర్యటిస్తూ ప్రసంగాలు చేస్తూ, రామకృష్ణ మఠాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. 1902 సంవత్సరం జులై 4 తేదీన రాత్రి 9 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు.

# కృష్ణుడి సేవలో తరించిన గోదాదేవి

***విగ్రహరూపంలో స్వామిని పరిణయామాడిన మహాసాధ్వి***

***సంక్రాంతిక ఇముందు ఏటా గోదా కళ్యాణం ప్రత్యేకం***



శ్రీరంగం,జనవరి11 : మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్-వళై యాయ్' అని అంటుంటాం కదా. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదాదేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు వారి అవతారాల్లో. కానీ గోదా దేవి మానవకన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదల గలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుదరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలో ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బంధించి, బంధించి, ఆయన్ని పొందింది. అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆంధాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీధికి చిత్రవీధి అనే పేరు ఏర్పడిపోయింది. తరువాత వీది ఉత్తరవీది, అక్కడ ఉన్న స్వామి అమ్మని వివాహమాడి గోదాదేవిని తనలో చేర్చుకున్నాడు. మానవకన్యగా ఉన్న ఆండాళ్ తల్లిని ఉత్సవ మూర్తిగా మలచి తానూ ఉత్సవ మూర్తిగా కలిసి ఉన్నాడు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే భక్తుడు ఉండేవాడు. ఈ విల్లిపుత్తూరులోనే శ్రీకృష్ణుడు, మర్రి ఆకు మీద తేలియాడుతూ లోకాన్ని రక్షించాడని నమ్మకం. అందుకే ఇక్కడి ఆలయంలోని ప్రధాన దైవం ఆ చిన్నికృష్ణుడే. విష్ణుచిత్తుడు నిత్యం ఆ కృష్ణునికి పుష్పమాలలని అర్పిస్తూ ఉండేవాడు. ఆయనను విష్ణుభక్తులైన ఆళ్వారులలో ఒకరిగా ఎంచి, ఆయనకు పెరియాళ్వారు అంటే – పెద్ద ఆళ్వారు అన్న గౌరవాన్ని కూడా అందించారు. అలాంటి పెరియాళ్వారు ఒకసారి తులసి మొక్కల కోసం పాదులు తీస్తుండగా ఒక పాప కనిపించింది. ఆమెను సాక్షాత్తూ భగవంతుని ప్రసాదంగా భావించి ఆమెను పెంచుకోసాగాడు విష్ణుచిత్తుడు. ఆమెకు 'కోదై' అంటే – పూలమాల అన్నపేరుతో గారాబంగా పెంచసాగాడు విష్ణుచిత్తుడు. ఆ పేరే క్రమంగా గోదాగా మారింది. గోదాదేవి చిన్ననాటి నుంచి కృష్ణుడి లీలలను ఆడుతూపాడుతూ పెరిగిందే. యుక్తవయసు వచ్చేసరికి ఆ భక్తి కాస్తా ప్రేమగా మారిపోయింది. కళ్లుమూసినా, తెరిచినా ఆ నల్లనివాడే కనిపించసాగాడు. తన చుట్టూ ఉన్న స్నేహితురాళ్లంతా ఒకప్పటి గోపికలనీ, తానుండే విల్లిపుత్తూరు ఒకనాటి గోకులమని భావించసాగింది. అంతేకాదు! తన తండ్రి విష్ణుచిత్తుడు రోజూ భగవంతుని కోసం రూపొందించే మాలలను ముందు తనే ధరించి, తనలో ఆ కృష్ణుని చూసుకుని మురిసిపోయేది. ఈ దృశ్యం ఒకరోజు విష్ణుచిత్తుని కంట పడనే పడింది. తన కూతురు చేసిన పని వల్ల ఇన్నాళ్లూ ఆ దేవదేవుని పట్ల అపచారం జరిగిందని బాధపడ్డాడు. కానీ ఆ రోజు కృష్ణుడు అతనికి కలలో కనిపించి, గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అవతారమేననీ, ఆమె వేసుకున్న మాలలను ధరించిడం వల్ల తనకు అపచారం కాదు కదా, ఆనందం కలుగుతుందనీ తెలియచేశాడు.ఇలాంటి సంఘటనలన్నీ గోదా మనసులో కృష్ణప్రేమని మరింతగా పెంచాయి. ఇలా సాగుతున్న గోదాదేవి ప్రేమకు, ఆ కృష్ణుడు లొంగక తప్పలేదు. దాంతో ఆయన విష్ణుచిత్తునికి కనిపించి, గోదాదేవిని శ్రీరంగానికి తీసుకురమ్మనీ? అక్కడ రంగనాథునిగా వెలసిన తాను గోదాదేవిని వివాహం చేసుకుంటాననీ చెప్పాడు. శ్రీరంగంలోని ఆలయ అర్చకులకు కూడా ఈ విషయాన్ని తెలియచేశాడు. కృష్ణుని ఆదేశాలను విన్న విష్ణుచిత్తుని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే గోదాదేవినీ, విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు. అక్కడ వారి రాక గురించి ముందే తెలిసిన అర్చకులు వారిని ఆలయంలోకి తీసుకువెళ్లారు. పెళ్లికూతురిగా గర్భగుడిలోకి ప్రవేశించిన గోదాదేవి, అందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు భోగిరోజు జరిగింది. అందుకే ప్రతి వైష్ణవాలయంలో భోగినాడు గోదాదేవికి, విష్ణుమూర్తితో కళ్యాణం జరుపుతారు.




# మహాకుంభమేళా విశిష్టత వేరు

***త్రివేణి సంగమంలో స్నానాలు పరమపవిత్రం***

ప్రయాగరాజ్,జనవరి11 : మహాకుంభ మేళా..12 సంవత్సరాలకోసారి వచ్చే హిందువుల మహా సమ్మేళనం. ఇది ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయినలలో మహాకుంభ మేళా నిర్వహిస్తారు.. జనవరి 13 సంక్రాంతి రోజు ప్రారంభమై ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహాకుంభ మేళాకు దేశ విదేశాల నుంచి 40 కోట్ల హిందువులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ హిందూ మహా సమ్మేళనానికి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు..గంగా, యమునా , సరస్వతి నదుల సంగమం అయిన త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు చేస్తారు. 2025 మహాకుంభమేళా 20258 మహా కుంభమేళా అన్ని కుంభమేళాలలో అత్యంత పవిత్రమైనది. ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ప్రత్యేకమైన ఖగోళ పరిణామాలు జరిగే గొప్ప కార్యక్రమంగా భావిస్తున్నరు. దాదాపు 400 మిలియన్ల మంది సందర్శకులు, హిందువులు వస్తారని తెలుస్తోంది. ఇది సాధారణ కుంభమేళా కంటే చాలా ఎక్కువ. 2025 మహాకుంభమేళా లాంటిది తిరిగి 2169 వరకు జరగదు. ఈకుంభ మేళాలో పాల్గొని భక్తులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని మేళా నిర్వాహకులు చెబుతున్నారు.జ్యోతిష్య శాస్త్ర కారకాలు, ముఖ్యంగా గురు గ్రహం, సూర్యుని స్థానాలు ఈ పవిత్రమైన పండుగ సమయాన్ని నిర్ణయిస్తాయని చెబుతున్నారు. ఈ మహా కుంభమేళా సమయంలో స్నానం చేయడం వల్ల పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. జనవరి 13 పౌష్ పూర్ణిమతో ప్రారంభమై ఫిబ్రవరి 26 మహా శివరాత్రితో ముగస్తుంది. మహా కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించ బడుతుంది.ఇది అత్యంత పవిత్రమైనది. పూర్ణ కుంభమేళా: నాలుగు ప్రదేశాలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అర్ధ కుంభమేళా ప్రయాగ్‌రాజ్ ,హరిద్వార్‌లలో ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. మాఘ మేళా: మాఘ మాసంలో (జనవరి--ఫిబ్రవరి) ప్రయాగ్‌రాజ్‌లో సంవత్సరానికోసారి జరుగుతుంది.

# పండగలంటే ఊరు..పాత జ్ఞాపకాలు







నిజామాబాద్,జనవరి11 : రోజులు మారుతున్న కొద్దీ.. జనం పల్లెలు వదిలి పట్నాలకు వలస వస్తున్నారు. అరకొర ఉపాధి దొరికి కొంత ఊరట కలిగినప్పటికీ సొంతూళ్లను మిస్ అవుతున్న ఫీలింగ్ ఏదో మూలన ఉండక మానదు. అందుకే పండగలు, పబ్బాలు వచ్చినప్పుడు సొంతూళ్లకు వెళుతుంటారు.. దసరా, సంక్రాంతి, దీపావళి పండుగలను ఊళ్లకు వెళ్లి జోరుగా జరుపు కుం టారు. ముఖ్యంగా సంక్రాంతి లాంటి పెద్ద పండగ వచ్చిన ప్రతీసారి అటు ఏపీ ప్రజలు ఇటు తెలంగాణ ప్రజలు సొంతూళ్ల బాట పడతారు. గత పల్లె జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంటారు. చరిత్ర పుస్తకాల్లో చదివేది కాదు మన జీవితాలకి మూలం అని తెలియాలంటే ఊరికి దగ్గరలో ఉన్న పాత గడీ, కోటగోడ, పాతగుడి లాంటివి. మనం చిన్న నాడు చదువుకున్న స్కూల్, ఈతకొట్టిన పెద్ద బావి లాంటి ప్రదేశాలన్నీ పిల్లలతో కలసి ఎంజాయ్ చేయాలని ఉంటుంది. పెంకుటిళ్ళూ, మట్టిగోడలూ దాటుతున్నప్పుడూ వాటిమీద దృష్టి పడేలా చెయ్యండి. ఒకప్పుడు మనం తిరిగిన పల్లె ఎలా మారిపోతోందో ఒకసారి గుర్తు చేసుకోవాలని ఎవరికి ఉండదు. అప్పుడప్పుడూ ఆ రోజుల్లోకి వెళ్ళిపోవటం ఇప్పుడు వినటానికి చికాకుగా ఉన్నా గుర్తు చేసుకున్నప్పుడు బాగుంటుంది..... అదే కాదు ఒక్కసారి పిల్లలకి ఇవన్నీ చూపించాక వాళ్ళ ఆలోచనా తీరు ఎలా మారిపోతుందో గమనించొచ్చు.

# వాతావరణంలో మార్పులు

## మరోమారు తుఫాన్ పరిస్థితులు

విశాఖపట్టణం,జనవరి11 : సంక్రాంతి ముందు వాతావరణం మబ్బుగా ఉంటుంది. చలికూడా తీవ్రంగానే ఉంటుంది. అయితే రాబోయే కొద్ది రోజుల్లో.. అంటే సంక్రాంతి పండుగ తర్వాత తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కేరళ వాతావరణ శాఖ రిలీజ్ వెదర్ రిపోర్టులో ఈ మేరకు వివరించింది. ఈ నెలాఖరులో బంగాళాఖాతంలో, హిందూ మహా సముద్రంలో తుఫాన్ ఏర్పడే సూచనలు ఉన్నాయని.. అందుకే వాతావరణంలో విపరీతమైన మార్పులు అని వెల్లడించింది. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో కొన్ని రోజులుగా వేడి వాతావరణం ఉందని.. సంక్రాంతి పండక్కి చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. బంగాళాఖాతం, హిందూమహా సముద్రం నుంచి భూ వాతావరణంలోకి గాలులు పెరిగాయని.. ఈ ప్రభావంతోనే చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని కేరళ వెదర్ రిపోర్ట్ వెల్లడించింది.కేరళ వాతావరణ శాఖ నివేదికల ప్రకారం.. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో రానున్న వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడ నుందని.. ఇది బలపడి వాయుగుండంగా మారనుందని తెలిపింది. ఈ అల్ప పీడన ప్రభావంతో జనవరి 12, 13 తేదీలలో కేరళలో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లొద్దని సూచించింది. కేరళ,-కర్ణాటక, లక్షద్వీప్ తీరాల్లో చేపల వేటకు ఎలాంటి అంతరాయం ఉండదని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 35 నుండి 45 కి.మీ వేగంతో కూడిన బలమైన గాలులు వీస్తాయని.. దీని ప్రభావంతో కేరళ, తమిళనాడులో అక్కడకక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది వెదర్ డిపా÷-టం÷-మెంట్. అలాగే, 11, 12వ తేదీన దక్షిణ తమిళనాడు తీరం, గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లోని కన్యాకుమారి ప్రాంతంలో గంటకు 35 నుండి 45 కిమీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం సంక్రాంతి పండుగ లోపు బలపడి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని.. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వాయుగుండం తీవ్రమై తుఫాన్ గా మారే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాణ అంచనా వేసింది.



%మానవ తప్పిదం కారణంగానే తిరుపతి నగరంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని స్పష్ట మవుతున్నది. తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడు భక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తున్నది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో టిటిడి ఉద్యోగులకు అపారమైన అనుభవం వున్నది. అయితే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా చర్చ జరుగుతున్నది.

జరిగిన ఘటనలో వ్యక్తులకు, సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించలేం. ఏ ఒక్కరూ ఇలాంటివి జరగాలనుకోరు. కాకపోతే ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో తిరుపతిలో ఆరుగురు భక్తులు చనిపోయారు. 40 మంది క్షతగాత్రులయ్యారు.

వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికై చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యంగా కనిపిస్తున్నది. తిరుపతిలో ఏర్పాటు చేసే టికెట్ కేంద్రాలు స్థానికులకు మాత్రమేనని గతంలో ప్రకటించేవారు. ఎవరైనా ఇతర ప్రాంతాల భక్తులు కౌంటర్ల దగ్గరకు వచ్చినా టికెట్లు ఇచ్చేవారు. ఈ దఫా లోపం ఏమంటే%ా% టికెట్ లేని వారిని తిరుమల కొండకు అనుమతించబోమని యాజమాన్యం ప్రకటిం చింది. దీనివల్ల ముఖ్యంగా తమిళనాడు ప్రాంతం నుంచి చాలా పెద్ద సంఖ్యలో ఎలాగైనా వైకుంఠ ద్వారాలలో ప్రవేశం పొందాలనే ఆతృతతో భక్తులు తిరుపతి చేరుకున్నారు. బుధవారం ఉదయానికి దూర ప్రాంతాల నుంచి రాత్రంతా ప్రయాణం చేసి అలసిపోయిన భక్తులు టికెట్ కౌంటర్లకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి టికెట్లు ఇస్తారని ముందస్తుగా అధికారులు ప్రకటన చేసినా బుధవారం ఉదయం 10 గంటలకే కౌంటర్ల దగ్గరకు భక్తులు చేరుకోవడం మొదలైంది. ప్రతి గంటకు భక్తుల సంఖ్య పెరగడం ఉదయం నుంచి కనబడుతూనే ఉంది. పెరుగుతున్న సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పోలీసు యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ఘటన జరిగేది కాదు.టిటిడి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ పలుమార్లు ప్రకటనలు చేశారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని ఏర్పాట్లు చేపట్టామని, 3,000 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో ప్రశాంతమైన వాతావరణంలో దర్శన ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. ఇన్ని వేల మంది పోలీసులను కేటాయించామని చెబుతున్నా కౌంటర్లు దగ్గర భక్తులను నియంత్రించడానికి, క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమిత సంఖ్యలో ఉండటం ఈ దుస్థితికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. టిటిడి టికెట్ కౌంటర్లను తిరుపతిలోని మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నది. వేల సంఖ్యలో జనం రావడం టికెట్లు పొందడం అనేది ప్రతి రోజూ జరిగేది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మూడు కౌంటర్లకు అదనంగా మరో ఐదు కౌంటర్లను టిటిడి ఏర్పాటు చేసింది. తిరుమల కొండపై స్థానికులకు బాలాజీ నగర్‌లో కౌంటర్ ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది కేంద్రాల్లో 90 కౌంటర్లను టిటిడి ఏర్పాటు చేసింది.వాస్తవంగా ఒక్కో కౌంటర్ దగ్గర పది వేల మంది జనం వచ్చినా లైన్ కదులుతూ ఉంటే మేనేజ్ చేయడం పెద్ద సమస్య ఏమీ కాదు. ఇది టిటిడి ఉద్యోగులకు తెలిసిన విద్యే. వచ్చిన జనాన్ని నియంత్రించకపోగా కౌంటర్లకు తాళాలు వేసి లైన్లోకి జనాన్ని పంపకపోవడం దారుణం.జన సమ్మర్ధంగా ఉన్నటువంటి ప్రాంతాల్లో, నివాస ప్రాంతాల్లో సన్నని ఇరుకు దారులలో వీటిని ఏర్పాటు చేయడం, మలమూత్ర విసర్జనకు కూడా అవకాశం లేకుండా ఉండటం, ఆఖరుకు ఆహారం, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ఎక్కడి నుంచో దూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచి ఉండటం అడుగడుగునా కనిపించింది.బైరాగి పట్టెడ లోనైతే గడ్డి తొక్కేస్తారన్న కారణంతో పార్కులో నీళ్లు పట్టేయడంతో ఎక్కడ కూర్చోవాలో తెలియక బురద నీళ్లలోనే వేల మంది నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. గంట గంటకు జనం విపరీతంగా పెరుగుతున్నా పోలీసుల సంఖ్యను పెంచాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన టిటిడి కి, ప్రభుత్వ యంత్రాంగానికి, పోలీసులకు రాకపోవడం అన్యాయం. తిరుపతిలో ఏర్పాటు చేసిన దాదాపు అన్ని కేంద్రాల్లో ఈ తొక్కిసలాటలు, ఘర్షణలు జరిగాయి. రెండు కేంద్రాల్లో భక్తులు మరణించారు. బైరాగి పట్టెడ కేంద్రంలో తొక్కిసలాట తర్వాత అంబులెన్స్ కోసం అర గంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చిందంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దాదాపు అన్ని కేంద్రాల్లో గాయాలపాలైన వాళ్ళు, ఊపిరాడక ఇబ్బందులు పడిన వాళ్ళు, టికెట్లు వద్దని వెనక్కు వెళ్లిపోయిన వారు వందల సంఖ్యలో కనిపించారు. క్యూలైన్ల నిర్వహణలో అడుగడుగునా ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది.

గతంలో క్యూలైన్ల ఏర్పాటును తిరుమల జెఇఓ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు, టిటిడి ఉద్యోగులు సమన్వయంతో నిర్వహించేవారు. ఈ దఫా ప్రతిరోజూ సమీక్షలు చేయడం, గొప్పగా నిర్వహిస్తున్నామని ప్రకటనలు చేయడం వల్ల విపరీతమైన ప్రచారం లభించింది. పూర్వం వైకుంఠ ఏకాదశికి వచ్చేవాళ్ళకి టిక్కెట్ లేకపోయినా సర్వదర్శనానికి అనుమతించేవారు. ఈ దఫా టిక్కెట్ లేకపోతే తిరుమలకు రావడానికి వీల్లేదని ప్రకటన చేయడంతో ప్రతి ఒక్కరూ 'ఏదో రకంగా టిక్కెట్టు సంపాదించాలి. వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాల'న్న ఆత్రుత ఈ తొక్కిసలాటకి కారణమైనట్టుగా కనిపిస్తున్నది.

దర్శనం జరిగే పది రోజులూ టికెట్లు ఇచ్చే పద్ధతి గతంలో ఉండేది. ఇప్పుడు మూడు రోజులకు కుదించడం కూడా ఒత్తిడి పెరగడానికి కారణంగా భక్తులు అంటున్నారు. దర్శనాల విషయంలో టిటిడి కి నిర్దిష్టమైన విధానాలు ఉన్నాయి. వాటి ప్రకారమే నడుస్తుంటుంది. టిటిడి ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం కంటే శ్రీవారి సేవకులను, పోలీసుల్ని నమ్ముకోవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు ఉద్యోగులు వ్యాఖ్యానించారు. స్థానికేతరులు తిరుపతి నగరంలో ఎక్కడ చూసినా కనబడ్డారు. జనం పెరిగిపోవడంతో స్కూలు నుంచి ఇళ్లకు వచ్చే పిల్లల బస్సులు సైతం ఆలస్యంగా నడిచాయి. ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. తిరుపతి నగర ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇలాంటి కేంద్రాలు నివాస ప్రాంతాల్లోనూ జనసమ్మర్ధం ఉండే ప్రాంతాల్లోనూ ఇరుకు వీధుల్లోనూ కాకుండా తారకరామా స్టేడియంలోనూ, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్లలోనూ ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడం, ప్రత్యామ్నాయాలను ఆలోచించక పోవడం వంటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. తిరుపతి ఘటన ఎవరికి ఎంత నష్టం? ఎంత లాభం? అనే లెక్కలు వేసుకుంటూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం దురదృష్టకరం. జరిగిన ఘటనలో బాధితులను ఆదుకోవడం, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా వ్యవహరించాలన్న ఆతృత కంటే ఈ ఘటన నుంచి లాభం ఎంత పొందాలి? ఎదుటి వాళ్లకు నష్టం ఎంత చేయాలి? అన్న దాని మీద ఆత్రుత కనిపిస్తున్నది. రానున్న పది రోజులలోను ఇదే రకంగా జనం వచ్చే పరిస్థితులు ఉన్నందున, మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విఐపి దర్శనాలు రద్దు చేశామని ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో తిరుమల కొండ మొత్తం వారితోనే నిండిపోయింది. విఐపి సంస్కృతి విపరీతంగా పెరిగిపోవడం, ప్రతిదానికీ లెక్కలు కట్టి డబ్బులు వసూలు చేయడం, దర్శనానికి సిఫార్సుల లేఖలు పెరిగిపోవడం పట్ల సామాన్య భక్తుల్లో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. దైవ సన్నిధిలో సామాన్యుడికి సమానత్వం లేకపోతే ఎలా అనే ప్రశ్న అడుగడుగున సంధిస్తున్నారు. ఏ పాపం తెలియని అమాయకులైన భక్తులు వందలు, వేల మైళ్ళ దూరం నుంచి స్వామివారిని దర్శించుకోవాలన్న కాంక్షతో వచ్చి ప్రాణాలు కోల్పోయారు. మృతుల నష్టపరిహారం విషయంలో ప్రభుత్వ ప్రకటన సమంజసంగా లేదు. చనిపోయిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆధ్యాత్మిక సంస్థ టిటిడి పై, రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా వ్యవహరించాలి.

# పిఎం-కిసాన్‌కు రైతు ఐడి లింక్ తప్పనిసరి

## కౌలుదార్లకు మోడీ సర్కార్ కొత్త చిక్కులు



న్యూఢిల్లీ : అన్నదాతలకు అందించే అరకొరసాయానికి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త కొర్రీలు పెడుతోంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్)కు దరఖాస్తు చేసుకోవాలంటే రైతుకు భూమి ఉన్నట్లుగా రైతు గుర్తింపు ఐడిని తప్పనిసరిగా అనుసంధానం చేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనలు విధించింది. ఆంధ్రప్రదేశ్ సహా పది రాష్ట్రాలు ఈ నెల 1 నుంచి ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌తో పాటు అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, యూపీ వంటి రాష్ట్రాలున్నాయి. పిఎం-కిసాన్ లబ్ధిదారులు 11 కోట్ల మంది ఉంటే అందులో 9.25 కోట్ల మంది (అంటే దాదాపు 84 శాతం) ఈ పది రాష్ట్రాల నుంచే ఉండటం గమనార్హం. పిఎం-కిసాన్ కోసం ప్రతినెలా దాదాపు రెండు లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేస్తుండటంతో ఈ నిబంధన తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అయితే దీనివల్ల భూయజమానులకే మాత్రమే సాయం అందుతుందని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు.

## లిస్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీలను పోటీ కి దింపుతాం.: బీసీ సమాజ్

మంచిర్యాల :వ తేదీన హైదరాబాద్ మెదీపట్నం లో బీసీ సమాజ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు మంచిర్యాలకు చెందిన నరెడ్ల శ్రీనివాసును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ గా నియమిస్తూ నియామక పత్రం ఇవ్వడం జరిగింది నియామక పత్రం అందుకున్న నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి బిసి ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న నాపై విశ్వాసంతో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గా నియమించినందుకు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగం సూర్యారావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారా. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కుల జనగణన ఎలాంటి అవకతవకలు లేకుండా నిరుపక్షపాతంగా జరపాలని డిమాండ్ చేశారు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇస్తానన్నటువంటి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీల పాత్ర పై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ స్థానిక సంస్థలు ఎన్నికలలో జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేసే విధంగా కార్యచరణ రూపొందించి ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడం జరుగుతుంది.గ్రామపంచాయతీలలో బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ స్థానాలతో పాటు జనరల్ సీట్లలో కూడా బీసీలను నిలబెట్టే విధంగా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల్లో వ్యవహరించే వ్యూహాలపై అవగాహన సదస్సు లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించి బీసీలను సంఘటితం చేస్తూ బీసీ లనురాజ్యాధికారం వైపు నడిపిస్తామని అయన అన్నారు.

# దేశసేవకు ఇదేనా గుర్తింపు?



### బిఎస్‌ఎఫ్‌లో పాతికేళ్ల సర్వీస్
### విఆర్ఎస్ తీసుకొని
### 16 నెలలు గడిచినా అందని పెన్షన్
### పిడిఎఫ్ ఫైలు డ్యామేజ్ అయిందంటూ కుంటిసాకులు

న్యూఢిల్లీ : ఆయన పేరు హవల్దార్ గౌతమ్ బుచర్. సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్)లో పాతిక సంవత్సరాల 17 రోజుల పాటు పనిచేశారు. 2023 జూలై 31న స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. విఆర్ఎస్ తీసుకున్న వారికి సాధారణంగా ఒకటి రెండు నెలల సమయంలోనే పెన్షన్ రావడం మొదలవుతుంది. అయితే ఈ మాజీ హవల్దార్‌కు నేటికీ పెన్షన్ చేతికి అందలేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం శూన్యం. బిఎస్‌ఎఫ్‌కు చెందిన 31వ బెటాలియన్ ఆయన పెన్షన్ కేసును సంబంధిత విభాగానికి పంపింది. అక్కడి నుండి మరో కార్యాలయానికి వెళ్లింది. వారు ఆ ఫైలును వెనక్కి తిప్పిపంపారు. అందుకు వారు చూపిన కారణం వింటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) పిడిఎఫ్ రూపంలో పంపిన ఫైలు డ్యామేజీ అయిందని, అందువల్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం సాధ్యపడడం లేదని వారు తెలియజేశారు. ఇపిఎఫ్ఓకు చెందిన 'భవిష్య పోర్టల్'లో మాజీ హవల్దార్ పిడిఎఫ్ ఫైలు కన్పించడం లేదు. ఫలితంగా ఆ మాజీ సైనికుడు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. బిఎస్‌ఎఫ్, తపాలా శాఖ, ప్రధానమంత్రి%ా%ఇలా అన్ని విభాగాలకు, పాలకులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా మాజీ హవల్దార్ గౌతమ్‌కు నేటికీ ఊరట లభించలేదు. సమస్య పరిష్కారం కోసం బిఎస్‌ఎఫ్ 31వ బెటాలియన్ కమాండెంట్ 'భవిష్య పోర్టల్' సాంకేతిక బృందాన్ని సంప్రదించారు. అయినా ఒరిగిందేమీ లేదు.

తనకు పెన్షన్ జారీ చేయడంలో జరుగుతున్న జాప్యానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గౌతమ్ కోరుతున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 30న ఆయన ప్రధాని మోడీకి ఓ లేఖ రాస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. పెన్షన్ అనేది అలవెన్సు కాదని, అది ప్రాథమిక హక్కు అని ఆయన ఆ లేఖలో తెలియజేశారు. దేశం కోసం రక్షణ, పౌర సేవలు అందించిన ఓ సైనికుడికి లభించిన గౌరవం ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## క్రెడాయ్ ప్రాపర్టీ షో ను ప్రారంభించిన మంత్రి నారాయణ

విజయవాడ: క్రెడాయ్ విజయవాడ ప్రాపర్టీ షో ను మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని,ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రం లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతింది. భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులను సులభతరం చేస్తూ జీవో లు జారీ చేశాం 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించాం. లే అవుట్ లలో రోడ్లను 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించాము. 15 మీటర్ల లోపు భవనాలు నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేకుండా లైసెన్సెడ్ సర్వేయర్ కు బాధ్యతలు అప్పగిస్తున్నామని అన్నారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నాం. ప్రాపర్టీ షో లో నిర్వహణ ద్వారా కొనుగోలుదారులకు అవగాహన వస్తుంది. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో సమావేశం అవుతాను. ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాననని అన్నారు.

# లీడర్లు కావలెను.. సాగర తీరంలో వైసీపీ వెతుకులాట



విశాఖపట్టణం, జనవరి 10,: రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన భీమిలి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి భీమిలిలో వైసీపీని నడిపించే నాయకుడు లేరు. అలాగే విశాఖ ఈస్ట్‌లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణ పార్టీని వీడలేదు. అలాగని యాక్టివ్‌గా లేరు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వ్యాపార, వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. అలాగే గాజువాక నియోజకవర్గంలో పోటీ చేసిన ఓడిన గుడివాడ అమర్..నియోజకవర్గాన్ని వదిలేశారు. అంతకుముందు ఇంచార్జ్‌గా ఉన్న తిప్పల నాగిరెడ్డి వయోభారంతో యాక్టివ్ కాలేకపోతున్నారు.అనకాపల్లి నియోజకవర్గంలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు జరిగిన అనూహ్య పరిణామాలతో మలసాల భరత్ అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత ఆయన పత్తా లేకుండా పోయారు. దీంతో అనకాపల్లి శ్రేణులకు నాయకుడు లేక క్యాడర్ అనాథలా మారింది. అలాగే పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన గొల్ల బాబూరావు రాజ్యసభకు వెళ్లిపోయారు.ఎన్నికల్లో రాజాం నుంచి వచ్చి పోటీ చేసిన కంబాల జోగులు ఓటమి తర్వాత అంటీ ముట్టనట్లు ఉంటున్నారు. స్థానికేతరుడు కావడంతో అప్పుడప్పుడు వస్తుపోతున్నారు తప్ప శ్రేణులకు అండగా ఉండటం లేదనే వాదన ఉంది. ఇక యలమంచిలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి కన్నబాబు రాజు ఓడిపోయారు. ఆయనకు వయోభారంతో యాక్టివ్‌గా లేరు. నియోజకవర్గంలో తనకు పట్టున్నందున తన కుమారుడు సుకుమార వర్మకు పగ్గాలు అప్పగించాలని కోరుతున్నారు.ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలా అరడజను నియోజకవర్గాలకు వైసీపీని నడిపించే నాథుడు కరువయ్యాడు. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు, ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి నేతలకు తాము టార్గెట్ మారిన నేపథ్యంలో సమస్యలు చెప్పుకునేందుకు..తమకు కనీసం నాయకుడు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు రెడ్ బుక్ పేరుతో స్థానికంగా ఉన్న కూటమి నేతలు టార్గెట్ చేస్తుండటంతో తమకు మానసిక స్థైర్యం ఇచ్చే నాయకుడు లేకపోవడంతో అల్లాడుతున్నారు. ముఖ్యంగా యలమంచిలి, పాయకరావుపేట, విశాఖ ఈస్ట్, భీమిలి నియోజకవర్గాల్లోని కార్యకర్తలు తీవ్ర ఆందోళనలో ఉన్నారట.ఎన్నికల్లో ఓడినప్పటికీ కాస్తో కూస్తో పట్టున్న ప్రాంతాల్లో కూడా లోకల్ లీడర్లకు అండ కరువైంది. గ్రామాల్లోనూ, స్థానికంగా వైసీపీ వర్గీయులుగా ముద్రపడినవారు ధైర్యంగా ఏ అంశానికి బయటకు రాలేకపోతున్నారు. ఏదైనా జరిగితే ఎవరు చూసుకుంటారనే భయం వెంటాడుతోందట. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే ఇటీవల వైసీపీ చేపట్టిన నిరసనలు.కరెంట్ చార్జీలు పెంపు, అన్నదాతకు అండగా వైసీపీ అంటూ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన కార్యక్రమాలు సక్సెస్ కాకపోవడానికి నియోజకవర్గ స్థాయిలో నాయకుడు లేకపోవడమే అంటున్నారు. ఒక ఇంచార్జ్ అంటూ ఉంటే కష్టమో..నష్టమో ఆయన వెంట నడిచే అవకాశం ఉంటుంది. ఏ దిక్కూ లేకపోతే ఎక్కడికి పోతామంటూ క్యాడర్ నిట్టూర్చుతున్నారు.పార్టీ అధినేత జగన్ విశాఖ జిల్లాలో పలు నియోజకవర్గాలకు ఇంచార్జ్‌లను నియమించారు. కానీ ఈ అరడజను స్థానాలపై దృష్టి పెట్టడం లేదంటున్నారు కార్యకర్తలు. అంతేగాక ఇటీవల వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సమావేశాలు పెట్టి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరుతున్నా..నాయకుడు లేకుంటే తాము ఏం చేస్తామని ఎదురు ప్రశ్నిస్తున్నారట.పోనీ నియోజకవర్గ స్థాయిలో నాయకుడు లేకున్నా జిల్లాస్థాయిలోనైనా సరే ఎవరైనా ఉన్నారంటే అదీ కూడా గగనంగా మారిందట. పొరుగు జిల్లాకు చెంది విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బొత్ససత్యనారాయణను అతికష్టం మీద కలుసుకుని బాధలు చెప్పుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.అయితే వైసీపీకి నియోజకవర్గాల్లో నాయకులు లేని దుస్థితిపై రాజకీయవర్గాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. అస్సలు నియోజకవర్గ స్థాయిలో పార్టీని నడిపించే సమర్థత ఉన్న నేతలు లేక జగన్ వదిలేశారా..? ఇప్పుడే ఇంచార్జ్‌లను నియామకం అవసరం లేదని ఖాళీగా ఉంచేశారా అన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి రాబోయే రోజుల్లో వైసీపీ అధినేత ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో..

## పేదల దరి చేరని అత్యవసర సేవలు



న్యూఢిల్లీ : దేశంలో ఆదాయ అసమానతలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని ఓ కార్యాచరణ పత్రం తెలిపింది. పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) అనే సంస్థ రూపొందించిన ఈ పత్రాన్ని ఇటీవలే విడుదల చేశారు. సమ్మిళిత వృద్ధి, సామాజిక-ఆర్థిక సమానత్వం కోసం సమర్థవంతమైన విధానాలను రూపొందించడానికి ఆదాయ పంపిణీని కచ్చితత్వంతో లెక్కించాల్సిన అవసరాన్ని ఈ పత్రం గుర్తు చేసింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ వంటి సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. వ్యక్తులు, కుటుంబాల మధ్య ఆదాయ అసమానతలను నిర్ధారించడానికి ఉపయోగించిన గణాంక పద్ధతి 'గినీ కోఎఫీషియంట్' ప్రకారం అసమానతల సూచీ 1953-55 మధ్య 0.371గా ఉంటే 2022-23లో 0.410గా ఉంది. సమాజంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆ పత్రం తెలిపింది. 2015-16, 2020-21 మధ్యకాలంలో దేశంలో ఆదాయ అసమానతలకు సంబంధించిన గినీ సూచిక 0.395 నుండి 0.528కి పెరిగిందని ప్రైస్ సంస్థ సీఈఓ, కార్యాచరణ పత్రం రూపకర్త రాజేష్ శుక్లా తెలిపారు. వరల్డ్ ఇన్ఈక్వాలిటీ డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారు. కానీ భారతీయ కుటుంబ సర్వేలు మాత్రం సంపన్నుల వాటా జాతీయాదాయంలో 7.3 శాతమేనని చెబుతున్నాయి. దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదాయంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అంటే మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉన్నదని అవి చెబుతున్నాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్య తరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. 1953-55లో 41.5 శాతంగా ఉన్న వాటా 2022-23లో కేవలం 27.3 శాతానికి తగ్గిపోయింది. ఇక జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయంలో 15.8 (2020-21) నుండి 25.5 (1961-65) శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కోవిడ్ సమయంలో ఈ సూచీ 22.8 శాతం మధ్య కొనసాగి మెరుగుదల కనబరచింది. భారతీయ కుటుంబ సర్వేలు, వరల్డ్ ఇన్ఈక్వాలిటీ డాటాబేస్ అంచనాలను పరిశీలిస్తే దేశీయ, అంతర్జాతీయ సర్వేల మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అర్థమవుతోంది. అయినప్పటికీ ఈ రెండు సర్వేలు ఇచ్చిన ముగింపు మాత్రం ఒకేలా ఉంది. దేశంలో అత్యధిక ఆదాయం పొందుతున్న వారి చేతిలోనే సంపద పోగుపడుతోంది. జనాభాలో అట్టడుగున ఉన్న 10 శాతం ప్రజలు మాత్రం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ఆదాయ అసమానతలు అధికంగా ఉన్న దృష్ట్యా స్థిరమైన, సమ్మిళిత ఆర్థిక వ్యూహాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని కార్యాచరణ పత్రం సూచించింది.

# శివంగిలా...సుశీలా



జైపూర్, జనవరి,: శివంగిలాగా బౌలింగ్ చేసే ఆ బాలిక పేరు సుశీలా మీనా ఈమె టాలెంట్ ను సోషల్ మీడియా వేదికగా దిగ్గజ ఇండియన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ వెలుగులోకి తెచ్చాడు. దీంతో ఆనాటి నుంచి సుశీలా మీనా సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ అయింది. ఈమె గురించి చాలామంది ఆరా తీయడం మొదలుపెట్టారు. అలా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. సుశీలా మీనా రాజస్థాన్ రాష్ట్రంలో పేద కుటుంబంలో జన్మించింది. అయినప్పటికీ క్రికెట్ మీద ఆమెకు విపరీతమైన ఇష్టం. అందువల్లే అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో తన టాలెంట్ ను నిరూపించుకుంది. అయితే ఆ అమ్మాయి చేస్తున్న బౌలింగ్ సచిన్ టెండూల్కర్ కు ఆసక్తి కలిగించింది. అందువల్లే ఆమె బౌలింగ్ చేస్తున్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నాడు. అది కాస్త మిలియన్ వ్యూస్ సొంతం చేసుకు. దీంతో ఒక్కసారిగా ఆమె గురించి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలో పర్యటించారు. ఆ సమయంలో సుశీల తో సరదాగా క్రికెట్ ఆడారు. సుశీల వేసిన ఒక బంతి రాజ వర్ధన్ సింగ్ రాథోడ్ బ్యాట్ మధ్యలో నుంచి వెళ్లి వికెట్లను పడగొట్టింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో పెను సంచలనంగా మారింది.సుశీలలో ఉన్న ప్రతిను చూసిన రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్( ఆమెకు ట్రైనింగ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి అయ్యే ఖర్చును మొత్తం రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ భరిస్తోంది. సుశీలలో అద్భుతమైన ప్రతిభ ఉందని.. ఆ ప్రతిభకు సరైన శిక్షణ తోడైతే ఆమె అద్భుతంగా రాణిస్తుందని మాజీ క్రికెటర్లు వ్యాఖ్యానిస్తున్నారు. " సుశీల వయసు చిన్నదే. అయినప్పటికీ ఆమె బౌలింగ్ వేసే విధానం అద్భుతం. అందువల్లే సచిన్ టెండూల్కర్ మనసును చూరగొన్నది. తన ఏకంగా ఆమె వీడియోను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆమె బౌలింగ్ వేసే విధానం ఎంత నచ్చితే సచిన్ ఆ పని చేశారో అర్థం చేసుకోవచ్చు. సుశీలకు ఇదేవిధంగా ట్రైనింగ్ ఇస్తే ఆమె భవిష్యత్ కాలంలో టీమిండియా మహిళల జట్టును కచ్చితంగా లీడ్ చేయగలుగుతుంది. ఎందుకంటే ఆమె మట్టిలో పుట్టిన మాణిక్యం. కచ్చితంగా క్రికెట్ కు సరికొత్త సొబగులు అద్దుతుంది. ఇందులో ఏమాత్రం అనుమానం లేదని" మాజీ క్రికెటర్లు వ్యాఖ్యానిస్తున్నారు.రాజస్థాన్ బాలిక సుశీల మీనా.. అచ్చం జహీర్ ఖాన్ మాదిరిగా బౌలింగ్ వేస్తూ అదరగొడుతోంది. గతంలో ఈమె టాలెంట్ ను సచిన్ బయటపెట్టాడు. తాజాగా ఈ బాలిక బౌలింగ్లో కేంద్రమంత్రి రాజ్య వర్ధన్ సింగ్ రాథోడ్ ను క్లీన్ బౌల్డ్ చేసింది.

# ఖని లో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి

**విదేశీ వ్యవహారల శాఖ మంత్రి జై శంకర్ జి కి లేఖ రాసిన :మద్దెల దినేష్**

**పెద్దపల్లి ఎంపీ పాస్ పోర్ట్ ఖనిలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేయండి**



గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లో ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్ జీ కి లేఖ ద్వారా కోరామని ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, దేశంలో ఆర్థిక వ్యవస్థ మరియు ప్రపంచీకరణ విస్తరించినందున పాస్‌పోర్ట్‌లు మరియు సంబంధిత సేవలకు డిమాండ్ పెరిగిందని ఆయన పేర్కొన్నారు. దీన్ని బట్టి, పాస్‌పోర్ట్ సేవలను మెరుగుపరచడంపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం మే 2010లో పాస్‌పోర్ట్ సేవా ప్రాజెక్ట్ (పి.ఎస్.పి ) ని ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పి.పి.పి) మోడ్ లో అభివృద్ధి చేయబడిన ఈ ప్రాజెక్ట్, పాస్‌పోర్ట్ మరియు సంబంధిత సేవల డెలివరీ కోసం సరళమైన, సమర్థవంతమైన మరియు పారదర్శక విధానాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు.

ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాల జాబితా దేశంలో మొత్తం 37 పాస్‌పోర్ట్ కార్యాలయాలు ఉన్నాయని, పాస్‌పోర్ట్ సేవా ప్రాజెక్ట్‌లో భాగంగా దేశంలో ప్రారంభించబడిన 93 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలకు (పి.ఎస్.కే) ఈ కార్యాలయాలకు అదనమని ఆయన తెలిపారు. దేశంలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాలు (ఆర్.పి.ఓ) దేశంలోని ప్రతి మూలలో ఉన్నా, కొన్ని ప్రధాన కేంద్రాలలో లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు.పెద్దపల్లి జిల్లా గోదావరిఖని దాని పొరుగు ప్రాంతాలలో గణనీయమైన జనాభా ఉందని , వారు ఉపాధి మరియు చదువు, వ్యాపారం, ఇతర ప్రయోజనాల కోసం తరచుగా గల్ఫ్ తో పాటు ఇతర దేశాలకు కూడా వెళ్తారని ఆయన పేర్కొన్నారు. గోదావరిఖనిలో ప్రాంతీయ పాస్‌పోర్ట కార్యాలయం లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫలితంగా, పాస్‌పోర్ట్ సేవలను కోరుకునే వ్యక్తులు కరీంనగర్, నిజామాబాద్, హైద్రాబాద్ లాంటి దూరం ప్రయాణించ వలసి వస్తుందని, దీని వల్ల పాస్ పోర్ట్ కావాల్సిన వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోనే ప్రాంతీయ ప్రత్యేక పాస్‌పోర్ట్ కార్యాలయం లేకపోవడం వల పౌరులకు అనేక సవాళ్లను ఎదురుకుంటున్నారని , సకాలంలో మరియు అవసరమైన పాస్‌పోర్ట్-సంబంధిత సేవలకు వారి ప్రాధాన్యతను అడ్డుకుంటుందన్నారు. గోదావరిఖనిలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం వల్ల స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న భారాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. పాస్ పోర్ట్ దరఖాస్తు ప్రక్రియను క్రమబద్ధీకరించవచ్చు మరియు వారు ప్రస్తుతం పడుతున్న కష్టాలను తగ్గించవచ్చన్నారు. గోదావరిఖనిలో పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభించడం వల్ల ప్రభుత్వ కీలకమైన సేవలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ విషయంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి స్థానిక పెద్దపల్లి ఎంపీ కూడా శ్రద్ధ వహించి ప్రజల అవసరాలను గుర్తించి పరిశీలన చేయాలని, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం గోదావరిఖని వాసులకు సులభతరమైన పరిపాలనా ప్రక్రియలను చేయడానికి ఒక అద్భుతమైన ముందడుగు పడుతుందన్నారు. కేంద్ర మంత్రి మరియు ఎంపీ వంశీ ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటారని మరియు అందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆయన పంపిన లేఖలో కోరామని దినేష్ తెలిపారు

## గోషామహల్ లో మరోసారి కుంగిన చాక్నవాడి నాలా

హైదరాబాద్: దారుస్సలాం రోడ్డు నుండి చాక్నావాడికి వెళ్లే రోడ్డులో ప్లైవుడ్ దుకాణాల ముందు నాలా కుంగిపోయింది. గురువారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో సివరేజ్ పెద్ద నాలా కుంగిపోయింది. పు గతంలో కుంగిన నాలా పనులు కొనసాగుతుండగా మరోవైపు ప్రక్కనే ఉన్న మరో నాలా కుంగి నాలలో క్రషర్ లారీ పడిపోయింది. పెను ప్రమాదం తప్పింది. ప్రాణాలతో లారీ డ్రైవర్ బయటపడ్డాడు. ఇప్పటికి మూడోసారి కుంగిన ఘటన. నాలా మొత్తం పునరుద్ధరించాలని పదే,పదే ఎన్నిసార్లు ప్రభుత్వనికి మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా నాలాలు కుంగడం వల్ల ప్రాణనష్టం జరిగితే ఎవరు బాద్యులు అని ప్రశ్నించారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు..ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. నిత్యం నాలాలు కుంగడం వల్ల రకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని...తమ సమష్యాను పరిష్కరించకపోతే నాలా పై పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతము అని హెచ్చరించారు.

## వరంగల్ లో ఆన్ లైన్ మోసం

వరంగల్, జనవరి : ఆన్ లైన్ ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు పేరున వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీని సైబర్ కేటుగాళు మోసం చేయగా.. సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీ మెయిల్ ఐడీకి 2024 సెప్టెంబర్ 18న గవర్నమెంట్ జాబ్స్, ఇతర ఆన్ లైన్ ఎగ్జామ్స్ కండక్ట్ చేసేందుకు సెంటర్ ఏర్పాటు కోసం బెంగళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ నుంచి మెయిల్ వచ్చింది.బెంగళూరు కు చెందిన సంస్థ, కాలేజీతో కలిసి సంయుక్తంగా ఆన్ లైన్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు అంగీకారం కోసం మెయిల్ పంపించగా.. ఇక్కడి కాలేజీ యాజమాన్యం అందుకు ఒకే చెప్పింది. దీంతో అవతలి వైపు నుంచి పరీక్షల నిర్వహణ కోసం అప్లికేషన్ ఫామ్ ను మెయిల్ ద్వారానే పంపించగా.. దానిని కాలేజీ యాజమాన్యం ఫిల్ చేసి తిరిగి అదే మెయిల్ ఐడీకి పంపించేశారు.ఆ తరువాత ఎగ్జామినేషన్ సెంటర్ అగ్రిమెంట్ కోసం డాక్యుమెంట్స్ పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ యాజమాన్యం ఆ పని కూడా పూర్తి చేసింది.కాలేజీ యాజమాన్యం ఎగ్జామినేషన్ సెంటర్ నిర్వహణకు అగ్రిమెంట్ కాపీలు పంపించగా. రిజిస్ట్రేషన్ కోసం రిఫండబుల్ ఫీజు పేరున రూ.42,600 పంపాల్సిందిగా అవతలి నుంచి రిప్లై వచ్చింది. దీంతో వారు చెప్పిన ప్రకారం కాలేజీ యాజమాన్యం అమౌంట్ పంపించింది. ఆ తరువాత కాలేజీ బిల్డింగ్ ప్లాన్, ఓనర్ షిప్ డాక్యుమెంట్స్, కరెంట్ బిల్, ఇంటర్నెట్ కనెక్షన్ వివరాలు సేకరించి, గత డిసెంబర్ నెలలో ఎగ్జామినేషన్ ఎక్విప్ మెంట్ సంయుక్తంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.2.95 లక్షలు పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ అకౌంట్ నుంచి పంపించారు.తరువాత అదే నెలలో ఎక్విప్ మెంట్, ఫర్నిచర్ ట్రాన్స్ పోర్ట్ కోసం రూ.79 వేలు , ఫర్నిచర్ ఇన్సురెన్స్ పేరున రూ.2.6 లక్షలు పంపించాల్సిందిగా మళ్లీ మెయిల్ చేయడం తో ఆ మొత్తాన్ని కూడా వారు చెప్పిన అకౌంట్ కు బదిలీ చేశారు. ఇంతవరకు బాగానే ఉండగా, ఆ తరువాత సంబంధిత కంపెనీ నుంచి కాలేజీ యాజమాన్యానికి ఎలాంటి ఫోన్ కానీ, మెయిల్ కానీ రాలేదు.ఇదివరకు కాలేజీ యాజమాన్యానికి కాల్స్ వచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసినా కలవకపోవడంతో సంబంధిత వివరాలు జోడించి ఈ నెల 6వ తేదీన పోలీసులకు కాలేజీ ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ 318(4), ఐటీ యాక్ట్ 66డీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# వరుస రైతుల ఆందోళనల వెనుక రాజకీయమా...

రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది.పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి రైతు నేత, క్యాన్సర్ వ్యాధి గ్రస్తుడు 70 ఏళ్ల జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరశన దీక్ష చేపట్టడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. . పంజాబ్ హర్యానా సరిహద్దు లోని ఖనౌరీ శిబిరం వద్ద ఆయన దీక్ష ప్రారంభించడంతో రైతులు గత కొన్నాళ్లుగా సాగిస్తున్న ఆందోళన కొత్త మలుపు తిరిగి మరింత బలోపేతం అయింది. రానురాను ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో సమీప ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని పంజాబ్ ప్రభుత్వం చేతులెత్తేసిందిఇదే సమయంలో దల్లేవాల్ నిరశన దీక్షకు సుప్రీం కోర్టు జోక్యంతో బ్రేక్ పడుతోందన్న తప్పుడు అభిప్రాయం దుమారం రేపింది.ఈ అపనింద పడడంతో పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు మందలించింది. తాము దల్లేవాల్ ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నాం తప్ప ఆయన నిరశన దీక్షకు ఎక్కడా బ్రేకు వేయలేదని వైద్యం తీసుకుంటూ నిరశన దీక్ష సాగించవచ్చని స్పష్టం చేసింది. ఇది అందరికీ తెలియజెప్పాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది. ఇదిలా ఉండగా తమ డిమాండ్లకు కేంద్రం ఒప్పుకుంటేనే దల్లేవాల్ నిరసన దీక్షను విరమిస్తారని రైతు నాయకులు సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ , స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధరకుచట్టబద్ధత , మూడు వ్యవసాయ చట్టాలపై గతంలో ఆందోళన సాగించిన రైతులపై ఉన్న కేసులను ఎత్తి వేయడం ఇవన్నీ నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా, భారతీయ కిసాన్ యూనియన్( ఏక్తా యుగ్రహాన్ ) తదితర ప్రధానవ్యవసాయ సంఘాలు ఎంతగా అభ్యర్థించినా ప్రభుత్వాల నుంచి ఎలాంటి చొరవ కనిపించ లేదు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి హామీ ఇవ్వలేని కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకోవడం రైతులపై కపట ప్రేమ నాటకమే.అమోనియం పాస్ఫేట్ ఎరువుపై అదనపురాయితీ కింద రూ. 3850 కోట్ల వరకు వన్‌టైమ్ ప్యాకేజీగా ఇవ్వడానికి నిర్ణయించినట్టు ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటోంది. ఇక ప్రధాని మోడీ అమాంతం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రగల్భాలు పలుకుతున్నారు. సేద్యానికి ఎరువులు అవసరమే కానీ, పండించిన పంటలే గిట్టుబాటు ధరకు అమ్ముడు పోనప్పుడు ఎరువుల సబ్సిడీ వల్ల రైతులకు ఏం కలిసివస్తుంది ? గతంలో కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలను నిరసిస్తూ రైతులు సాగించిన ఉద్యమాన్ని కేంద్రం ఎంతగా ఉక్కుపాదం మోపి అణగదొక్కిందో, ఎలా నేరస్థులను చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు రైతులపై ప్రేమ నటించడం పిల్లి రొయ్యల మొలతాడు కట్టుకుని రుద్రాక్షమాలలు ధరించిన సామెత గుర్తుకు వస్తుంది. ఆనాడు రైతుల ఆగ్రహానికి బెంబేలెత్తిన మోడీ సర్కారు అప్పటికప్పుడు ఆ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించి చేతులు దులుపుకుంది. కానీ మళ్లీ దొడ్డిదారిన ఆ మూడు వ్యవసాయ చట్టాలను ప్రవేశ పెట్టేందుకు పావులు కదుపుతోందని వార్తలు వస్తున్నాయి.ఈ చట్టాలపై కొత్తగా అభిప్రాయాల సేకరణకు అన్ని రాష్ట్రాలకు కొత్తపాలసీ కాపీలు పంపారని ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆరోపిస్తుండటంలో వాస్తవం లేకపోలేదు. నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీని ఇటీవల కేంద్రం ప్రకటించింది. దీనిని దృష్టిలో పెట్టుకునే కేజ్రీవాల్ దాని గుట్టుబయటపెట్టారు. అయితే విధానపరమైన అంశాలు, శాంతిభద్రతలు, రాజకీయాలు ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నప్రస్తుత పరిస్థితుల్లో సుప్రీం కోర్టు విధించిన గడువు , మార్గదర్శకాలు ఏ విధంగా ప్రభావం చూపిస్తాయో అన్నది చర్చకు వస్తోంది. కోర్టులు ఇందులో జోక్యం చేసుకొనే సంగతి ఎలా ఉన్నా ప్రభుత్వాలు మాత్రం తమవంతు బాధ్యతగా, ఇలాంటి ఆందోళనలకు పరిష్కారం చూపించడమే సమంజసం. రైతుల డిమాండ్లు ప్రభుత్వం ముందు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయ సంక్షోభం బహుముఖాలుగా వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో నెలలు, సంవత్సరాల పాటు శాశ్వతంగా రైతులు ధర్నాలు, నిరసనలు కొనసాగించడం , ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దేశానికి నష్టమే. దల్లేవాలా దీక్ష విరమించాలని వస్తున్న అభ్యర్థనలను ఆయన మద్దతుదారులు పక్కన పెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలా అభ్యర్థనలు చేస్తున్నవారు ప్రభుత్వ ఏజెంట్లన్న ముద్ర పడుతోంది. అలాగే కొందరి ఒత్తిళ్ల వల్ల దల్లేవాల్ దీక్షను కొనసాగిస్తున్నారన్న ఆపోహలకు తావీయరాదు. దల్లేవాల్ ఒంటరిగా దీక్ష చేయడం కన్నా ఉమ్మడిగా కొంతమంది రైతులతో కలిసి దీక్ష కొనసాగించడం ఆయన ఆరోగ్యానికి భద్రత కలిగిస్తుందని కొందరు రైతు నాయకులు సలహాలు ఇస్తున్నారు. వీటిని దల్లేవాల్ వర్గీయులు పరిశీలన లోకి తీసుకోవడం అవసరం. ఈ పరిస్థితుల్లో దల్లేవాలా ఆరోగ్యానికి ఎలాంటి ముప్పుకలగబోదని . హర్యానా, పంజాబ్ , కేంద్ర ప్రభుత్వాలు భరోసా ఇవ్వడం తక్షణ కర్తవ్యం. ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుక్కూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.ఇదిలా ఉండగా, రైతులతో చర్చలు ఎప్పుడు ప్రారంభిస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాను మీడియా ప్రశ్నించగా, సుప్రీం కోర్టు సూచనల మేరకు తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని వెల్లడించారు. అంటే కేంద్ర అధిష్ఠాన కటాక్షం పైనే అంతా ఆధారపడి ఉందన్న మాట!

# రోజూ ఒక కప్పు ద్రాక్ష పండ్లను తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే పండ్లలో ద్రాక్ష పండ్లు కూడా ఒకటి. చలికాలంలో ఇవి మనకు విరివిగా లభిస్తుంటాయి. ముఖ్యంగా ఆకుపచ్చ, నలుపు రంగుల్లో ఉండే ద్రాక్షలను చాలా మంది తింటుంటారు. అలాగే ఎరుపు రంగులో ఉండే ద్రాక్ష కూడా మనకు లభిస్తుంది. అయితే ద్రాక్ష పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. ద్రాక్ష పండ్లలో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా అనేక యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి. వ్యాధుల నుంచి రక్షణ అందిస్తాయి. కనుక ద్రాక్ష పండ్లను రోజూ తినాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. **గుండె పనితీరుకు..:** ద్రాక్ష పండ్లలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. అలాగే కాటెకిన్స్, యాంథో సయనిన్స్ కూడా ఉంటాయి. ఇవన్నీ యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. కనుక ద్రాక్ష పండ్లను తింటే ఇవి మనకు లభిస్తాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలను డ్యామేజ్ అవకుండా రక్షిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ పండ్లను తింటే పొటాషియం అధికంగా లభిస్తుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. హైబీపీ ఉన్నవారికి ద్రాక్ష పండ్లు ఎంతగానో మేలు చేస్తాయి. ఇవి కండరాల పనితీరును సరిచేస్తాయి. దీంతో శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి.

**షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి..:** ద్రాక్ష పండ్లలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. ద్రాక్ష పండ్లలో విటమిన్ కె కూడా అధికంగానే ఉంటుంది. ఇది గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం జరగకుండా చూసుకోవచ్చు. దీని వల్ల గుండె సైతం ఆరోగ్యంగా ఉంటుంది. ద్రాక్ష పండ్లలో విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ద్రాక్ష పండ్లలో మెలటోనిన్ అధికంగా ఉంటుంది. ఇది ఒక హార్మోన్. నిద్రను నియంత్రిస్తుంది. కనుక నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజూ ద్రాక్ష పండ్లను తింటే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్ర పడుతుంది. **కళ్ల ఆరోగ్యానికి..:** ద్రాక్ష పండ్లలో రెస్వెరెట్రాల్ అనే పాలిఫినాల్ సమ్మేళనం ఉంటుంది. ఇది గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చు. ద్రాక్ష పండ్లలో లుటీన్, జియాజాంతిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కెరోటినాయిడ్స్ జాబితాకు చెందుతాయి. ఇవి కళ్లను సూర్యుని నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాల బారి నుంచి రక్షిస్తాయి. దీంతో కళ్లు సురక్షితంగా ఉంటాయి. ఇలా ద్రాక్ష పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది.

# నకిలీ డాక్టర్ మామూలుగా లేదుగా



అదిలాబాద్, : ఎంబీబీఎస్ అని రాసుకున్నంత మాత్రాన డాక్టర్లు కారు. కామారెడ్డి జిల్లాలో ఇట్టాంటి వ్యవహారమే వ్యవహారం కలకలం రేపింది. షైన్ స్టార్ హాస్పిటల్‌లో తనిఖీలు చేస్తే ఫేక్ డాక్టర్ దగాపర్వం బయటపడింది. మందమర్రి మండలం రామకృష్ణ పూర్‌కు చెందిన రవీందర్? ఫేక్ డాక్టర్ సర్టిఫికెట్‌తో పెద్ద కథే నడిపాడు. డిగ్రీ ఫెయిల్.. కానీ ఎంబీబీఎస్ పూర్తి చేసినట్టు కటింగ్ ఇస్తూ ఎందర్నో బురిడీ కొట్టించాడు. రవీందర్ అనేరియల్‌డాక్టర్ సర్టిఫికెట్లను డూప్లికేటు చేశాడు. అతని ఫోటో వున్న తన ఫోటో అతికించాడు. గాంధీ ఆస్పత్రిలో పనిచేసినట్టు బాగా కవర్ చేశాడు. హాస్పిటల్ యాజమాన్యాలను బురిడీ కొట్టించి గత మూడేళ్లుగా ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో పనిచేశాడు. దొరికితే దొంగ దొరకనంత వరకు దర్జాగా డాక్టర్ బాబుగా కటింగ్ ఇచ్చాడు. ఇతను రాసిన ప్రిస్క్రిప్షన్ చూసి? సమ్ థింగ్ ఈజ్ రాంగ్ అని పసిగట్టిన ఓ వ్యక్తి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంకేం అతను పనిచేస్తున్న హాస్పిటల్‌కు వెళ్లి సర్టిఫికెట్లు వెరిఫై చేస్తే అసలు సంగతి బయటపడింది. దొరకనంత వరకు డాక్టర్‌బాబుగా దర్జా వెలగబెట్టిన ముల్కల రవీందర్..కామారెడ్డి ఖాకీలకు అడ్డంగా బుక్కయ్యాడు. ఎంబీబీఎస్ చదవకుండా డాక్టర్‌గా ఎలా మేనేజ్ చేశాడు. ఆరా తీస్తే నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. తనిఖీ చేస్తే ఫేక్ ఆధార్ కార్డు, మరికొన్ని ఫేక్ సర్టిఫికెట్స్ దొరికాయి. అతని దగ్గరి నుంచి సెల్ ఫోన్, ల్యాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఇతనొక్కడే..ఇతనితో దంటగట్టిన ఇలాంటి బాపతుగాళ్లు ఇంకా వున్నారా? అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు కామారెడ్డి పోలీసులు.

# ప్రజలందరు ఆయురారోగ్యాలతో జీవించాలి

**-శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు**

**-వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న శ్రీను బాబు**

మంథని : మంథని నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని మంథని పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామిని కోరుకున్నట్లు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిల్ల శ్రీను బాబు తెలిపారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంథని పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయన్ని దుద్దిల్ల శ్రీను బాబు సందర్శించి స్వామి వారినిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీనుబాబు ని శాలువతో సత్కరించారు. దైవ దర్శనానికి ఆలయానికి వచ్చిన భక్తులను శ్రీనుబాబు ఆప్యాయంగా పలకరించారు. ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని



మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్ లతోపాటు ఇతర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జమ్మికుంట బస్టాండ్ లో కనీస సౌకర్యాలు కల్పించండి..



జమ్మికుంట : జమ్మికుంట పట్టణం వ్యాపారాపరంగా అభివృద్ధి చెందినదిగా పేరు గాంచింది జమ్మికుంట పట్టణ ప్రజలే కాకుండా చుట్టూ నాలుగు మండల మరియు వివిధ జిల్లాల ప్రజలు కూడ బస్సు ద్వారా రాకపోకలు జరుపుతారు కానీ జమ్మికుంట బస్టాండ్ లో మరుగుదొడ్లు అసౌకర్యవంతగా ఉండటం వల్ల పురుషులు మహిళలు సైతం చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు అదేవిధంగా వాహనాల పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు ప్రయాణికులను దించడానికి వచ్చిన వాహనాలు బస్టాండ్ లోపలకి వచ్చి వారి బంధువులను దింపేలోపే ఆర్టీసీ, కానిస్టేబుల్ దొంగచాటున వెనకనుండి ఫొటోస్ తీసి చాలాన్లు వేస్తున్నారు కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్ మరియు

**సిపిఐ జమ్మికుంట పట్టణ నాయకులు లింగంపల్లి అన్వేష్..**


మరుగుదొడ్లు ఏర్పాటు చేసి పర్మనెంట్ గా ఒక ఆర్టీసీ, కానిస్టేబుల్ ని నియమించి బస్టాండ్ లోపల కాకుండా బస్టాండ్ బయట ఉండి వాహనాలను లోపలకి రాకుండా చూసి చాలాన్ల నుంచి సామాన్య ప్రజలకి విముక్తి కల్పించాలని సిపిఐ జమ్మికుంట పట్టణ నాయకులు లింగంపెల్లి అన్వేష్, డిమాండ్ చేశారు..



# బోనస్ ఎగవేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

**సన్నాల పేరుతో బోనస్ కుట్ర చేసిన కాంగ్రెస్**

**రైతు బంధు, రుణమాఫీ బోనస్ అందించడంలో విఫలం**



నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుబంధు, బోనస్ అందించడంలో విఫలం చెందిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33.958 మంది రైతులకు 85.24 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు చెల్లించలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు వరంగల్ రైతు డిక్లరేషన్ లో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు రైతులను ఆదుకోవడంలో విఫలమైందాన్నారు.యాసంగి పంటకాలం ప్రారంభమై రైతు వ్యవసాయం పనులు చేసుకుంటుంటే వారికి పెట్టుబడి సాయం కిందా అందవలసిన రైతు భరోసా అనేక షరతులు విధించి రేపు మాపు అంటూ ఆలస్యం చేస్తూన్నారని విమర్శించాడు.యూరియా కొరతా,కరెంటు కోత,రైతుబారొసా ,బోనస్ అందక రైతులను గోసపెడుతున్నారని తెలిపారు.

# ఉష్...అది ఆయుష్...!.?

- **ప్రభుత్వం మారినా పాతవాసనలే..!**
- **అడ్డగోలు జి,ఓకు బలవుతున్న బడుగులు**
- **అంతా వారి కనుసన్నల్లోనే...**
- **అడిగితే అవమానాలు..వేధింపులు**
- **తీరు మారని ఆయుష్కు చికిత్స అత్యవసరం (గిరిధర్ ఆలూరి)**

ఆయుష్ శాఖ అంటే ఒకప్పుడు నిఖార్సైన శాఖ,రోగుల సేవ తప్ప మరో ధ్యాసలేని వైద్యులు,సిబ్బంది..అటెండర్ స్థాయి నుంచి డైరక్టర్ దాకా వారి వారి పనులు వారు నిశ్చింతగా చేసుకుంటూ పోయేవారు.అన్ని వ్యవస్థలలోనూ జోక్యం చేసుకుని వాటిని సర్వనాశనం చేసిన గత ప్రభుత్వం ఈ ఆయుష్లోనూ వైరస్లా జొరబడిరది. అలోపతి వైద్యవిధానంలో సైతం నయం కాని చాలా జబ్బులను నయం చేసే ఆయుష్ విభాగం తన శాఖలో జొరబడిన వైరస్ను కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటినా ఏమీ చేయలేని దుస్థితిలో వుంది.వై.ఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకున్న అడ్డుగోలు నిర్ణయాలతో ఆయుష్లో వైద్యం తక్కువ వేదన ఎక్కువగా మారింది. మందుల కొనుగోలు, ఇష్టా రీతిన బదిలీలు,డెప్యుటేషన్లు చేపట్టి ప్రశాంతంగా వుండేశాఖలోఅలజడులుసృష్టించారు.చివరకు ఆయుష్ శాఖలో ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, అనుకూలమైన ప్రదేశాలకు బదిలీలకు కూడా గండి కొడుతూ 16.03.2024 న తీసుకువచ్చిన జి.ఓ 53 పూర్తిగా ఆయుష్ ఉసురుతీసేలా మారింది, ఈ జి.ఓ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది ఎస్సీ,ఎస్టీ మైనారిటీలే.

ఆయుష్ శాఖలోని ఎస్సీ,ఎస్టీలకు చెందాల్సిన ఉన్నత పోస్టులను ఇతర పోస్టులకు మారుస్తూ గత ఆయుష్ కమిషనర్ 2024 ఏడాది ఫిబ్రవరిలో ఓ ప్రతిపాదన చేయడంతో అప్పటి ప్రభుత్వం ఆఘ మేఘా ల మీదఆయన ప్రతిపాదనలను కనీసం పరిశీలించకుండా, దాని లో టుపాట్లను ఏమాత్రంపరిగణనలోకి తీసుకోకుండా 16.03.2024న జి.ఒ.ఎం.ఎస్ నెం.53 ను విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోగుట్టుచప్పుడు లేకుండా తీసుకువచ్చిన ఈ జి.ఓ వల్ల అప్పటిదాకా కొనసాగుతున్న హేతుబద్ధత లేకుండా పోయింది. ఆయుష్లో కేడర్ స్ట్రెంత్ విషయానికి వస్తే ఆరు పోస్టుల విభజనలో 4 ప్రాంతీయ ఉపసంచాలకుల పోస్టుల్లో రెండు పోస్టులు ఆయు ర్వేదం,ఒక పోస్టు యునాని,మరొకటి హోమియోకు కేటాయించారు. ఉదాహరణకు కర్నూలు జిల్లా బనగానిపల్లె ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి చీఫ్మెడికల్ ఆఫీసర్ పోస్టు జిల్లా అదనపు డైరక్టర్ (ఆయుర్వేదం) గా అప్గ్రేడ్ చేయబడిరది.

ఇన్స్ట్రక్టర్ పోస్ట్ 2005 మార్చి 14న జారీ చేసిన జి.ఓ 67 ప్రకారం బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ కు చెందినది,1956లో ఆయుష్ శాఖ ఏర్పడిన తరువాత ఇన్స్ట్రక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్యులతో భర్తీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క యునానీ మెడికల్ స్టోర్ కూడా లేదు.ఆయుర్వేదం విషయానికి వస్తే రాష్ట్రవ్యాప్తంగా అనేక ఫార్మసీలు, డిస్పెన్సరీలు,ఆసుపత్రులు వుండటంతో ఇన్స్ట్రక్టర్ పోస్టును ఆయుర్వేద వైద్యులతో భర్తీచేశారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన ఉద్యోగ విభజనలో ఇన్స్ట్రక్టర్బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్య విధానం కోసం రాష్ట్రానికి కేటా యించారు. ఇన్స్ట్రక్టర్ బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ తోపాటు తత్సమానమైననవారింటెండెంట్ /సి.ఎం.ఓ/ ఆర్.ఎం.ఓ పోస్టులుకేంద్రంసూచించిన మార్గనిర్దేశనంలో పేర్కొన బడ్డాయి.ఈ కేడర్ స్ట్రెంత్ 4గా మారుతుంది.

ఇదిలా వుండగా రీజన్ డిప్యూటీ డైరక్టర్ పోస్టులు నాలుగు ఆంధ్రప్రదేశ్కు 2 పోస్టులు తెలంగాణకు కేటాయించారు.ఆ నాలుగు రీజనల్ డిప్యూటీ డైర్టర్ పోస్టులను ఆయుర్వేదం,యునానీ,హోమియో విభా గాలకు 2:1:1 నిష్పత్తిగా పంపిణీ చేశారు.దీంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించేది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 53 జి.ఓ ప్రకారం పరిపాలనా విభాగం పూర్తిగా గందరగోళంగా మారింది.యునానిలో ఆసు పత్రీలేదు, ఫార్మసీలేదు అయినా 2023లో జరిగిన సాధారణ బదిలీలలో ఇన్స్ట్రక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టు యునాని విభాగంతో భర్తీ చేశారు. దీంతో కేడర్ స్ట్రెంత్ నాలుగుకు పడిపోయింది, కేడర్స్రెంత్ 6 కంటే తక్కువ వుంటే పదోన్నతులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించదు,దీని పర్యవసానంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ,ఎస్టీల కేడర్ తగ్గి వారు రూల్ ఆఫ్ రిజర్వేషన్కు దూరం అయ్యారు. ఇది ఒక రకంగా రాజ్యాంగం ఎస్సీ.ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రక్రియకు విఘాతం కలిగించడమే అవుతుంది.ఇన్ని సున్నితమైన అంశాలను పక్కనబెట్టి మొండిగా ఈ జి.ఓను అప్పటి ప్రభుత్వంలో అమలుచేసిన కీలక అధికారులే ఇప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.జి.ఓ నెం53 మీద అనేక మంది అనేక రకాలుగా తమ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా అవి ప్రభుత్వ పెద్దలదాకా వెళ్ళ కుండా చేయడంలోనూ ఆ కీలక అధికారులు తమ చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

కేవలం కొందరు వ్యక్తుల ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే ఈ జి.ఓ తీసుకువచ్చి కొన్ని పోస్టులను తొలగించారు.ఈ జి.ఓను కూడా ఎన్నికల నియమావళి అమలులో వున్నపుడు నోట్ఫైల్ ద్వారా కేబినెట్ ఆమోదం తీసుకుని అమలుచేయడం వెనుక ఎందరు పెద్దల హస్తం వుందోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ చీకటి జి,ఓ వెనుక ఎ.పి సెక్రటీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడుగా అప్పట్లో పనిచేసిన వెంకటరామిరెడ్డి కీలక పాత్ర పోషించా రన్నది నిర్వివాదాంశం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియమితులైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికీ ఆ శాఖ మీద పూర్తి పట్టు సాధించలేదు.ఆయన మాట కీలక అధికారులు పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.శాఖలో పెత్తనం అప్పుడూ..ఇప్పుడూ ఒకరిద్దరు కీలక అధికారులదే. వీరు తమ శాఖలో ఎన్ని లొసుగులు వున్నా వాటిని తమ పలుకుబడితో కప్పేస్తుంటారని ఆ శాఖలో ఎవరిని అడిగినా చెబుతారు.సాక్షాత్తూ ముఖ్యమంత్రిని కూడా తప్పుదోవ పట్టించే శక్తి సామర్థ్యాలున్న కీలక అధికారుల విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే ఉద్యోగుల్లో తీవ్ర నిరసనలు ఎదురవ్వక తప్పదు.

మందుల కొనుగోలులో దారుణాలు

ఇక గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో మందుల కొనుగోలు అంశలో కూడా అనేక అక్రమాలు జరిగాయి. ఆయుష్ మందుల కొనుగోలు కోసం జగన్ ప్రభుత్వం గోవాకు చెందిన ఓ కంపెనీ నుంచి 20 కోట్లతో కొనుగోలు చేశారు.ఈ కంపెనీకి మన ప్రభుత్వం ఆర్డ్స్ ఇచ్చే నాటికే పలు రాష్ట్రాలు ఆ కంపెనీని బ్లాక్లిస్టులో పెట్టాయి.ఇక్కడ ఇంకో ముఖ్య మైన అంశం పరిశీలిస్తే ఆ కంపెనీ మందులు సరఫరా చేయక మునుపే మొత్తం నగదును చెల్లించేశారు.దీని వెనుక అప్పటి సి.ఎం.ఓలో ఓ కీలక అధికారితో పాటు,వైద్య ఆరోగ్యశాఖ,ఆయుష్ విభాగంలోని కీలక అధికారుల పాత్ర వుందని తెలసింది.గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో కీలక అధికారిగా వున్న ఓ అధికారి కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా మూడునెలల పాటు కొనసాగారు.మందుల కొనుగోలు విషయంలో వచ్చిన ఆరోపణలపై కూటమి ప్రభుత్వంవిచారణకు ఆదేశింగా 14 డిస్పెన్సరీలలో తనిఖీలు చేయగా అసలు చాలా చోట్ల మందులే కని పించలేదు. విశాఖపట్టణం,ఏలూరు,ఒంగోలు,కడప ప్రాంతీయ విభాగాల పరిధిలో విచారణ మొదలు కాగానే కొందరు ఉన్నతాధికారుల ఒత్తిడితో ఆ విచారణ అర్ధంతరంగా ముగిసింది. అప్పటికే విచారణ బృందం శాంపుల్గా చేసిన తనీఖీలలో దాదాపు 2 కోట్ల రూపాయల విలువచేసేమందులు కనిపించలేదు. ఇక పూర్తి స్థాయిలో విచారణచేసి వుంటే మరింత అవినీతి బయటపడేది. ఇక మరో అంశం విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదం,యునాని వైద్యవిధానాలను గ్రామీణుల చెంతకు ఆశా వర్కర్ల ద్వారా తీసుకువచ్చేందుకు దాదా పు 5 కోట్ల రూపాయలు కేంద్రం నిధులు మంజూరు చేసింది.ఈ నిధులు పూర్తిగా తమకు కావాల్సిన వారికి దొడ్డిదారిన చెల్లించి తూతూ మంత్రంగా ఈ కార్యక్రమాన్ని ముగించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచి వున్న ఆయుష్లో కీలక అధికారి కూటమి ప్రభుత్వంలోనూ తన హవా కొనసాగించారు.చివరకు కొందరు మహిళా ఉద్యోగుల ఫిర్యాదుతో అతనని తప్పించి మరొకరిని కూటమి ప్రభుత్వం నియమించింది,ఎంతో ఉన్నతాశయంతో ఏర్పడ్డ ఆయుష్ విభాగానికి మంచి నిబద్ధత కలిగిన అధికారి అప్పగించి తిరిగి గాడిన పెట్టాలని,ఆ దిశగా ప్రభుత్వం యోచిస్తుందని ఆశిద్దాం.

జమ్మికుంట బస్టాండ్ లో కనీస సౌకర్యాలు కల్పించండి..

సిపిఐ జమ్మికుంట పట్టణ నాయకులు లింగంపల్లి అన్వేష్..



జమ్మికుంట : జమ్మికుంట పట్టణం వ్యాపారాపరంగా అభివృద్ధి చెందినదిగా పేరు గాంచింది జమ్మికుంట పట్టణ ప్రజలే కాకుండా చుట్టూ నాలుగు మండల మరియు వివిధ జిల్లాల ప్రజలు కూడ బస్సు ద్వారా రాకపోకలు జరుపుతారు కానీ జమ్మికుంట బస్టాండ్ లో మరుగుదొడ్లు అసౌకర్యవంతగా ఉండటం వల్ల పురుషులు మహిళలు సైతం చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు అదేవిధంగా వాహనాల పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు ప్రయాణికులను దించడానికి వచ్చిన వాహనాలు బస్టాండ్ లోపలకి వచ్చి వారి బంధువులను దింపేలోపే ఆర్టీసీ, కానిస్టేబుల్ దొంగచాటున వెనకనుండి ఫొటోస్ తీసి చాలాన్లు వేస్తున్నారు కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్ మరియు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి పర్మనెంట్ గా ఒక ఆర్టీసీ, కానిస్టేబుల్ ని నియమించి బస్టాండ్ లోపల కాకుండా బస్టాండ్ బయట ఉండి వాహనాలను లోపలకి రాకుండా చూసి చాలాన్ల నుంచి సామాన్య ప్రజలకి విముక్తి కల్పించాలని సిపిఐ జమ్మికుంట పట్టణ నాయకులు లింగంపెల్లి అన్వేష్, డిమాండ్ చేశారు..



నాలుగోసారి ఢిల్లీ ఎన్నికల బరిలో దిగుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోమారు సీఎం కుర్చీపై కన్నేశారు. పదకొండేండ్ల క్రితం 2013లో తొలిసారి పోటీ చేసి మెజారిటీ రాకున్నా ఆయన సీఎం అయ్యారు. అయితే, 48 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత వరుసగా 2015, 2020 ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించారు. అయితే, ఈసారి మాత్రం బీజేపీ రూపంలో ఆయనకు పెనుసవాలు ఎదురుకాబోతున్నది. ఫిబ్రవరి 5న జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకొని పెట్టుకున్నది. 1998 డిసెంబర్‌లో ఓడిన తర్వాత బీజేపీ ఇప్పటివరకు అక్కడ అధికారంలోకి రాలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తున్నా ఢిల్లీ సీఎం పీఠం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మారింది. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నది. 'ఆప్' ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తున్నది. ఇక, 1998–2013 మధ్య 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్క సీటూ గెలువలేకపోయింది. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధిస్తున్న 'ఆప్'కు పార్లమెంటు ఎన్నికలు మాత్రం కొరుకుడుపడటం లేదు. ఏడు స్థానాల్లో ఒక్కటంటే ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేక చతికిలపడుతున్నది. గత ఎన్నికల్లో విజయం సాధించిన కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతూ వస్తున్నది. కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న ఢిల్లీలో అంతంత మాత్రంగానే ఉండే అధికారాలను కూడా అడ్డుకుంటున్నది. తనకు అనుకూలమైన లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించుకొని అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. 'ఆప్'లో నంబర్ టూగా పరిగణించే ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అవినీతి కేసులో నెలలపాటు నిర్బంధించింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అరెస్ట్ అయిన ఆయన 5 నెలలపాటు జైలులో గడిపారు. బెయిలుపై బయటకు వచ్చాక సెప్టెంబర్ 17న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి క్యాబినెట్‌లో కీలక సభ్యురాలు ఆతిశీ మార్లెనాకు ప్రభుత్వ పగ్గాలు అప్పగించారు. కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్థురాలు, విధేయురాలైన మంత్రిగా పనిచేసిన ఆమె నేతృత్వంలోని 'ఆప్' సర్కారు పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త వాటిని ప్రకటించింది. వాటిలో ముఖ్యమైనది 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు ప్రతినెల రూ. 1000 చొప్పున అందిస్తారు. కాంగ్రెస్, బీజేపీ కూడా ఇలాంటి నగదు బదిలీ పథకాలనే పోటాపోటీగా ప్రకటించాయి. ప్రజా సంక్షేమ పథకాలతోపాటు విద్య, వైద్య రంగాల్లో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు చేసిన మేలు కారణంగా ఈ ఎన్నికల్లో సైతం విజయంపై 'ఆప్' ధీమాగా ఉన్నది.

అయితే, రాజకీయ పండితులు మాత్రం ఈ అసెంబ్లీ ఎన్నికలు పాలకపక్షమైన 'ఆప్'కు అత్యంత కఠిన పరీక్షగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు. 'ఆప్' అగ్రనేతల్లో చాలామంది నిన్నమొన్నటి వరకు వివిధ అవినీతి కేసుల్లో నిర్బంధంలో ఉన్నారు. అయినా, కేజ్రీవాల్ దూకుడు, పోరాట పటిమతో ఎన్నికల ప్రచారంలో జాతీయపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ కన్నా చాలా ముందున్నట్టు కనిపిస్తున్నది. ఇప్పటికే అన్ని సీట్లకూ ఆప్ తమ అభ్యర్థులను ప్రకటించింది. 29 స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. గతంలో 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్నా దేశంలోని మిగతా ప్రాంతాల్లో మాదిరిగానే హస్తినలో కూడా జనం మద్దతును కాంగ్రెస్ కోల్పోయింది. గత పదేండ్లుగా ఢిల్లీ అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని ఈ జాతీయపక్షం గతమెంతో ఘనమనే భ్రమల నుంచి ఇంకా బయటపడటం లేదు. ఒంటరి పోరుకు భయపడుతున్న ఈ పార్టీ చివరి క్షణంలోనైనా 'ఆప్'తో పొత్తు కుదరకపోతుందా అనే ఆశతో కాలం గడుపుతున్నది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ పొత్తు మంచి ఫలితాలు ఇవ్వకపోగా 'ఆప్'కు నష్టదాయకంగా మార్చింది. పొరుగున్న ఉన్న హరియాణాలో మాదిరిగానే ఆప్, కాంగ్రెస్ మధ్య ఢిల్లీలో పొత్తు ఉండదని కేజ్రీవాల్ ఇది వరకే ప్రకటించారు. ఈడీ, సీబీఐలను 'ఆప్' నేతలపై ఆయుధాలుగా వాడిన బీజేపీ విషయానికి వస్తే కేజ్రీవాల్ మళ్లీ అధికారంలోకి రాకుండా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. ఒకవేళ 'ఆప్' గతంలో మాదిరిగా భారీ మెజారిటీతో గెలిచినా ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడానికి న్యాయపరమైన చిక్కులున్నాయా? లేవా? అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాస్త కోలుకుందనుకున్న కాంగ్రెస్ ఇటీవలి హరియాణా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో చావు దెబ్బతిన్న కారణంగా ఢిల్లీ రేసులో అసలు ఉందా? అనే అనుమానం వస్తున్నది. ఫిర్ లాయేంగే కేజ్రీవాల్' (కేజ్రీవాల్‌ను మళ్లీ గద్దెనెక్కిద్దాం) అనే ఆమ్ ఆద్మీ పార్టీ నినాదానికి, 'బదల్ కే రహేంగే' (పాలకపక్షాన్ని మార్చేద్దాం) అనే బీజేపీ పిలుపు మధ్య జరుగుతున్న ప్రజా సమరంలో గెలుపు ఎవరిదో వచ్చే ఫిబ్రవరి 8న జరిగే ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

## ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానం



భద్రాద్రి మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడం కోసం ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి కన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతులు పొందిన స్ఫూర్తి, గీతాంజలి, లావణ్య, శ్రీ పూజ, సింధు లకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఓజిరవి, సూపరింటెండెంట్ టిఎన్ జ్యోతి రాణి, సయదిప్తాకర్, ఏటీవోలు జి వి కృష్ణారావు, ఏ నరసయ్య, ఎం. శ్రీనివాసరావు, వేణుగోపాల్ నాయుడు, రాజేందర్, పూర్ణచందర్రావు, నరేష్, దేవకరణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీ, ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట : భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి,: తొక్కిసలాట ఘటనకు టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా వైకుంఠ ఏకాదశి పేరుతో సమీక్షలు నిర్వహించారే తప్పా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. టీటీడీలో పనిచేసే వారు తక్కువయ్యారని పర్యవేక్షించేవారు ఎక్కువ అయ్యారని అన్నారు. దర్శనాలకు సంబంధించిన అంశం పూర్తిగా తిరుమల అడిషనల్ ఈవో వెంకన్నకు సంబంధించిందని ఆయనకు చంద్రబాబు సేవ తప్ప భక్తుల సేవ కనబడటంలేదని విమర్శించారు. ఈ ఘటనలో అడిషన్ ఈవో వెంకన్నచౌదరితో పాటు ఎస్పీ, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ఈవోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పిన పవనానంద స్వామి దీనిపై మాట్లాడాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోహిత్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# 20 నాటికి భరోసా లబ్ధిదారుల జాబితా

నల్గొండ, : తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఈ నెల 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అయితే ఇప్పటికే దీనికి సంబంధించిన విధివిధానాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పూర్తిగా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా నిధులు వర్తిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు కాకుండా, రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఉపయోగించిన భూమిని మినహాయించి మిగిలిన అన్ని భూములకు ఈ రైతు భరోసాను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి రైతు ఖాతాలో పన్నెండు వేల రూపాయలు దీంతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా పన్నెండు వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటన చేసిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ వ్యవసాయ యోగ్యమైన భూముల వివరాలను సేకరిస్తున్నారు. అలాగే లబ్దిదారుల వివరాలను కూడా నోట్ చేసుకుంటున్నారు. కానీ పంట భూముల్లో వేయకపోయినా ఆ భూమి వ్యవసాయ యోగ్యమైనదిగా ఉంటే చాలు దానికి రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. పంట ఎప్పుడు వేశారన్నది కాకుండా.. ఎప్పుడైనా పంట వేసుకునే అవకాశం ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా నిధులను ఆ యా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జనవరి 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో విడతల వారీగా ఈ నిధులను జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అరవై లక్షల మంది వరకూ...



ఈ పథకం కింద దాదాపు అరవై లక్షల మంది రైతుల వరకూ లబ్ది పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీ నాటికి లబ్దిదారుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. తొలి విడతగా ఎకరానికి ఆరు వేల రూపాయలు చెల్లించనున్నారు. అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలలకు కూడా రెండు విడతలుగా నగదు చెల్లించాలని నిర్ణయించారు. ఇందుకోసంఇప్పటికే నిధులను కూడా సిద్ధం చేశారు. ఒక్క వ్యవసాయ కూలీలకు ఇచ్చే ఆత్మీయ భరోసాకు 700 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేసి ఈ మేరకు నిధులను సిద్ధం చేసి పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను అధికారికంగా ప్రభుత్వం విడుదల చేయనుంది.

# కరువుతో 1.44 లక్షల మంది రైతులకు నష్టం

**రూ.151.77 కోట్లు సాయం చేయాలి**

**ఖరీఫ్ 2024 కరువు సాయంపై కేంద్రానికి నివేదిక**

**రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా కేంద్ర బృందంతో సమావేశం**

అమరావతి : రాష్ట్రంలో కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర బృందం సభ్యులు రైతులకు సాయం అందించేలా ఉదారంగా స్పందించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను వారికి వివరించారు. ఖరీఫ్ 2024 కరువు పరిస్థితులు, పంట నష్టం వివరాలపైనా నివేదిక అందించారు. ఐదు జిల్లాల్లో 1.06 లక్షల హెక్టార్లలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. వారిని ఆదుకునేందుకు రూ.151.77 కోట్లు సాయం చేయాలని కోరారు. ఐదు జిల్లాల్లో 54 మండలాలు (అన్నమయ్య 19, చిత్తూరు 16, సత్యసాయి 10, అనంతపురం 7, కర్నూలు 2) మండలాను ప్రకటించామని తెలిపారు. వాటిల్లో 27 తీవ్ర కరువు మండలాలుగానూ, 22 మధ్యస్థ కరువు మండలాలుగానూ కేంద్ర నిబంధనల ప్రకారమే కరువుగా ప్రాంతాలుగా ప్రకటించామని తెలిపారు. పత్తి, జొన్న, వేరుశనగ, ఎర్రశనగలు, మొక్కజొన్న వంటి 14 రకాల పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో 80 శాతం సబ్సిడీకి విత్తనాలు, రూ.55 కోట్ల వ్యయంతో పశుగ్రాసం విత్తనాలు 60 శాతం సబ్సిడీపై అందించామని తెలిపారు. 40 శాతం సబ్సిడీపై చాప్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టామని సిసోడియా వివరించారు. వ్యవసాయశాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.90.52 కోట్లు, రూరల్ వాటర్ సరఫరా కోసం రూ.0.72 కోట్లు, అర్బన్ వాటర్ సరఫరా కోసం రూ.4.89 కోట్లు, పశు సంవర్ధకశాఖకు రూ.55.47 కోట్ల ఆర్థికసాయం అవసరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని రైతులను ఆదుకోవడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ పెరిన్‌దేవి మాట్లాడుతూ కరువు వల్ల నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వెల్లడించారు. పంట నష్టం జరిగి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు చూస్తామని చెప్పారు. కరువు ప్రాంత జిల్లాల్లో వాస్తవ పరిస్థితులను గమనించామని, అన్ని విషయాలనూ సమగ్రంగా కేంద్రానికి నివేదిస్తామని చెప్పారు. వీలైనంత త్వరంగా సాయం అందించేందుకు సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. కేంద్రం బృందంలో సుప్రియా మాలిక్, అనూరాధ బట్నా, దీపాంకర్ సేథ్, ప్రదీప్‌కుమార్, మన్నూజీ ఉపాధ్యాయ, జయంతి, కె.పొన్నుస్వామి తదితరులు ఉన్నారు.

# పంచాయితీల నుంచి ట్రాక్టర్లు జప్తు

అదిలాబాద్, జనవరి 10. : పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కోనుగోలు చేసిన చెత్త సేకరణ ట్రాక్టర్ల బకాయిల పంచాయితీ ముదిరింది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్రాక్టర్ల కొనుగోలుకు సం బంధించి కిస్తీలు చెల్లించకపోవడంతో టాక్టర్లను జప్తు చేస్తామంటూ షోరూం యజమా నులు పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్మల్ జిల్లా అధికారుల్లో కలవరం సృష్టిస్తున్నది. లీడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికే కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో షోరూంల యజమానులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి సంప్రదింపులకే పరిమితమవుతున్నారని బకాయిలు చెల్లించడం లేదని యజమానులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని 2021–22 సంవత్సరంలో ప్రభుత్వ గ్యారంటీ కింద టాక్టర్లు మంజూరు చేసింది. జీరో ఆడ్వాన్స్ కింద ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనాలని అప్పట్లో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. జిల్లా మొత్తం 396 గ్రామ పంచాయతీలు ఉండగా 396 ట్రాక్టర్లను లీడ్ బ్యాంక్ అధికారుల ప్రోత్సాహంతో కిస్తీల రూపంలో చెల్లిం చే విధంగా టాక్టర్లు కొన్నారు. కొన్ని నెలల వరకు కిస్తీలు చెల్లించినా.. ఆ తర్వాత ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అంతా తలకిందులైంది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటం, ప్రభుత్వాలు ప్రతి నెల విడుదల చేయాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో కిస్తీల చెల్లింపు నిలిచి పోయాయి. నిర్మల్ జిల్లాలో 92 పంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీల బకాయిలు పేరుకుపో యాయి. మొత్తం రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బకాయి ఏడాది క్రితమే చెల్లించా ల్సి ఉండగా నిధులు లేమితో చెల్లించకపోవడంతో వడ్డీ వేయడంతో మరింత భారం పడుతున్నది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆలోపే బకాయిలు చెల్లించాలని బ్యాంకర్లు, షో రూ ం యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో ట్రాక్టర్‌ల కిస్తీలు బకాయిలు ఉన్న మాట నిజమే. నిధుల కొరత కారణంగా చెల్లింపులో ఆలస్యమవుతున్నది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న పంచాయతీల కిస్తీలు చెల్లించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మిగిలిన బకాయిలు చెల్లిస్తాం. నిర్మల్ జిల్లాలో బ్యాంకు గ్యారంటీ కింద అధికారుల ఆదేశాల మేరకు వివిధ వివిధ బ్యాంకుల ద్వారా 396 పంచాయతీలకు టాక్టర్ రుణాలు ఇచ్చాం. ఇప్పటికి జిల్లాలో 92 టాక్టర్ల కిస్తీలు రూ.65 లక్షలు బకాయి ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక బకాయిలు చెల్లించడంలేదు. ఉన్నతాధికారుల నుంచి బాకాయిల చెల్లింపుల కోసం ఒత్తిడి తేవడంతో ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. బాకాయిలు చెల్లిస్తామని చెపుతున్నారుగానీ చెల్లించడంలేదు. కిస్తీలు కట్టకుంటే షో రూం యజమానులు ట్రాక్టర్లను తీసుకెళ్తామంటున్నారు.

# సకల సమస్యలకు,చదువే సర్వరోగ నివారిణి



**మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్**

**-ఎల్లవేళలా మీకు అందుబాటులో పోలీస్ శాఖ**

**-రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ**

**-హాజరైన ఆదివాసి గ్రామాల ప్రజానికం**

తాండూర్ : మనకు నిత్య జీవితంలో ఎదురయ్యే సకల సమస్యలకు చదువే సర్వరోగ నివారిణి అని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తాండూరు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారి వారి వ్యాపారాలు చూసుకుంటూనే ఆదివాసి గ్రామాల ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు వచ్చిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని అభినందించారు. ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పించినప్పటికీ మన పిల్లలను చదువుకు దూరంగా ఉంచడం సరికాదని ఆయన గ్రామ ప్రజలకు సూచించారు. ఈ దేశ మూలవాసులు ఆదివాసులేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీలకు ఉన్న చరిత్ర ఎంతో చారిత్రాత్మకమైనదన్నారు. మన ఆదివాసి గూడాల నుండి చైతన్యవంతుడైన కొమరం బీమ్ ను ఆదర్శంగా తీసుకొని మన పిల్లలను ఎదగనివ్వాలన్నారు. పదవ తరగతి నుండి పై చదువులకు కూడా వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి కనుక ఉద్యోగం వచ్చేవరకు వారిని చదవమని ప్రోత్సహించాలన్నారు. ఒక గ్రామంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉంటే ఆ ప్రభావం ఆ గ్రామం పైన కాకుండా చుట్టుపక్కల గ్రామాల పైన కూడా పడుతుందన్నారు. ఇన్ని గ్రామాల్లో కేవలం ఇద్దరే ఇద్దరు ప్రభుత్వ సర్వెంట్లు ఉండడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఈ గ్రామాల నుండి ప్రభుత్వ ఉద్యోగులు రావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇక్కడి ఎస్ఐ , సిఐలు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ గ్రామాల్లో చదువులో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని ఆయన సూచించారు. అంతకుముందు ఆదివాసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ వారు పంపిణీ కోసం తెచ్చిన దుప్పట్లను, తదితర సామాగ్రిని ఆదివాసి గ్రామాల ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్,తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి,ఎస్సై లు సౌజన్య, కిరణ్ కుమార్,అదనపు ఎస్సై షేక్ హుస్సేన్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల బ్లడ్ బ్యాంకు ఇంచార్జి సురభి శరత్ కుమార్,లక్ష్మణ్,సంతోష్,మాజీ ఎంపీటీసి సూరం రవీందర్ రెడ్డి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుందుడుకు ట్రంప్



**ఢిల్లీ,:**అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికై అతి త్వరలో పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు అంతకంతకూ వివాదాస్పదం అవుతున్నాయి. దేశాల మధ్య సంబంధాల్లో ఉండే దౌత్యపరమైన గౌరవాలు, మర్యాదలు బేఖాతరుకు గురవుతున్న పోకడలు కనిపిస్తున్నాయి. ట్రంప్ ధోరణి నిజానికి మొదటి నుంచీ సంప్రదాయాలకు భిన్నంగానే ఉంటున్నది. అది ఇప్పుడు దుందుడుకు, దుస్సాహసిక వాగ్ధాటితో మరింతగా శ్రుతి మించుతున్నదని చెప్పక తప్పదు. ట్రంప్ విస్తరణవాద తరహాలో మాట్లాడుతుండటం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా పొరుగు దేశమైన కెనడాను 51వ రాష్ట్రంగా కలిపేసుకుంటామని ట్రంప్ బాంబు పేల్చారు. కెనడాకు అమెరికా సైనికంగా, ఆర్థికంగా చాలా సాయం చేస్తున్నదనీ, అందుకు బదులుగా ఏమీ పొందడం లేదనీ అంటున్నారు. కెనడాను కలిపేసుకునేందుకు 'ఆర్థిక శక్తి'ని ఉపయోగిస్తామనీ చెప్తున్నారు. కెనడా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ పెంచుతామనీ బెదిరిస్తున్నారు. దీనిపై కెనడాలో సహజంగానే గగ్గోలు బయలుదేరింది. ఇదిలా ఉండగానే పనామా కాలువ చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయనీ, ఆ నౌకా మార్గాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందనీ మరో దౌత్య వివాదానికి ట్రంప్ తెరతీశారు. ట్రంప్ చేస్తున్న ప్రతిపాదనలు కొంత హాస్యాస్పదంగానూ ఉంటున్నాయి. ట్రంప్ ప్రకటనలు కొన్ని దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా గ్రీన్‌ల్యాండ్ వ్యవహారం. ప్రస్తుతం డెన్మార్క్‌లో స్వయంపాలిత ప్రాంతంగా ఉన్న ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సైనికచర్య ఉపయోగించే అవకాశాన్ని కాదనలేమనీ అంటుండటమే అసలు సమస్య. యూరప్‌లో పలుకుబడి కలిగిన జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు దీనిపై ప్రతికూలంగా స్పందించాయి. దేశాలు చిన్నవైనా, పెద్దవైనా పరస్పర సార్వభౌమాధికారాన్ని గౌరవించుకోవాలని జర్మనీ చాన్సలర్ హితవు చెప్పడం గమనార్హం. అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమి నాటోలో జర్మనీ, ఫ్రాన్స్ కీలక సభ్య దేశాలనేది తెలిసిందే. అటు డెన్మార్క్ కూడా గ్రీన్ ల్యాండ్‌పై తుది నిర్ణయాధికారం అక్కడి ప్రజలదేనని ట్రంప్ ప్రకటనను ఖండించడం వివాదం ముదరడాన్ని సూచిస్తున్నది. నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకునే ప్రతిపాదనలపైనా ట్రంప్ నీళ్లు చల్లారు. తన పక్కలో బల్లాన్ని రష్యా ఎందుకు అంగీకరిస్తుందని ఆయన చేసిన ప్రకటన అమెరికాలోని ఆయన సమర్థకులను సైతం విస్మయానికి గురిచేసింది. దేశాలను, ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం గురించే కాకుండా భౌగోళికంగా సుప్రసిద్ధమైన పేరు మార్పిడి మీద కూడా ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. మెక్సికో అఖాతం పేరు అమెరికా అఖాతంగా మార్చాలని సంచలనం కలిగించారు. పరిపాలన పగ్గాలు చేపట్టక ముందే ధోరణి ఇలా ఉంటే తర్వాత ఇంకెలా ఉంటుందోనని ట్రంప్ గుబులు పుట్టిస్తున్నారు. ఇప్పటికే అనేక యుద్ధాలతో, ఘర్షణలతో ప్రపంచం కునారిల్లుతున్నది. తీవ్ర పర్యవసానాలకు దారితీసే విషయాలపై ట్రంప్ అలవోకగా ప్రకటనలు చేస్తుండటం విశ్వశాంతికి విపత్కరమని చెప్పక తప్పదు. ప్రపంచ పెద్దన్నగా వ్యవహరించాల్సిన ఏకైక అగ్రరాజ్యం ఉద్రిక్తతలకు ఆజ్యం పోయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

# నేతలకు రెండు సార్లు మాత్రమే పదవులు

## తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ క్లారిటీ

కాకినాడ, : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సీనియర్ నేతలకు క్లారిటీ ఇచ్చారు. ఎవరూ రెండుసార్లు ఒకే పదవిలో ఉండటానికి వీలు లేదని చెప్పారు. వరసగా రెండుసార్లు పదవిలో ఉంటే అంతకంటే ఉన్నత పదవికైనా వెళ్లాలి.. లేదంటే పూర్తిగా ఒక విడత విరామాన్ని ప్రకటించాలని ఆయన చేసిన ప్రకటన సీనియర్లను ఉద్దేశించి చేసినట్లుగానే కనపడుతుంది. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతలు పార్టీకి ఇబ్బందిగా మారారు. నియోజకవర్గాలను వారు వదలరు. అలాగే గెలిచిన తర్వాత మంత్రి పదవుల కోసమో.. మరో ముఖ్యమైన పదవుల కోసమో పట్టుబట్టడం మామూలయి పోయింది. అయితే ఈసారి కొంత చంద్రబాబు యువకులకు కేబినెట్ లో అవకాశం కల్పించారు. అందుకే కొందరు సీనియర్లు గుర్రుగా ఉన్నారు. తమకు పదవులు దక్కలేదన్న ఆక్రోశంతో ఉన్నారు. యనమల రామకృష్ణుడు వంటి నేతలయితే ఒకడుగు ముందుకేసి పార్టీ లైన్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. తూర్పు గోదావరి, నెల్లూరు, రాయలసీమ లోని అనేక జిల్లాల్లో సీనియర్ నేతలు టీడీపీలోనే ఎక్కువగా ఉన్నారు. నెల్లూరు జిల్లాను తీసుకుంటే టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మంత్రిపదవి దక్కేది. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో యనమల రామకృష్ణుడు, చిత్తూరు జిల్లాలో గతంలో బొజ్జల, గాలి ముద్దు కృష్ణమ నాయుడు లాంటి వారికి మంత్రి పదవులు దక్కేవి. ఈ ఇద్దరు దివంగతులు కావడం వల్లనే కొత్త వారికి అవకాశం లభిస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో అచ్చెన్నాయుడు, కళావెంకట్రావు వంటి వారికి మాత్రమే పదవులు లభించేవి.. కానీ ఈసారి సంప్రదాయాన్ని చంద్రబాబు పూర్తిగా మార్చేశారు. అచ్చెన్నాయుడుకు మాత్రం పదవి ఇచ్చారు. విజయనగరం జిల్లాలో సీనియర్ నేతలున్నప్పటికీ కొందరికి టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరించారు. గెలిచిన తర్వాత మంత్రి పదవులకు



కూడా దక్కలేదు. మొన్నటి కేబినెట్ లోనే లోకేష్ చెప్పిన ఈ విధానాన్ని దాదాపు అమలు చేయడంతో సీనియర్ నేతలకు ఎవరికీ పదవులు దక్కలేదు. గుంటూరు జిల్లాలో పత్తిపాటి పుల్లారావు వంటి నేతలను కూడా పక్కన పెట్టారు. దీంతో లోకేష్ జమానా మొదలయిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపించాయి. సీనియర్ నేతలను పక్కన పెడుతున్నారన్న ప్రచారం ఆ పార్టీలో కిందిస్థాయి నుంచి బాగా బలపడిం. తాజాగా లోకేష్ ఇచ్చిన క్లారిటీతో ఒకవ్యక్తికి రెండుసార్లు మాత్రమే పదవి వస్తుందని చెప్పడంతో ఒకింతగా ఆశావహులు పార్టీ బలోపేతం కోసం పనిచేసే అవకాశాలున్నాయి. ముఖ్యంగా యువత ముందుకు రావాలనే ఈ రకమైన కామెంట్స్ ను లోకేష్ చేసినట్లు కనపడుతుంది. అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి వంటి నియోజకవర్గా లలో ఆయనను తప్పించి మరొకరికి టిక్కెట్ లభించే ఛాన్స్ లేదని భావించి పార్టీ కార్యకర్తగానే తాము ఎల్లకాలం పనిచేయాలన్న ధోరణిలో ఉన్న వారికి లోకేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త ఆశలను చిగురింప చేశాయనే చెప్పాలి. యువతను ఆకట్టుకునేందుకు, పార్టీలో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు లోకేష్ వ్యాఖ్యలు మరింతగా ఉపయోగపడతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

# కనుచూపు మేరలో కానరాని పరిష్కారం !



## గాజాలో 15 మాసాల దాడుల్లో 46 వేల మంది పాలస్తీనియన్లు మృతి

## లక్ష దాటిన క్షతగాత్రులు

గాజా : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో సాగిస్తున్న అమానవీయ దాడులకు ఇప్పట్లో తెర పడేలా లేదు. గాజాలో కొనసాగిస్తున్న ఈ దాడులకు ఇప్పటికే 15 మాసాలు ముగిసింది. 16వ నెల్లోకి అడుగు పెట్టినా ఇంకా ఎక్కడా ఈ దాడులకు ముగింపు అనేది కనిపించడం లేదు. ఈ దాడుల్లో ఇప్పటివరకు 46,006 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. గాయపడిన వారి సంఖ్య 1,09,378కి చేరింది. మృతి చెందిన వారిలో సగానికి పైగా మహిళలు, పిల్లలే వున్నారు. కాగా హమాస్ వద్ద ఇంకా వంద మంది వరకు బందీలు వున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘకాలంగా విచక్షణారహితంగా కొనసాగుతున్న దాడుల్లో గాజాలో మెజారిటీ ప్రాంతాలు భూస్థాపితమయ్యాయి. 23 లక్షల మంది ప్రజల్లో దాదాపు 90 శాతం మంది నిర్వాసితులయ్యారు. వీరిలో చాలామంది పదే పదే దాడులకు గురవుతూ పలు ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సి వస్తోంది. వందలు వేల సంఖ్యలో ప్రజలు తాత్కాలిక శిబిరాల్లో తల దాచుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పైగా ఆహారం, ఇతర నిత్యావసరాలు కూడా వారికి సరిగా అందని పరిస్థితి నెలకొంది. ఇదిలావుండగా కాల్పుల విరమణకు, బందీల విడుదలకు జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రానున్నట్లు కనిపిస్తోంది. అమెరికా, కతార్, ఈజిప్ట్‌ల మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చలు గత ఏడాది కాలంలో అనేక కారణాలతో పదే పదే స్తంభిస్తూ వచ్చాయి. గత 24 గంటల్లో గాజాలో 70 మంది పాలస్తీనియన్లు మరణించగా, 104 మంది గాయపడ్డారు. ఈ యుద్ధాన్ని ఇక ముగించాలంటూ 800 మంది పైగా ఇజ్రాయిలీ సైనికుల తల్లిదండ్రులు ప్రధాని నెతన్యాహును డిమాండ్ చేశారు. గాజా తమ పిల్లల సమాధిగా మారకూడదని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కాల్పుల విరమణ, బందీల విడుదల పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ చెరలో వున్న బందీ యూసుఫ్ జియాద్నె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. 15 మాసాలుగా కొనసాగుతున్న దాడుల తర్వాత పరిస్థితులు అత్యంత భయంకరంగా వున్నాయని గాజా డాక్టర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి చికిత్సనందించడం దుర్లభమవుతోందని అన్నారు.

# ఎకరానికి 30 నుంచి 50 లక్షలు



హైదరాబాద్, తెలంగాణలో గేమ్ ఛేంజర్ అవుతుందని భావిస్తోన్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే.. మొదటగా నిర్మించదలచిన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియలోనూ స్పీడు పెంచారు అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో యాదాద్రి జిల్లా అధికారులు.. భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే తుర్కపల్లి పరిధిలో రెండు గ్రామాల రైతులతో మాట్లాడారు. మెరుగైన పరిహారం ఇస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ రెండు గ్రామాల రైతులు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఇక.. మిగిలిన గ్రామాల రైతులతోనూ అధికారులు చర్చలు జరపనున్నారు. అయితే.. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 164 కిలో మీటర్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 5 మండలాల్లోని 24 గ్రామాల్లో 59 కిలో మీటర్ల నిర్మాణానికి 1800 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఉన్న రైతులకు మంచి పరిహారం ఇచ్చి ఒప్పించి మెప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్హనుమంత రావు క్షేత్రస్థాయికి వెళ్లి బాధిత రైతులతో నేరుగా మాట్లాడుతున్నారు. ముందుగా తుర్కపల్లి మండలంలోనే రీజినల్ రింగ్ రోడ్డు ప్రారంభమవుతుండగా అక్కడి రైతులతో చర్చించారు. భువనగిరి మండలంలో196 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. రాయగిరి గ్రామంలోని 105 ఎకరాలకు చెందిన రైతులు భూమి ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నారు. సర్వే నంబర్ 215తో పాటు పలు సర్వే నంబర్లలో ఎకరానికి రూ.13.12 లక్షలు, సర్వే నంబర్ 379తో పాటు మిగతా నంబర్లలో రూ.29.40 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో.. సర్వే నంబర్ 682 తో పాటు పలు నంబర్లలో రూ.36.75 లక్షల వరకు రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఉండగా.. బహిరంగ మార్కెట్ ఎకరానికి కోట్లలో పలుకుతోంది. అయితే.. రిజిస్ట్రేషన్వ్యాల్యూను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైగా గ్రామానికి చెందిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తుండగా.. ఆమేరకు ప్రపోజల్స్ రెడీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. మరోవైపు.. తుర్కపల్లి మండలం కోనాపురం, ఇబ్రహీంపూర్లో 38 ఎకరాలకు చెందిన రైతులను కలెక్టర్తో పాటు అడిషనల్ కలెక్టర్ కలిసి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో ఎకరానికి కోటి రూపాయల డిమాండ్ ఉందని.. తమకు కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని రైతులు కోరారు. అయితే.. నేషనల్ హైవే రూల్స్ ప్రకారం ఇక్కడ రిజిస్ట్రేషన్వ్యాల్యూకు మూడు రెట్లు మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. ఇలా చూస్తే ఎకరానికి రూ.19 లక్షలే వస్తుందని అధికారులు వివరించారు. అయినప్పటికీ.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు చెప్పిన మాటలకు.. రైతులు సానుకూలత వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. మిగిలిన 22 గ్రామాల రైతులతోనూ మాట్లాడి.. అందరిని ఒప్పిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

# తొక్కిసలాట వెనుక..అసలేం జరిగింది..!



తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన చీకటిరోజుగా మిగిలిపోయింది. ఆరుగురు మృతి చెందగా 35 మంది క్షతగాత్రులయ్యారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా వైకుంఠ ద్వారాల ద్వారా వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏకాదశి, ద్వాదశే కాకుండా పదిరోజుల పాటు పర్వదినాలుగా ప్రకటిస్తూ వైకుంఠ ద్వార దర్శనాలను తెరచే ఉంచేలా నిర్ణయం తీసుకున్నారు. గత టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో ఐదేళ్ల పాటు తిరుపతి నియోజకవర్గం ఆధార్ కార్డు ఉన్న అందరికీ 8 నుంచి 10వేల టికెట్లను తిరుపతిలోనే కౌంటర్లు పెట్టి ఇచ్చేవారు. కేవలం 'లోకల్' వారికే ఈ టోకెన్లు ఇచ్చే విధానం నడిచేది. అయితే ఈసారి భక్తులకు నిబంధనలు విధించారు. టోకెన్ ఉంటేనే శ్రీవారి దర్శనం ఉంటుందని నెలరోజులుగా సమీక్షల పేరుతో ప్రచారం చేశారు. తిరుపతిలో ఎనిమిది చోట్ల, తిరుమలలో ఒకచోట టోకెన్ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భక్తులంతా తమ ఆధార్‌కార్డులతో టోకెన్ పొందాలని భారీ ప్రచారం చేశారు. దీంతో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి, ఉత్తరాది ప్రాంతాల నుంచి తిరుపతి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి కావడంతో ఆఖరి టోకెన్లు 70 వేలను గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఇస్తామని ప్రకటించారు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచే క్యూలైన్లలో భక్తులు నిల్చున్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్లోని కౌంటర్ జాతీయ రహదారికి దగ్గరగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఈ కౌంటర్‌కు వేలాదిగా చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో భక్తుల రద్దీగా ఉండడంతో వచ్చిన జనాలను ఎదురుగా ఉన్న పార్కులో ఉంచి తాళాలు వేశారు. ఓ పక్క ఆకలి, మరో పక్క టోకెన్లు అందవేమోనన్న ఆందోళన. ఈ నేపథ్యంలోనే 8.40 గంటలకు 50 సంవత్సరాల వయస్సున్న ఓ మహిళ తనకు గుండెల్లో నొప్పిగా ఉందని, ఊపిరాడలేదని, తనను బయటకు తీసుకెళ్లాలని పోలీసులను ప్రాధేయపడింది. అప్పటివరకూ మూసి ఉన్న మెయిన్ గేటును క్రైం డిఎస్‌పి రమణకుమార్ ఆదేశాల మేరకు గేటు తీసి మహిళను బయటకు తీసుకొచ్చారు. 50 మంది జనసేన కార్యకర్తలు వాళ్లంతా తమ వాళ్లను, లోనికి పంపించాలని ఆ సందర్భంగా జనసేన ద్వితీయశ్రేణి నాయకుడు డిఎస్‌పిని కోరారు. ఆ 50 మందిని లోపలికి అనుమతించారు. దీంతో వెనక ఉన్న భక్తులు టోకెన్లు ఇచ్చేస్తున్నారని, తాము వెనుకబడిపోతామని, కొత్తవారిని లోనికి ఎలా అనుమతిస్తారని మండిపడ్డారు. ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. 50 మందిని పైగా తొక్కుకుంటూ వెళ్లిపోయారు. అక్కడే విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్య స్వాతి (37), కంచరపాలెం శాంతి (35), మద్దెలపాలెం రజని (47), నరసరావుపేట రామచంద్రాపురానికి చెందిన బాబునాయుడు (51), తమిళనాడు రాష్ట్రం పొల్లాచ్చి గ్రామానికి చెందిన నిర్మల (45) స్పృహ తప్పి కోమాలోకి వెళ్లిపోయారు. వీరితో పాటు అస్వస్థతకు గురైన 35 మందిని బయటకు తీసుకొచ్చారు. అంబులెన్స్ కోసం 45 నిమిషాల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. వేరే అంబులెన్స్‌లు రప్పించి బాధితులను ఆస్పత్రులకు తరలించారు. అప్పటికే ఐదుగురు మృతిచెందారని నిర్ధారించారు. ఇదే ఘటన శ్రీనివాసంలోనూ జరిగింది. అక్కడ జరిగిన స్వల్ప తొక్కిసలాటలో తమిళనాడు రాష్ట్రం మేచారి గ్రామం సేలంకు చెందిన మల్లిక (50) ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు అంబులెన్స్‌లో మృతిచెందారు. అయితే టిటిడి చైర్మన్ మాత్రం డిఎస్‌పి గేటు తీయడం వల్లనే ఈ ప్రమాదానికి కారణమని వెల్లడించారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో భక్తులకు టోకెన్లు ఇచ్చి టైంస్లాట్ ఇస్తారు. అయితే ఈసారి ఎక్కడా టికెట్లను అనుమతించకుండా, టోకెన్ల జారీ కేంద్రాలను ఏర్పాటు చేసి లోకల్, నాన్‌లోకల్ వారినందరినీ రప్పించడంతో తొక్కిసలాట ఘటన జరిగిందన్నది జనవాక్యం.

## పిల్లల పరేడ్‌తో సీఎం సోదరుడికి స్వాగతం

### వైరల్‌గా మారిన వీడియో... నెటిజన్ల ఆగ్రహం

వికారాబాద్, : ఆయన ఎంపీ కాదు, ఎమ్మెల్యే కాదు.. అంతకంటే జడ్పీటీసీ, ఎంపీటీసీ కాదు.. చివరకు సర్పంచ్ కాదు, కార్పొరేటర్ కాదు, కనీసం వార్డ్ మెంబర్ కాదు.. కానీ ఆయనకు పోలీస్ కాన్వాయ్, స్కూల్ పిల్లలతో పరేడ్, చివరికి వికారాబాద్ కలెక్టర్ బాడీగార్డ్ అయ్యాడు. అందరికీ ఆయన సీఎం అన్న.. అయితే ఆ జిల్లాలో మాత్రం ఆయనే సీఎం అనడానికి ఈ వీడియోనే సాక్ష్యం. మరి ఆయన ఎవరో తెలుసా.. సాక్షాత్తు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి. కొడంగల్ నియోజకవర్గం పరిధిలో ఓ అభివృద్ధి కార్యక్రమానికి శంకుస్థాపన చేసేందుకు తిరుపతి రెడ్డి భారీ కాన్వాయ్‌తో వచ్చాడు. ఊరి బయటనే ఆయన కాన్వాయ్ ఆగిపోయింది. ఎండలో బడి పిల్లలు ఆయనకు పరేడ్‌తో స్వాగతం పలికారు. ఇక ఏ హోదా లేని తిరుపతి రెడ్డి పక్కనే వికారాబాద్ కలెక్టర్ ఓ సామాన్యుడిలా ఉండిపోయారు. ఇక స్థానిక నాయకులు వంగి వంగి దండాలు పెట్టడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. వీటన్నింటినీ ఎంజాయ్ చేస్తూ తిరుపతి రెడ్డి ఓ ముఖ్యమంత్రి అన్నలా కాకుండా.. తానే ముఖ్యమంత్రిలా ఫీలైపోయారు. తెలంగాణ సీఎం పేరు అందరూ మర్చిపోయేది ఇందుకే అన్న విషయం సీఎం తెలుసుకోవాలి అని సోషల్ మీడియాలో సైటెర్లు వేస్తున్నారు. కుటుంబ పాలన అన్నోడు.. ఈ వీడియో చూడాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొన్ని రోజులైతే తెలంగాణ సీఎం ఎవరనే ప్రశ్నకు పిల్లలు అనుముల తిరుపతి రెడ్డి తమ్ముడు అనే సమాధానం రాసిన ఉపాధ్యాయులు మార్కులు వేయాల్సిందే అని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.


# భారత్ మెట్రో... నయా రికార్డ్...



**న్యూఢిల్లీ, జనవరి 11, :**

ప్రపంచవ్యాప్తంగా రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌తో దేశంగా అవతరించేందుకు భారతదేశం సిద్ధమవుతోంది. అర్బన్ మొబిలిటీలో ప్రధాన మైలురాయిని సాధించడానికి సిద్ధంగా ఉంది. భారత్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్ 1000 కి.మీలకు పెరిగింది. ఇంత పెద్ద నెట్‌వర్క్‌తో, చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారతదేశం అవతరించింది.ఈ క్రమంలోనే మెట్రో సేవలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఢిల్లీ మెట్రో మెజెంటా లైన్ పొడిగింపును ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రారంభించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సాహిబాబాద్, ఢిల్లీలోని న్యూ అశోక్ నగర్ మధ్య నిర్మించిన ఢిల్లీ–ఘజియాబాద్–మీరట్ నమో భారత్ కారిడార్‌లోని 13 కిలోమీటర్ల పొడవైన సెక్షన్‌ను కూడా ఆయన ప్రారంభిస్తారు. సాహిబాబాద్, న్యూ అశోక్ నగర్ మధ్య నమో భారత్ కారిడార్‌లోని 13 కిలోమీటర్ల అదనపు ఢిల్లీ సెక్షన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. కొత్తగా ప్రారంభించే 13 కి.మీ విభాగంలో, ఆరు కి.మీ భూగర్భంలో ఉంది. కారిడార్‌లోని ఆనంద్ విహార్‌లోని ప్రముఖ స్టేషన్‌ను కలిగి ఉంది. భూగర్భంలో నమో భారత్ రైళ్లు నడపడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు.వేగవంతమైన పట్టణీకరణ ద్వారా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో అర్బన్ మొబిలిటీ ప్రాముఖ్యత పెరుగుతోంది. ప్రస్తుతం, భారతదేశంలోని 23 నగరాల్లో 993 కిలోమీటర్ల మెట్రో రైలు పరుగులు పెడుతోంది. అదనంగా, మరో 28 నగరాల్లో మరో 997 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ నిర్మాణంలో ఉంది. మెట్రో ప్రాజెక్టలతో పాటు, భారతదేశం ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్స్ లో కూడా పెట్టుబడి పెడుతోంది. ఇది ప్రధాన నగరాలు, పట్టణ కేంద్రాలను కలుపుతూ ఏకీకృత పట్టణ చలనశీలత పర్యావరణ వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాంతీయ కనెక్టివిటీలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని భావిస్తోంది ఖీఖీూ.పట్టణీకరణలో ఒక సంచలనాత్మక ఆవిష్కరణ 'వన్ నేషన్ వన్ కార్డ్' కార్యక్రమం. మార్చి 2019లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఔఅఓఅ) ఒకే కార్డుతో మెట్రో, రైలు, బస్సు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థల్లో అతుకులు లేని ప్రయాణాన్ని అనుమతిస్తుంది. ఈ చొరవ లక్షలాది మంది ప్రయాణికులకు ప్రజా రవాణాను సులభతరం చేయడం, ఏకీకృతం చేయాలనే ప్రభుత్వ దృక్పథానికి ఉదాహరణ.మెట్రో నెట్‌వర్క్, పట్టణ రవాణా వ్యవస్థలను విస్తరించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలు స్థిరమైన, సమర్థవంతమైన పట్టణ చలనశీలతను ప్రోత్సహించడానికి ఒక పెద్ద దృష్టిలో భాగం. 2025 నాటికి, దాదాపు 2,000 కిలోమీటర్ల మెట్రో రైలు 51 నగరాల్లో పని చేయడం లేదా నిర్మాణంలో ఉండటంతో, భారతదేశం అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా స్థిరపడుతుంది. పట్టణ వాసులకు వేగవంతమైన రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. భారతదేశం వేగంగా విస్తరిస్తున్న మెట్రో నెట్‌వర్క్, వినూత్న అర్బన్ మొబిలిటీ సొల్యూషన్‌లు నగరాల పనితీరును మారుస్తున్నాయి. సమర్థవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించడం పట్టణ నివాసితులకు ఉజ్వల భవిష్యత్తును హామీ ఇస్తుంది. ప్రయాణాన్ని వేగంగా, మరింత అందుబాటులోకి తీసుకువస్తుంది. ప్రపంచంలోని రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ పట్టణ చైతన్యాన్ని పునర్నిర్వచించే దిశగా భారతదేశం ప్రతిష్టాత్మక ప్రయాణం ప్రారంభం మాత్రమే.

# కోళ్లకే కాదు గుడ్లకు డిమాండే



**ఒంగోలు జనవరి 11,:**

సంక్రాంతి సమీపిస్తోంది. కోడిపందాలకు శిబిరాలు సిద్ధమవుతున్నాయి. పందెం కోళ్ళు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాయి. దీంతో కోస్తాంధ్రలో సందడి నెలకొంటోంది. అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా ఇదే సందడి నెలకొంది. పందెం కోళ్ళకే కాదు.. అవి పెట్టే గుడ్లకు కూడా భలే డిమాండ్. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 700 రూపాయల వరకు పలుకుతోంది ఒక్క గుడ్డు ధర. పందెంకోడి ఏంటి? గుడ్లు పెట్టడం ఏంటి? అని అనుకుంటున్నారు కదా? తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదివావాల్సిందే. ప్రకాశం జిల్లా తీర ప్రాంతంలోని కొత్తపట్నం, సింగరాయకొండలో గుడ్లను జాతి పెట్టలతో పొదిగించి.. పుంజులను ప్రత్యేకంగా సంరక్షిస్తుంటారు. వాటినే పందెం కోళ్ళుగా బరిలో దింపుతారు. కోస్తాంధ్రతో పాటు ఉభయగోదావరిజిల్లాల్లో కోళ్ల పందాలు జరుగుతాయి. కానీ అక్కడి పుంజులను మాత్రం అందించేది ప్రకాశం జిల్లాపందెం కోళ్లలో రకరకాల కోళ్లు ఉంటాయి. వీటిలో ప్రధానంగా తూర్పుకోడి, పెర్విన్ కోడి, భీమవరం కోడి, ఎర్ర మైల, అబ్రాస్ మైల, కాకి నెమలి, తెల్ల నెమలి, నల్లపడ కోడి, కాకి డేగ, ఎర్ర కక్కెర, తెల్ల కోడి, కాకి నెమలి, పెట్టమారు వంటి పుంజులు సంక్రాంతి బరిలో దిగుతాయి. అయితే ఈ పుంజులకు సంబంధించి పుట్టుక వెరైటీగా ఉంటుంది. నల్ల పెట్ట, డేగ పెట్ట, తెల్ల పెట్ట, బూడిద రంగు పెట్ట, అబ్రాసు పెట్ట, కక్కెర పెట్టలు పందెం కోడిపుంజులతో కలవడం ద్వారా.. గుడ్లు పెడతాయి. కానీ ఇది పొదగవు. ఈ గుడ్లను ప్రత్యేక నాటు కోళ్లతో పొదిగిస్తారు. అందుకే ఈ గుడ్డుకు అంత ధర. ఒక్కో గుడ్డు 400 నుంచి 700 వరకు విక్రయిస్తారు. డిమాండ్ బట్టి వీటి ధర పెరిగిపోతుంటుంది. అయితే ఈ గుడ్లు తినే కంటే.. పందెం కోళ్ళుగా తీర్చిదిద్దేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. భరత్ పెరగడానికి అదే కారణం.నాటు కోళ్లతో పొదిగించే క్రమంలో.. గుడ్డు పెట్టిన తర్వాత మూడు వారాలకు పిల్ల అవుతుంది. అప్పటినుంచి రెండేళ్ల పాటు వాటికి ప్రత్యేక ఆహారం పెడతారు. సుమారు ఏడాదిన్నర పాటు రాగులు, సజ్జలు పెడుతుంటారు. తరువాత ఆరు నెలలు కాలం బాదం, ఖర్జూరం, అంజూర్, యాలుక, రసగుల్లా, రంగుల ద్రాక్ష, క్రిస్మస్, నాటు కోడి గుడ్డు వంటి బలవర్ధకమైన ఆహారాన్ని పెడతారు. కొన్నింటికి పోతు మాంసం కూడా పెడుతుంటారు. దీనిని తినడం ద్వారా పుంజు బలంగా ఉండడమే కాక బరిలో అవతలి పుంజును సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అయితే కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో ఇదో కుటీర పరిశ్రమగా మారింది. కొంతమంది కోడిగుడ్లను అమ్ముకుంటూ ఉపాధి పొందుతుండగా.. మరికొందరు పందెం పుంజులను విక్రయించి జీవనం సాగిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు టెక్నికల్ ఎఫెక్ట్...

**కరీంనగర్, జనవరి 11 :**

ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం, నిలువ నీడలేని నిరుపేదలకు స్వంత ఇంటి కలను నిజం చేస్తాం'... ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హామీ. ఈ హామీని నిలబెట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక కోసం ముమ్మరంగా సర్వే చేపట్టింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.గ్రామీణ ప్రాంతాల్లో నెట్ వర్క్ ప్రాబ్లం ఉండగా పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో లేకపోవడం అడ్రస్ సరిగా ఉండకపోవడంతో సర్వేకు ఆటంకంగా మారింది. డిసెంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా సాంకేతిక సమస్యలతో జనవరి 3 వరకు 75% మాత్రమే సర్వే పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త పర్వాలేదనుకున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం 70 శాతం కూడా పూర్తి కాలేదు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సర్వే అధికారులు అష్టకష్టాలు పడుతు న్నారు.పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్ల లో నెట్ వర్క్ ప్రాబ్లాన్ని అధికమించేలా గ్రామ కార్యదర్శి హరికృష్ణ పొడవాటి కర్రకు సెల్ ఫోన్ కట్టి హాట్ స్పాట్ ఆన్ చేసి ట్యాబ్ కు కనెక్ట్ చేసుకుని యాప్ లో సర్వే డేటా పొందుపర్చి ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తి చేశారు. నెట్వర్క్ ప్రాబ్లం, సాంకేతిక సమస్యలతో రోజుకు 10 నుంచి 15 ఇళ్ల కంటే ఎక్కువ సర్వే చేయలేకపోతున్నామని పలు గ్రామల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ళ కోసం ప్రభుత్వానికి ప్రజాపాలన కార్యక్రమంలో 8054554 దరఖాస్తులు రాగ, ఇప్పటివరకు 5990889 సర్వే నిర్వహించారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 94 శాతం



సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో అతి తక్కువగా 16 శాతం దరఖాస్తులపైనే సర్వే జరిగింది. కరీంనగర్ నగరం పాలక సంస్థలో 56 శాతం సర్వే పూర్తయింది. హైదరాబాద్ మినహాయించి మిగతా 32 జిల్లాల్లో వారం పదిరోజుల్లో 100 శాతం సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సర్వేను వేగవంతం చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కరీంనగర్ జిల్లాలో 82 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,10,677 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు గ్రామాల్లో 88 శాతం, మున్సిపాలిటీలైన జమ్మికుంటలో 96.94 శాతం, హుజురాబాద్ లో 90.75 శాతం, చొప్పదండిలో 84.01 శాతం, కొత్తపల్లిలో 72.15 శాతం, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 56 శాతం సర్వే పూర్తయినట్లు కలెక్టర్ పమెలా సత్పతి ప్రకటించారు. త్వరగా పూర్తిచేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని తెలిపారు.మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా పక్కాగా వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రోజు వారీగా పూర్తయిన సర్వే వివరాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. అనంతరం గ్రామాల వారీగా లబ్దిదారుల ఎంపిక జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపిస్తారు. కలెక్టర్లు పరిశీలించాక ఇన్చార్జి మంత్రులకు పంపిస్తారు. ఇన్చార్జి మంత్రి ఆమోదం తెలిపితే లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నగదును విడతల వారీగా జమచేస్తారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకున్నా, ప్రస్తుతం శిథిలావ స్థలో ఉన్న ఇంటి యాజమాన్ల వివరాలను సైతం సర్వే యాప్ లో పొందుపర్చాలని క్షేత్రస్థాయి అధికారులను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకు నేందుకు ముందుకు వస్తే? అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్ లో పొందుపరు స్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని తెలిపారు.

# ఎన్నికలకు మరో 200 కొత్త పంచాయితీలు

**హైదరాబాద్, జనవరి 11, :**

కొత్తగా మరో 200 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రభు త్వం ఆలోచన చేస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు ఆయా ప్రజాప్రతినిధులు స్థానికంగా ఇ చ్చిన హామీ మేరకు ఇప్పుడు ఒత్తిడి పెరుగుతోంది. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని కోరు తూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిల నుంచి పం చాయతీరాజ్ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు. తండా లు, గూడెంలు, పెద్ద గ్రామాలకు అనుబంధంగా ఉన్న కొన్ని ఆవాసాలను కొత్తగా పంచాయతీలుగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచార స మయంలో ఆయా స్థానిక ప్రజల కోరిక మేరకు త ప్పకుండా పంచాయతీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు పంచాయతీ సమరానికి సమయం దగ్గర పడడంతో కొత్త పంచాయతీల ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పం చాయతీరాజ్ చట్ట సవరణ చేసి పలు మార్పులు చేర్పులు చేసింది. కొన్నిచోట్ల పంచాయతీలను ము న్సిపాలిటీల్లో కలిపింది. మరికొన్ని మున్సిపాలిటీల ను నగర పాలక సంస్థలుగా మార్పు చేసింది. దీం తో పాటు చట్టంలో పలు నిబంధనలను కూడా స వరించింది.పంచాయతీల్లో రిజర్వేషన్లు, ఎన్నికలు తదితర అంశాలను ప్రభుత్వం కొలిక్కి తెస్తోంది. ఇదే సమయంలో కొత్త పంచాయతీలను కూడా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను పరిష్కరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీల సంఖ్య పెరిగితే అందుకు అనుగుణంగా కేంద్ర నిధులు పెరుగుతాయని భావిస్తున్నారు. కొత్త పం చాయతీల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ ఆమోదముద్ర వేసిన తర్వాత ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోన్న నేపథ్యంలో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పాటు అవుతున్న మరో 200 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు



ఒకేసారి నిర్వహించేలా అధికారులు యోచిస్తున్నారు. కొత్త పంచాయతీల్లో వార్డులు, ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేస్తున్నారు. తాజాగా 200 పంచాయతీలను ఏర్పాటు చేస్తే మొత్తం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సంఖ్య 13,191కు పెరుగుతుంది. కాగా కొత్త పంచాయతీల ఏర్పాటుపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది.కొత్తగా ఏర్పాటు చేయాలని కోరుతున్న గ్రామపంచాయతీల్లో అత్యధికంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు వంటి ఏజెన్సీ జిల్లాల్లోనే ఉన్నాయని సమాచారం. ఆయా జిల్లాల్లో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నుంచి పంచాయతీ రాజ్ శాఖకు విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కొత్త గ్రామ పంచాయతీలపై ఎన్నికలకు ముందు హామీ ఇచ్చామని, ఎలాగైనా ఏర్పాటుచేసి తీరాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై డిమాండ్ చేస్తున్నారు. దీంతో అవసరమైన చోట్ల ఇప్పటికే ప్రతిపాదనలను తీసుకున్న పంచాయతీ రాజ్‌శాఖ పరిశీలన తర్వాత జనాభా దూరం తదితర పారామీటర్ల ఆధారంగా సుమారు 200 కొత్త పంచాయతీల ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వచ్చింది. అయితే ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు తక్కువ జనాభా ఉండడంతో చాలా ప్రతిపాదనలను తిరస్కరించి, ఆయా ప్రజాప్రతినిధులకు ఇప్పటికే సమాచారాన్ని ప్రభుత్వం అందించింది.ఒక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలంటే కనీసం 350 మంది జనాభా ఉండానే నిబంధన కారణంగా ఇబ్బంది ఎదురవుతోంది. 350 జనాభా నిబంధన చాలా చోట్ల అడ్డంకిగా మారింది. ఈ కనీస జనాభా నిబంధనను మార్చయినా అన్నింటికీ ఒకే చెప్పాలని ప్రభుత్వంపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాము ప్రతిపాదించిన ఒక్క గ్రామాన్ని కూడా తొలగించవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు ఆయా గ్రామ పంచాయతీలకు దూరంగా ఉండడం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయి. అభివృద్ధి విషయంలో తమను నిర్లక్ష్యం చేస్తున్నారని గూడాలు, తండాల ప్రజలు ఆరోపిస్తున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన అభ్యర్థుల ముందు ఇదే డిమాండ్ పెట్టారు. తాము అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని అభ్యర్థులు హామీ ఇచ్చారు. ఇప్పుడా హామీ నిలుపుకునే అవకాశం రావడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఎన్నికలకు ముందే పంచాయతీలను ఏర్పాటు చేస్తే పార్టీకి కూడా కలిసి వస్తుందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గూడేలు, తండాలు, అనుబంధ గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు దూరభారం కూడా తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్రం నుంచి ప్రత్యేక నిధులు కూడా పెరిగి వల్ల అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# సామినేని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు...



**విజయవాడ, జనవరి 11, :**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వైసిపిలో కొత్త తలనొప్పి మొదలైందట. ఎన్నికల ఫలితాల తరువాత ఆ పార్టీని నడిపించే నాయకుడు లేక నియోజకవర్గం నేతలు తలలు పట్టుకుంటున్నారట. ఏరి కోరి మరీ వైసీపీ బాధ్యతలు అప్పగించిన ఉదయభాను పార్టీని వీడడంతో.. చివరికి నియోజకవర్గంలో నడిపించే నాయకుడు లేక.. కొత్త నాయకుడు రాకపోతాడా? అంటూ ఎదురు చూపులు చూస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట. అలాంటి నియోజకవర్గంలో వైసీపీ జెండాను ఒక్కసారి రెపరెపలాడించి.. ఆ పార్టీ కి నియోజకవర్గంలో ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చారు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌లకి వీర విధేయుడైన సామినేని ఉదయభాను . కాంగ్రెస్ పార్టీని వీడి జగన్ పక్షాన చేరిన తర్వాత గత మూడు పర్యాయాలుగా నియోజకవర్గ నాయకుడిగా ఆయనే వైసీపీని నడిపిస్తూ వచ్చారు . 2014 , 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున తన అదృష్టాన్ని పరీక్షించుకున్న సామినేని ఉదయభాను 2019 ఎన్నికల్లో మాత్రమే వైసీపీ తరపున గెలిచారు.వైసీపీ జెండాను జగ్గయ్యపేట నియోజక వర్గంలో పార్టీ ఎగరేశామన్న ఆనందం ఉదయభానుకి ఒక్కసారే దక్కింది. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి సామినేని ఉదయభాను పోటీచేసినా టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2019 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీరామ్ తాతయ్యను ఓడించగలిగారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సామినేని ఉదయభానుకి పరాజయం తప్పలేదు. అంతవరకు బాగానే ఉన్నా 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవ్వగానే ఉదయభాను వైసీపీకి రాజీనామా చేసి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. దాంతో ఇప్పుడు జగ్గయ్యపేట నియోజకవర్గానికి వైసీపీ నాయకుడు ఎవరు అనే చర్చ మొదలైంది.నియోజకవర్గంలో సామినేని ఉదయభాను పార్టీని వీడటంతతో ఇప్పుడు ఆ పార్టీని నడిపించే నాయకుడు నియోజకవర్గంలో లేరని ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవి ఇవ్వలేదని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం తిరిగి సీటు కేటాయించే విషయంలో సైతం మీన మేషాలు లెక్కించారని అలకబూనిన సామినేని ఉదయభాను ఎన్నికల ఫలితాలు తర్వాత వైసీపీకి గుడ్ బై చెప్పేసారు. దాంతో నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, వస్తున్న మార్పులతో నియోజకవర్గానికి కొత్త నాయకుడు రాకపోతారా? అని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి.నియోజకవర్గంలో బలమైన నేతలుగా టీడీపీ నుంచి ఉన్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, జనసేన పార్టీలో జాయిన్ అయిన సామినేని ఉదయభాను లాంటి నేతలను ఎదుర్కోవాలంటే జగ్గయ్యపేట లాంటి నియోజకవర్గం లో అన్ని రకాలుగా బలమైన నాయకుడు అవసరమని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఉదయభాను జగ్గయ్యపేటలో కాంగ్రెస్ తరపున రెండు సార్లు, వైసీపీ నుంచి విజయం సాధించారు. శ్రీరాం తాతయ్య టీడీపీ అభ్యర్థిగా మూడో సారి గెలిచారు. అలాంటి లీడర్లు ఇద్దరు ఇప్పుడు మిత్రపక్షాల్లో ఉండటంతో వైసీపీకి సమర్ధుడైన నేతను వెతకడం కత్తి మీద సామే అంటున్నారు.సామినేని ఉదయభాను పార్టీ మారినా క్యాడర్ మాత్రం వైసీపీని వదలలేదని లీడర్ గురించి క్యాడర్ వెనకడుగు వేయాల్సిన అవసరం లేదని అ పార్టీ శ్రేణులు అంటున్నాయి. అదేమంటే గత ఎన్నికల్లో కూటమి వేవ్‌లో సైతం వైసీపీ 52 వేల ఓట్లు దక్కించుకుని 16 వేల ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని ధీమా వ్యక్తం చేస్తున్నాయి . అంత వరకు బానే ఉన్నా సామినేని ఉదయభాను పార్టీని వీడగానే ఆయన ప్రధాన అనుచరుడు కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ అయిన తన్నీరు నాగేశ్వరావు కు తాత్కాలికంగా జగ్గయ్యపేట నియోజకవర్గం ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. శ్రీరామ్ తాతయ్య, సామినేని ఉదయభాను లాంటి నేతలను ఎదుర్కోవడానికి ఆయన సరిపోరన్న అభిప్రాయం వ్యక్తం అవుతుందిఅదలా ఉంటే మార్పులు చేర్పులతో జగ్గయ్యపేట నియోజకవర్గం రాజకీయం ఆసక్తిగా మారింది. శ్రీరాం తాతయ్య, సామినేని ఉదయభాను ఒకప్పుడు కాంగ్రెస్‌లో మిత్రులుగానే కొనసాగారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలుగా పని చేశారు. శ్రీరాం తాతయ్య రాష్ట్ర విభజన ఎఫెక్ట్‌తో టీడీపీలో చేరారు. సామినేని ఉదయభాను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగి అనంతరం వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరి అభ్యర్థిగా బరిలోకి తిరిగి రెండుసార్లు ఓటమి చెంది ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.ఇప్పుడు ఇద్దరూ కూటమి పార్టీల్లోనే ఉండటంతో రాజకీయ మిత్రులయ్యారు. వారిద్దరినీ ఎదుర్కొనేంత బలమైన నాయకుడిని జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎవరున్నారా అని వైసీపీ వెతుక్కునే పనిలో పడింది. ప్రస్తుతం జగ్గయ్యపేట వైసీపీలో కన్ఫ్యూజన్ నెలకొన్న పరిస్థితుల్లో కొత్త నాయకుడికి పగ్గాలు అప్పగించాలని, అన్ని విధాలా సమర్ధుడైన నాయకుడ్ని తెర మీదకు తీసుకు రావాలని వైసీపీ వర్గాలు ఆశిస్తున్నాయి. చూడాలి మరి అత్యంత కీలకమైన జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసీపీకి అంత బలం ఉన్న నాయకుడు ఎవరు దొరుకుతారో?

# సహజ సంక్రాంతి



'సం-క్రాంతి' అనే పదంలో 'సం' అంటే 'శుభం' అని, 'క్రాంతి' అంటే 'పరివర్తన' లేదా 'విప్లవం' అని అర్థం. 'సంక్రాంతి' అంటే శుభకరమైన పరివర్తన తెచ్చే రోజు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని 'మకర సంక్రమణం' అంటాం. ఆ రోజు నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. అప్పటివరకూ దక్షిణ దిక్కున ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకొని... ఉత్తర దిక్కులో సంచారం మొదలుపెడతాడు. సూర్యుడి గమనం మారడం వల్ల... వాతావరణంలో మార్పులు వస్తాయి.

సమస్త సృష్టికి ఆధారభూతుడు సూర్య భగవానుడు. ఆయన అనుగ్రహం లేకపోతే మానవాళికి మనుగడ లేదు. తను నిరంతరం మండుతూ సమస్త విశ్వానికి మేలు చేకూరుస్తాడు. ఇతరులకు ఆనందం కలిగిస్తాడు. ఈ గుణాలు మనలో పెంపొందించుకుంటే అహంకారానికి తావుండదు. రాత్రి చీకటి వల్ల మనం నిద్రావస్థలో ఉంటాం. సూర్యుడు ఉదయించాక... ఆయన ప్రకాశం వల్లనే పనులన్నీ జరుగుతాయి. కాబట్టి అన్ని కార్యాలను ప్రభావితం చేసేది సూర్యుడే. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... మిగిలిన పండుగలన్నీ చంద్రుని గమనం ఆధారంగా జరుపుకొంటే... సంక్రాంతిని సూర్య గమనాన్ని పరిగణనలోకి తీసుకొని జరుపుకొంటాం. అందుకే ఇది చాలా ముఖ్యమైన రోజు.

పెద్ద పండుగ

సంక్రాంతి పండుగ సమయానికి ధాన్యం పొలాల నుంచి ఇంటికి చేరుకుంటుంది. చేతికి వచ్చిన పంటను చూసి రైతులు ఆనందంతో పొంగి పోతారు. కొత్త బియ్యానికి బెల్లం జోడించి పరమాన్నం, అప్పాలు, అలాగే అరిసెలు, చక్కిలాలు లాంటివి తయారు చేస్తారు. తమిళనాడులో కొత్త బియ్యంతో పొంగలి చేస్తారు, అందుకే ఈ పండుగను అక్కడ 'పొంగల్' అని పిలుస్తారు. పంటను ప్రసాదించిన దేవుడికి ధన్యవాదాలు తెలుపుతూ... తాము తయారు చేసిన వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పండగ సందర్భంగా ప్రకృతిని, పశువులను కూడా పూజిస్తారు. మొదటి రోజున భోగీ, రెండో రోజు మకర సంక్రాంతి మూడో రోజు కనుమ... మొత్తంగా ఇది ప్రధానమైన పండుగ. పల్లెల్లో దీన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ధాన్య లక్ష్మికి స్వాగతం చెప్పడానికి ఇంటి గుమ్మాలను మామిడి కొమ్మలతో, పూల దండలతో, వాకిళ్ళను రంగవల్లులతో, వాటిలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. సంక్రాంతి జానపద కళా సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, రంగవల్లుల పోటీలు తదితరాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మూడో రోజు కనుమ రైతులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూ ధాన్య రాశులను ఇంటికి తీసుకురావడానికి సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతతో పూజలు జరుపుతారు.

సమతుల్యత ప్రధానం

మానవ చరిత్రలో సంభవించిన అనేక విప్లవాల గురించి మనకు తెలుసు. రాజకీయపరమైనవీ, అసమానతల నిర్మూలన కోసం ఉద్దేశించినవి అయిన ఇలాంటి విప్లవాలతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు సాధ్యమయ్యాయి. కానీ మానవులు సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి మాత్రం సాధ్యపడలేదు. అది జరగాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి. మన సూక్ష్మ శరీరంలో సూర్యుడి స్థానం మన నుదుటి భాగంలోని ఆజ్ఞాచక్రంలో ఉంటుంది. ముందుగా దాన్ని శుభ్రపరచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అది సూర్యుడి ద్వారా ప్రభావితం అవుతుంది. ఆజ్ఞాచక్రం సరిగ్గా లేకపోతే మనకు చాలా త్వరగా కోపం వస్తుంది. మనలో క్షమాగుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ఆజ్ఞాచక్రాన్ని శుభ్రంగా ఉంచుకోగలం. అందుకే క్షమాగుణం అలవరచుకోవడం చాలా ముఖ్యం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... సూర్యచంద్రుల గమన ప్రభావం మనపై బాహ్యంగానే కాదు... అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ మీద కూడా ఉంటుంది. మనలో ఎడమవైపున 'ఇడానాడి' అంటే చంద్రనాడి, కుడివైపు 'పింగళానాడి' అంటే సూర్యనాడి ఉంటాయి. సూర్యనాడి క్రియాశక్తిని, చంద్రనాడి ఇచ్ఛాశక్తిని సూచిస్తాయి. మనం శక్తికి మించిన పని చేసినప్పుడు లేదా అతిగా ఆలోచిస్తున్నప్పుడు కుడి భాగం మీద భారం పడుతుంది. శరీరంలో ఉష్ణం ఎక్కువై అది బలహీనపడుతుంది. ఇక ఏ పనీ చేయాలనే కోరిక లేకుండా, ఎప్పుడూ సోమరితనంతో ఉండేవారిలో చంద్రనాడికి, అంటే ఎడమ పార్శ్వానికి సంబంధించి నసమస్యలు వస్తాయి. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు ఏదీ అతిగా ఉండకూడదు. దీనివల్ల మనలో ఉండే సహజమైన సమతుల్యత విచ్ఛిన్నం అవుతుంది. కాబట్టి మనలోని సూర్యనాడిని, చంద్రనాడిని ప్రతి నిత్యం ధ్యానం ద్వారా సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. అది సహజయోగ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది.

సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి.

## పిల్లల ఎదుగుదల మంచిగా ఉండాలంటే..



పిల్లలకు మంచి నడవడికను నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత. పిల్లల ఎదుగుదల మంచిగా ఉండాలంటే, ముందుగా పేరెంట్స్ చేయాల్సిన కొన్ని పనులున్నాయి. అవెంటో తెలుసుకుందాం..

పిల్లల మనస్సులో ఒక సానుకూల దృక్పథాన్ని కలుగజేయడం తల్లిదండ్రుల బాధ్యత. ఎందుకంటే స్కూల్‌ల్లో కన్నా ఇంట్లోనే ఎక్కువగా అలవాట్లు, పద్ధతులు నేర్చుకుంటారు. అయితే, పిల్లల ఎదుగుదల మంచిగా ఉండాలంటే, ముందుగా తల్లిదండ్రులు చేయాల్సిన కొన్ని పనులున్నాయి. అవెంటో తెలుసుకుందాం..

నిద్రలేవడం:

పిల్లల కంటే ముందే తల్లిదండ్రులు నిద్రలేవడానికి ప్రయత్నించాలి. రోజును త్వరగా ప్రారంభిస్తే ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. అలా కాకుండా నిద్రలేచిన వెంటనే ఆలస్యమైపోతుందని చిరాకు పడటం, కంగారుపడటం వంటివి చేయడం మంచిది కాదు. ఎందుకంటే మీ పిల్లలకు కూడా అవే అలవాటు అవుతాయి.

చదివే అలవాటు :

మీ పిల్లలతో కలిసి ఉదయం పూట పుస్తకాలు లేదా వార్తాపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలి. ఇలా అలవాటు చేయడం వల్ల వారి వ్యక్తిత్వం పెరుగుతుంది. అంతేకాకుండా మంచి విలువలను నేర్చుకుంటారు.

ధ్యానం చేయండి:

ఉదయాన్నే కొన్ని వ్యాయామాలు చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ అలవాట్లు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతాయి. అంతేకాకుండా మీరు ప్రశాంతంగా ఉంటారు. మీ నుండి మీ పిల్లలు ఈ అలవాటును చిన్నతనంలో నేర్చుకుంటే వారి ఆరోగ్యం కూడా బాగుంటుంది.

మంచి ఆహారం:

మీ పిల్లలకు ఉదయాన్నే పండ్లు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఇవ్వండి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో శారీరక బలం పెరుగుతుంది.

ఇంటి పనులు:

మీ పిల్లలకు ఇంటి పనులు కొన్ని చేయమని సూచించండి. ఇలా చేయడం వల్ల ఇంటి బాధ్యతలు తెలుస్తాయి. అంతేకాకుండా మీరు ఎంత బీజీగా ఉన్నా కుటుంబ సభ్యులతో కాసేపు ప్రేమగా మాట్లాడండి. మంచి విలువలను నేర్పించండి.

# వ్యాపారం

## కొత్త రంగు, అదిరే ఫీచర్లతో టాటా నెక్సాన్.. మూడు వేరియంట్లలో విడుదల



టాటా కంపెనీ పేరు చెబితేనే భారతీయులకు అభిమానం ఉప్పొంగుతుంది. దేశంలో అనేక కంపెనీలున్నా సామాన్య ప్రజలందరికీ ఎంతో దగ్గరైన కంపెనీ ఇదే. ముఖ్యంగా టాటా మోటారు కంపెనీ నుంచి విడుదలయ్యే కార్లకు దేశంలో ఎంతో క్రేజ్ ఉంటుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఫీచర్లతో అనేక కార్లను ఈ సంస్థ విడుదల చేస్తోంది. ఇప్పుడు లేటెస్టుగా 2025 టాటా నెక్సాన్ ను ఆవిష్కరించింది. కొత్త అప్ డేట్లు, రంగు, వేరియంట్లలో కొత్త కారును తీసుకువచ్చింది, రూ.7.99 లక్షల ప్రారంభ ధరతో అందుబాటులో ఉన్న టాటా నెక్సాన్ ఫీచర్లు, ఇతర ప్రత్యేకతలను తెలుసుకుందాం.

టాటా నెక్సాన్ ఎస్ యూవీ ద్వారా గ్రాస్ ల్యాండ్ బీజ్, రాయల్ బ్ల్యూ అనే రంగులను పరిచయం చేశారు. ప్యూర్ ప్లస్, న్యూ క్రియేటివ్ ప్లస్, న్యూ క్రియేటివ్ ప్లస్ పీఎస్ అనే మూడు రకాల వేరియంట్లలో కొత్త కారును తీసుకువచ్చారు. ఇక ఫీచర్ల విషయానికి వస్తే వాయిస్ సహాయక పనోరమిక్ సన్ రూఫ్, వెంటిలేడెడ్ లెథరెట్ సీట్లు, కొత్త 10.25 అంగుళాల ఇన్ఫోటైన్ మెంట్ డిస్ ప్లే, సబ్ వూఫర్ తో కూడిన 9 జేబీఎల్ స్పీకర్లు, ఇ-షిఫ్టర్, పాడిల్ షిఫ్టర్ తో కూడిన 7 స్పీడ్ డీసీఏ ఆకట్టుకుంటున్నాయి. పాత మోడల్ మాదిరిగానే కొత్త 2025 టాటా నెక్సాన్ లో ఇంజిన్ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. 1.2 లీటర్ టర్బో చార్జ్ డ్ రెవో ట్రాన్ పెట్రోలు ఇంజిన్, 1.5 పెట్రోలు టర్బో చార్జ్ డ్ రెవో టార్క్ డీజిల్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. 1200 సీసీ పెట్రోలు యూనిట్ నుంచి 5500 ఆర్పీఎం వద్ద 86.7 బీహెచ్ పీ, 1,750-4000 ఆర్పీఎం వద్ద 170 ఎన్ ఎం టార్కును ఉత్పత్తి అవుతుంది. ఈ ఇంజిన్ సీఎన్ జీ పవర్ ట్రైన్ ఎంపికలో కూడా ఉంది. ఆ మోడ్ లో 5000 ఆర్పీఎం వద్ద 72.5 బీహెచ్ పీ, 2000-3000 ఆర్పీఎం నుంచి 170 ఎన్ ఎం టార్కు విడుదల అవుతుంది. మరోవైపు 1500 సీసీ 3750 ఆర్పీఎం వద్ద 83.3 బీహెచ్పీ, 1500 నుంచి 2750 ఆర్పీఎం వరకూ 260 ఎన్ ఎం టార్క్ విడుదల అవుతుంది.

టాటా నెక్సాన్ కారులోని స్పెసిఫికేషన్ల గురించి మాట్లాడుకోవాలంటే.. ఈ కాంపాక్ట్ ఎస్ యూవీ పొడవు 395 ఎంఎం, వెడల్పు 1804 ఎంఎం, ఎత్తు 1620 ఎంఎం, వీల్ బేస్ 2498 ఎంఎం, కారు గ్రౌండ్ క్లియరెన్స్ 208 ఎంఎంగా ఉన్నాయి. ఈ వాహనం బూట్ స్పేస్ 382 లీటర్ల కాగా సీఎన్ జీ వేరియంట్ లో 321 లీటర్ల వరకూ ఉంటుంది రెండే వేరియంట్ల ఇంధన ట్యాంకు కెపాసిటీ 44 లీటర్లు. నెక్సాన్ వేరియంట్ లైనప్ లో 16 అంగుళాల చక్రాలు మాత్రమే ఉన్నాయి. అయితే లో ఎండ్ లో ఇవి సాదా స్టీల్ వీల్స్ గా, హై ఎండ్ వేరియంట్లలో డైమట్ కట్ అల్లాయ్ వీల్స్ గా లభిస్తాయి.

తక్కువ ధరకు నాణ్యమైన కార్లను అందించడంలో ట్టాటా కంపెనీకి ఎంతో ప్రత్యేకత ఉంది. మధ్య తరగతి ప్రజలు కూడా కొనగలిగే ధరలో ఈ కార్లు అందుబాటులో ఉంటాయి. టాటా మోటార్స్ నుంచి వచ్చిన టియాగో, టిగోర్, నెక్సాన్ మోడళ్లు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఇండియన్ మార్కెట్ లో మంచి విక్రయాలు జరిగి కంపెనీకి లాభాలు తెచ్చి పెట్టాయి.

## కొత్త బడ్జెట్ లో మహిళలకు అత్యంత ప్రాధాన్యం..

# నిపుణుల విశ్లేషణలు ఇవే..!




ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా కేంద్ర బడ్జెట్ పైనే చర్చ జరుగుతోంది. నలుగురు కలిస్తే దీని గురించే మాట్లాడుకుంటున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరిలో పార్లమెంటులో బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. దేశంలోని కోట్ల మంది ప్రజలు బడ్జెట్ లో మినహాయింపులు, రాయితీలు గురించి చర్చించుకుంటున్నారు. అయితే ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచుతారనే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. దీనిలో పాటు మహిళల సంక్షేమానికి కొత్త పథకాలు ప్రవేశపెడతారని పలువురు భావిస్తున్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్ డీఏ మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టింది. ఇటీవల జరిగిన ఎన్నికలో ఆ కూటమి విజయం సాధించడానికి మహిళా ఓట్లు ఎంతో కీలకంగా మారాయి. మునుపటి బడ్జెట్లలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు అత్యధికంగా నిధులు కేటాయించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో మహిళల ఓట్లు గణనీయంగా పెరిగి, 2024లో ఎన్ డీఏ విజయానికి పునాదిగా నిలిచాయి. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్ లో కూడా మహిళలకు ప్రాధాన్యం ఇస్తారని భావిస్తున్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2019లో పోల్చితే 18 మిలియన్ల మంది మహిళలు ఓటింగ్ లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆదాయ బదిలీ పథకాలు, అక్షరాస్యత కార్యక్రమాలు, ముద్ర యోజన రుణాలు, పారిశుధ్య కార్యక్రమాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇంటి యాజమాన్యం వంటి మహిళా ప్రాధాన్య కార్యక్రమాల వల్ల ఎన్ డీఏ ప్రభుత్వంపై మహిళలకు నమ్మకం ఏర్పడింది. తద్వారా వారి ఓటింగ్ శాతం పెరిగి, నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మార్గాన్ని సుగమం చేసింది.

విశ్వసనీయ నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎన్ డీఏ చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమాలతో 4.5 మిలియన్ల మహిళా ఓటర్లు పెరిగారు. ముద్ర యోజనతో సహా ఉపాధి పథకాలకు 3.6 మిలియన్ల ఓటర్ల ఆదరణ లభించింది. పీఎంఏవై పథకానికి 2 మిలియన్ల మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఇక పారిశుధ్య కార్యక్రమాలు 2.1 మిలియన్ల మహిళా ఓటర్లను తీసుకువచ్చాయి. ఎందుకంటే ఈ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాలలో 1.5 కోట్ల మంది మహిళా ఓటర్లు పెరిగారు. ఈ కార్యక్రమాలు అమలు కాని రాష్ట్రాలలో కేవలం 30 లక్షల మంది మాత్రమే ఉండడం గమనార్హం.

2024-25 బడ్జెట్ లో మహిళలు, బాలికలకు ప్రయోజనం చేకూర్చే వివిధ పథకాల కోసం రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. దీంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ బడ్జెట్ మూడు శాతం పెరిగి, రూ.26,092 కోట్లకు చేరుకుంది. దశాబ్ద కాలంలో ఇదే అత్యంత ఉత్తమ కేటాయింపు అని చెప్పవచ్చు. దీంతో త్వరలో ప్రవేశ పెట్టనున్న 2025-26 బడ్జెట్ కూడా మహిళా సాధికారతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందనే అంచనాలు బలంగా ఉన్నాయి.

## ఈ ఏడాది భారత్ వృద్ధిరేటు అంతంటే.. తేల్చేసిన ఐఎంఎఫ్

అంతర్జాతీయంగా స్థిరంగా అభివృద్ధి కొనసాగుతున్నా 2024-25లో భారత వృద్ధిరేటు స్వల్పంగా బలహీన పడవచ్చునని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య విధానం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రాంతీయంగా విభేదాలు ఉన్నా, గ్లోబల్ వృద్ధిరేటు నికరంగా ఉంటుదన్నారు. భారత వృద్ధిరేటు బలహీన పడటానికి కారణాలేమీ చెప్పలేదు. ఐఎంఎఫ్ వరల్డ్ ఎకానమీ ఔట్‌లుక్ ప్రకారం అమెరికా వృద్ధిరేటు అంచనాలకన్నా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఈయూ అభివృద్ధి నిలిచిపోతుందన్నారు.

బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థపై అధిక ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ చైనాలో ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొందన్నారు. దేశీయంగా డిమాండ్లకు సవాళ్లు ఎదురవుతాయని చెప్పారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా తక్కువ ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్ట్ ట్రంప్ ప్రభుత్వం అమలు చేసే సుంకాలు, పన్నులు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి తెచ్చినా ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు.

ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్నది. ద్రవ్యోల్బణంపై పోరుకు వడ్డీరేట్లు కూడా తగ్గించాల్సి ఉంటుంది. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, చైనా, కెనడాలపై అదనపు సుంకాలు, పన్నులు ఉంటాయని హెచ్చరించారు.

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

## అందమైన విశాఖలో ఆందోళన..! ఊపిరాడకుండా చేస్తున్న వాయువు..

# అత్యంత నాసిరకంగా గాలి నాణ్యత

ఈ తరహా కాలుష్యం వల్ల ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్, చర్మ వ్యాధులు వస్తుంటాయని డాక్టర్లు హెచ్చరిస్తుంటారు. సాధారణంగా ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తిగా, అదే ఏ క్యు ఐ 101 నుంచి 200 అయితే మోడరేట్‌గా, అంతకు మించి 201 నుంచి 300 అయితే పూర్‌గా, ఇక 301 నుంచి 400 వరకు అయితే వెరీ ప్యూర్‌గా, మరీ 401 నుంచి 500 అయితే తీవ్ర ఆందోళనకర పరిస్థితిగా పేర్కొంటారు. అలాంటిది విశాఖలో గాలి నాణ్యత సూచీ ఆంధ్రప్రదేశ్, నవంబర్15బీ విశాఖ.. దేశంలో.. ఆమాటకొస్తే ప్రపంచం లోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరాలలో ఒకటి.



దేశం లో అత్యంత వేగంగా ఎదుగుతున్న 9 వ నగరం కాగా ప్రపంచం లో 50 వ నగరంగా గుర్తింపు పొందింది. అదే సమయంలో అంతకుమించి అత్యంత కాలుష్య నగరంగా నూ గుర్తింపు పొందుతుండడం ఇప్పుడు విషాదాన్ని కలిగిస్తోంది. అసలే వైజాగ్ పోర్ట్ తో పాటు నగరం లో ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమల పొల్యూషన్ కు తోడు తాజాగా దీపావళి రోజున విశాఖ ను కాలుష్యం కమ్మేసింది. రంగురంగుల బాణసంచా వెలుగుల వెనుక భయానక నిజాలు ప్రస్తుతం అందరినీ కలవరపెడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

విశాఖ దేశంలోని మహా నగరాలలో ఒకటి. ఈ విషయంలో రెండవ మాటకు తావు లేదు. ఆసియా ఖండంలోనే శరవేగంగా అభివృద్ధి చెందే సిటీగా విశాఖకు పేరు ఉంది. ఒకవైపు కాస్మోపాలిటన్ కల్చర్, మరొకవైపు అద్భుతమైన సముద్ర తీరం, దట్టమైన తూర్పు కనుమల పర్వత శ్రేణులు, దట్టమైన అటవీ ప్రాంతాలతో దేశంలో టాప్ టెన్ సిటీలలో విశాఖ ఒకటిగా ముందుకు వెళ్తోంది. ఇది ఎంతటి ఆనందం కలిగించే అంశమో అంతే విషాదాన్ని కలిగించే అంశాలు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం అని ఎంత పేరు గడించిందో అంతే స్థాయిలో అత్యంత కాలుష్య నగరాలలో కూడా దేశం లో టాప్ టెన్ లో విశాఖ ఉండడం ఇప్పుడు కలవర పెడుతోంది. ముందే విశాఖ పోర్ట్ వల్ల వచ్చే కాలుష్యానికి, ఫార్మా, ఆటోనగర్, ఇతర పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం ఒకవైపు, మరొకవైపు నగరం బౌల్ షేప్ లో ఉండడం, చుట్టూ కొండలు ఉండడం తో కాలుష్యం బయటకు వెళ్ళకుండా నగరాన్నే చుట్టుముట్టి ఇక్కడే ఉండిపోవడం వల్ల దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

ఈ ఏడాది గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలో%ా

ఇలా అసలే కాలుష్య కోరల్లో ఉండే విశాఖ లో దీపావళి టపాసుల ప్రభావంతో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రమాదకర స్థాయికి వెళ్ళింది. ఈ ఏక్యూఐ ఏకంగా 308 కు చేరింది. దీపావళి రోజు దేశవ్యాప్తంగా 245 నగరాలు, పట్టణాల్లోని గాలి నాణ్యతను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి– సీపీసీబీ అనలైజ్ చేస్తే దిమ్మ తిరిగే వాస్తవాలు వెలుగు చూశాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి 10.30 గంటల వరకు సగటును పరిగణలోకి తీసుకుంటే దేశం లో మొత్తం 53 నగరాలు, పట్టణాలలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో ఉండడం, .ఆ జాబితాలో విశాఖపట్నం కూడా ఉండటం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ లో ఎనిమిది నగరాలు, పట్టణాల్లో శాంపిల్స్ ను సేకరించగా అత్యధికంగా చిత్తూరు 348 పాయింట్లతో ఉండగా ఆ తర్వాత విశాఖ లో ఏక్యూఐ ఏకంగా 308గా నమోదైంది.గత ఏడాది దీపావళి కు ఏ క్యూ ఐ 233 మాత్రమే..

ఎయిర్ క్వాలిటీ ని నిర్ధారించే పార్టికలేట్ మ్యాటర్ .. పీఎం 2.5 మైక్రాన్లు లేదా అంతకంటే తక్కువ వ్యాసం గల కణాలు ను కాలుష్యానికి ముఖ్య కారకాలుగా సీపీసీబీ గుర్తిస్తుంది. గతేడాది ఇదే సమయానికి నగరంలో ఈ గాలి నాణ్యత 233గా నమోదు కాగా ఇప్పుడు అది 308 కి చేరడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ స్టేషన్ నుంచి సేకరించిన శాంపిల్స్ ప్రకారం గణాంకాలును ఒకసారి చూస్తే నగరంలో అనేక కీలక ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ చాలా పూర్ లెవల్ ఉంది. ముఖ్యంగా వన్ టౌన్, ఎన్ ఎ డీ, గాజువాక, పోర్ట్ రోడ్, సిరిపురం జంక్షన్ లాంటి ఏరియాల్లో మరింత ఎక్కువగా దీని ప్రభావం ఉండడం మరింత ఆందోళన కలిగించే అంశం.

ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ 51 నుంచి 100 వరకు ఉంటేనే సంతృప్తిగా ఉన్నట్టు ముఖ్యంగా సోమవారం రాత్రి ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు బాణసంచా మోతతో విశాఖ నగరం దద్దరిల్లింది. ఒకపక్క వాయు కాలుష్యం, మరోపక్క శబ్ద కాలుష్యంతో విశాఖ వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాధారణంగా పార్టికులెట్ మేటర్ %--% పీఎం 10, పీఎం 2.5 కారకాలు ఎక్కువగా నమోదు కావడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నది విశ్లేషణ. ఈ తరహా కాలుష్యం వల్ల ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్, చర్మ వ్యాధులు వస్తుంటాయని డాక్టర్లు హెచ్చరిస్తుంటారు. సాధారణంగా ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తిగా, అదే ఏ క్యు ఐ 101 నుంచి 200 అయితే మోడరేట్‌గా, అంతకు మించి 201 నుంచి 300 అయితే పూర్‌గా, ఇక 301 నుంచి 400 వరకు అయితే వెరీ ప్యూర్‌గా, మరీ 401 నుంచి 500 అయితే తీవ్ర ఆందోళనకర పరిస్థితిగా పేర్కొంటారు. అలాంటిది విశాఖలో గాలి నాణ్యత సూచీ 348గా నమోదు కావడంతో అత్యంత పూర్ కేటగిరీ లో నాసిరకంగా ఉండడం వల్ల ఊపిరిపీల్చుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతాయన్నది విశ్లేషణ. తద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు కూడా ఉన్నాయన్నది వైద్యుల హెచ్చరిక.

## ప్రతిరోజు చికెన్ తింటున్నారా..

# ఈ రకమైన వ్యాధులు ఖాయం..



ప్రతి రోజు మన ఆహారం లో మాంసం ఉంటె ఇంకేం పండగే అనుకుంటారు. కొందరికి అయితే ముక్క లేనిది ముద్ద దిగదు అన్నది వాస్తవం. అయితే మాంసాహార ప్రియులు ప్రోటీన్ పేరుతో మటన్ కన్నా ఎక్కువ చికెన్ తినడానికి ఇష్టపడుతారు.కానీ వైద్యులు, న్యూటీషన్‌లు చెప్పేది చూస్తే మాత్రం ప్రతి రోజు మాంసం తినాలి అనుకునే వాళ్ళు కాస్త ఆలోచించాలి సుమీ. ప్రతి రోజు కాకుండా వారంలో ఒకసారి చికెన్ తినడం ఉత్తమం అంటున్నారు వైద్యులు అంతేగానీ.. వారంలో ఎక్కువ రోజులు తింటే మాత్రం అనారోగ్యం తప్పదు అంటున్నారు.

ప్రతి రోజు మన ఆహారం లో మాంసం ఉంటె ఇంకేం పండగే అనుకుంటారు. కొందరికి అయితే ముక్క లేనిది ముద్ద దిగదు అన్నది వాస్తవం. అయితే మాంసాహార ప్రియులు ప్రోటీన్ పేరుతో మటన్ కన్నా ఎక్కువ చికెన్ తినడానికి ఇష్టపడుతారు. బ్యాలెన్స్ ఫుడ్ అనేది చాల ముఖ్యం. నాన్ వెజ్ విషయానికి వస్తే రుచిగా ఉంటుంది అని కూరల రూపంలో, ఫ్రై రూపంలో కడుపు నిండా తింటాం. కొందరికి మూడుపూటలు తిన్నా బోర్ కొట్టదు. కానీ వైట్ మీట్‌గా పేరు గాంచిన చికెన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి అంటున్నారు డాక్టర్లు. మనిషికి శాకాహారం తో పాటు మమసాహారం కూడా చాల ముఖ్యం ఎందుకంటే ఈ రెండు మానవ శరీరానికి కావాల్సిన విటమిన్లు, ప్రోటీన్స్, మూలకాలు, ఫైబర్, పొటాషియం, కాల్షియం లతో పాటు అనేక పోషకాలను బాడీకి అందిస్తాయి.

కానీ వైద్యులు, న్యూటీషన్‌లు చెప్పేది చూస్తే మాత్రం ప్రతి రోజు మాంసం తినాలి అనుకునే వాళ్ళు కాస్త ఆలోచించాలి సుమీ. ప్రతి రోజు కాకుండా వారంలో ఒకసారి చికెన్ తినడం ఉత్తమం అంటున్నారు వైద్యులు అంతేగానీ.. వారంలో ఎక్కువ రోజులు తింటే మాత్రం అనారోగ్యం తప్పదు అంటున్నారు. ఆరోగ్యాంగా ఉండాలి అనుకుంటే మంచి ఆహారం, ఆరోగ్యమైన అలవాట్లు కూడా ఏంతో అవసరం ఎలాంటి పదార్థాలు తినాలి తింటే ఎంత తినాలి ఒక పదార్థం ఒక వారం లో ఎన్ని సార్లు తినాలి ఇలాంటి విషయాలు తెలుసుకోవడం చాల ముఖ్యం.కూరగాయల్లో కూడా వారం లో ఎన్ని సార్లు ఏది తినాలో ఉన్నట్టు మాంసాహారం లో కూడా అంతే మరి ముక్యంగా ప్రతి రోజు చికెన్ తినడం వల్ల శరీరం లో బ్యాడ్ కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఉంది తాజాగా శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం లో చికెన్ ను రోజు తినడం వల్ల చెడు కొవ్వు బాడీలో ఎక్కువ అయ్యి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ఛాన్స్ ఎక్కువ ఉందంట దీనితో పాటు శరీర బరువు కూడా అమాంతం పెరుగుతుందట. చికెన్ ను బిర్యానీ, చికెన్ ఫ్రై, బట్టర్ చికెన్ లాంటి వంటకాల్లో ఉపయోగించే మసాలాలు బరువు పెరగడంలో దోహదపడుతాయి.

ఇవే కాకుండా అతి చికెన్ వల్ల మూత్ర నాలాల సమస్యలు, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వచ్చే ఛాన్స్ ఉంది. ఒక సర్వే ప్రకారం చికెన్‌లో ఈకోలీ అనే బ్యాక్టీరియా ఉంటుంది. ఇది మూత్రనాళాల సమస్యలకు కారణం అవుతుంది.మరి మితంగా చికెన్ తింటే ఇన్ని సమస్యలు రావు కదా అన్నది వైద్యుల మాట.

కోళ్ల పెంపకంలో వాటికి యాంటీబయాటిక్స్ ఇస్తారు. దాదాపు ప్రతి కోడికి యాంటీబయాటిక్స్ ఇవ్వడం ఖాయం మార్కెట్‌కు అనుకూలంగా సరైన సమయంలో డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి చేసే క్రమంలో ఇలాంటివి ఇస్తారు. కాబట్టి మన శరీరం లో కూడా యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు వైద్యులు. ఇప్పటికైనా వారంలో ఒకటి లేదా రెండు సార్లు లిమిట్‌గా చికెన్ తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# వయసు పెరిగినా యంగ్ గా ఉండాలా.. అయితే ఈ టిప్స్ మీకోసమే!

కొల్లాజెన్ శరీరానికి అత్యంత అవసరమైన ప్రోటీన్స్ లో ఇది కూడా ఒకటి. కొల్లాజెన్ చర్మాన్ని అందంగా మార్చడంలో సమాయం చేస్తుంది. అంతే కాకుండా ఎముకలు బలంగా, దృఢంగా ఉండేలా హెల్ప్ చేస్తుంది. వయసు పెరిగినా యంగ్ లుక్ లో కనిపించాలంటే కొల్లాజెన్ అత్యవసరం. మీరు చాలా మందిని చూసే ఉంటారు. కొంత మందికి వయసు ఎక్కువగా ఉన్నా యంగ్ లుకింగ్ లో ఉంటారు. అలాగే ఇంకొంత మంది చిన్న వయసులోనే ముసలి వారిలా ఉంటారు. దీనికి కారణం కొల్లాజెన్. కేవలం చర్మాన్ని మెరిపించడమే కాకుండా..

కొల్లాజెన్ శరీరానికి అత్యంత అవసరమైన ప్రోటీన్స్ లో ఇది కూడా ఒకటి. కొల్లాజెన్ చర్మాన్ని అందంగా మార్చడంలో సమాయం చేస్తుంది. అంతే కాకుండా ఎముకలు బలంగా, దృఢంగా ఉండేలా హెల్ప్ చేస్తుంది. వయసు పెరిగినా యంగ్ లుక్ లో కనిపించాలంటే కొల్లాజెన్ అత్యవసరం. మీరు చాలా మందిని చూసే ఉంటారు. కొంత మందికి వయసు ఎక్కువగా ఉన్నా యంగ్ లుకింగ్ లో ఉంటారు. అలాగే ఇంకొంత మంది చిన్న వయసులోనే ముసలి వారిలా ఉంటారు. దీనికి కారణం కొల్లాజెన్. కేవలం చర్మాన్ని మెరిపించడమే కాకుండా బరువు తగ్గించడంలో, మెదడుని యాక్టీవ్ చేయడంలో కొల్లాజెన్ బాగా సహాయ పడుతుంది.

సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి:

అంతే కాకుండా కొల్లాజెన్ ను శరీరంలో సహజంగా పెంచుకోవచ్చు. సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలి. సమతుల్యమైన ఆహారం వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే ఉదయం వ్యాయామం, యోగా, వాకింగ్ వంటివి చేయడం ద్వారా కూడా కొల్లాజెన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది.



అంతే కాకుండా నాణ్యమైన నిద్రకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్రాంతి తీసుకోవడం వల్ల కూడా కొల్లాజెన్ ఉత్పత్తి గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. మంచి బ్రైట్ స్కిన్ సాధించడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో విటమిన్ సి, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి బూస్టింగ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల కూడా కొల్లాజెన్ ఉత్పత్తి అనేది పెరుగుతుంది.

సూర్యరశ్మి నుంచి దూరంగా ఉండండి:

సూర్య కిరణాల వల్ల శరీరంలోని ఫైబర్ అనేది విచ్ఛిన్నం అవుతుంది. ఇది అకాల వృద్ధాప్యానికి దారి తీస్తుంది. కాబట్టి సూర్య రశ్మి నుండి మీ చర్మాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రతి రోజూ సన్ స్క్రీన్ ను అప్లై చేయడం వల్ల కొల్లాజెన్ ను రక్షించుకోవడంలో, కొల్లాజెన్ తగ్గకుండా చూసు కోవచ్చు. అదే విధంగా నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరాం, చర్మం హైడ్రేట్ గా ఉంటాయి. నీరు ఎక్కువగా తీసుకున్నా కొల్లాజెన్ ఉత్పత్తి అనేది పెరుగుతుంది. ఇంకా కొల్లాజెన్ తో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

జుట్టు బలంగా ఉంటుంది:

జుట్టును అందంగా మార్చడంలో కూడా కొల్లాజెన్ బాగా సహాయ పడుతుంది. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ మెలనిన్ ఉత్పత్తి అనేది తగ్గిపోతుంది. అందుకే ఒక లాంటి ఏజ్ వచ్చేసరికి జుట్టు నెరిసి పోతుంది. తెల్లగా లేదా బూడిద రంగులోకి మారుతుంది. అంతే కాకుండా జంక్ ఫుడ్ లాంటివి తీసుకున్నా కూడా జుట్టు కలర్ అనేది మారి పోతుంది. అదే కొల్లాజెన్ ఉన్న ఆహారం తీసుకుంటే జుట్టు కలర్ మారకుండా.. నల్లగా, అందంగా ఉంటుంది.

బరువు తగ్గానికి కూడా హెల్ప్ చేస్తుంది:

బరువును తగ్గించడంలో కూడా కొల్లాజెన్ ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థను పెంచడానికి సహాయ పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఊబకాయం వంటి సమస్యలు ఎదరవ్వవు.

చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కొల్లాజెన్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, వృద్ధాప్యాన్ని తగ్గించడంలో, ముడతలు పడకుండా, మొటిమలు, ఇతర చర్మ సమస్యలు రాకుండా చూడటంలో కొల్లాజెన్ బాగా పని చేస్తుంది.

## వెనక్కి వాకింగ్ చేయడం వల్ల ఎన్ని ప్రయోజనాలో.. తెలిస్తే నిజంగానే షాక్ అవుతారు!



సాధారణంగా ఉదయం ఎవరికి ఉన్న సమయంలో వారు ఎక్సర్ సైజులు, వాకింగ్, జాగింగ్ వంటివి చేస్తూంటారు. ప్రతి రోజూ కనీసం 20 నిమిషాలైన వ్యాయామాలు చేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయం వాకింగ్ చేయడం వల్ల ఎన్నో దీర్ఘకాలికి అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అంతే కాకుండా ఆరోగ్యంగా కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వీటిని గురించి ఇప్పటికే మనం తెలుసుకున్నాం. అయితే కేవలం ముందుకే కాదు.. వెనక్కి వాకింగ్ చేయడం వల్ల కూడా చాలా హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయన్న సంగతి మీకు తెలుసా. సాధారణంగా కొందరు వాకింగ్ చేసేటప్పుడు వెనక్కి నడుస్తూ ఉంటారు. అది చూసిన చాలా మంది నవ్వుకుంటూ ఉంటారు. వెనక్కి నడవడం వల్ల కూడా ఆరోగ్య పరంగా పలు లాభాలు ఉన్నాయని నిపుణ అంటున్నారు. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

కొవ్వు కరుగుతుంది:

సాధారణంగా ముందుకు వాకింగ్ చేస్తే కొవ్వు కరిగి.. బరువు తగ్గుతారు. అయితే వెనక్కి వాకింగ్ చేయడం వల్ల 40 శాతం ఎక్కువగా శక్తి ఖర్చు అవుతుంది. దీంతో కొవ్వు త్వరగా కరిగేందుకు అవకాశాలు ఉన్నాయి.

కాళ్ల కండరాలు దృఢంగా ఉంటాయి:

వెనక్కి నడవడం వల్ల కాళ్ల కండరాలు అనేది దృఢంగా మారతాయి. కాలి పిక్కలు, మడమల వద్ద కండరాలు పటుత్వం పెరగాలంటే వెనక్కి నడవడం చాలా మంచిది.

ఫాస్ట్ గా బరువు తగ్గేందుకు ఛాన్స్:

సాధారణంగా వెనక్కి నడవడం వల్ల కేలరీలు ఎక్కువగా ఖర్చు అవుతాయి. దీని వల్ల బాడీలో కొవ్వు ఫాస్ట్ గా కరుగుతుంది. దీంతో ఫలితాలు అనేవి త్వరితగతిన ఉంటాయి.

నిద్రలేమి సమస్య తగ్గుతుంది:

రివర్స్ లో వెనక్కి వాకింగ్ చేయడం వల్ల నిద్ర లేమి సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో నిద్ర నాణ్యత పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. అదే విధంగా వెనక్కి నడవడం వల్ల ప్రతి ఒక్కరినీ కంఫర్ట్ జోన్ లోకి తీసుకెళ్తుంది.

మోకాలి నొప్పులు మాయం:

ఓ అధ్యయనం ప్రకారం.. వెనక్కి వాకింగ్ చేయడం వల్ల మోకాలి నొప్పులు తగ్గుతాయని పేర్కొంది. వెనక్కి పరిగెత్తడం లేదా వాకింగ్ చేయడం వల్ల కార్డియోస్పిరేటరీ బలంగా మారుతుందని పేర్కొన్నారు.

ఏకాగ్రత పెరుగుతుంది:

వెనక్కి నడవడం వల్ల ఉత్సాహంగా ఉంటుంది. రోజూ చేసే వాకింగ్ కంటే ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. కాబట్టి ఇంకా ఇంకా నడవాలనే ఇంట్రెస్ట్ పెరుగుతుంది. దీంతో ఇతర వాటిపై కూడా దృష్టి పెట్టేలా బ్రెయిన్ మారుతుంది.

### నల్ల నువ్వులతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ..ఇంకా ఇవీ బెనిఫిట్లు !

నువ్వులు రెండు రకాలు.. తెల్ల నువ్వులు.. నల్ల నువ్వులు ఉంటాయి. నువ్వులతో పలు రకాల వంటకాలు తయారు చేయొచ్చు. వీటిల్లో నల్ల నువ్వుల్లో కాల్షియం, ఫైబర్, ఐరన్, ఫాస్ఫరస్ వంటి పౌష్టిక పదార్థాలు ఉంటాయి. నల్లనువ్వులు వాడటంతో జీర్ణక్రియ మెరుగవుతుంది. జట్టుకు, చర్మానికి ప్రయోజనం లభిస్తుంది. నల్ల నువ్వులతో ఒనగూడే బెనిఫిట్ల గురించి తెలుసుకుందామా..!నల్ల నువ్వుల్లో పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు తగినంత పరిణామంలో ఉంటాయి. నల్లనువ్వులు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయకారిగా ఉంటుంది. దీనివల్ల గుండె సంబంధ వ్యాధుల ముప్పు నివారించొచ్చు. మనుష్యుల్లో రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సాయ పడతాయి. వీటిల్లోని కాల్షియం, కాపర్, మాంగనీస్, ఐరన్, బీ6 విటమిన్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు రోగ నిరోధక శక్తిని పెంచడంలో సాయపడటంతోపాటు రోగాల బారిన పడకుండా కాపాడతాయి.రోజువారీ ఆహారంలో నల్ల నువ్వుల్ని చేర్చుకోవడంతో దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు. మధుమేహం, క్యాన్సర్, గుండె జబ్బులను తగ్గించే లక్షణాలు కలిగి ఉంటాయి. నువ్వుల్లోని పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు తగినంత పరిణామంలో ఉండటంతో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో కీలకంగా ఉంటాయి.

# మధుమేహం తగ్గదనే అపోహపై తాజా అప్‌డేట్ ఇదే!

“డయాబెటిక్ రివర్సల్” ఈ మధ్యకాలంలో చాలా ఎక్కువగా వినిపిస్తున్న చికిత్సా పద్ధతి. “ వినటానికి బానే ఉంది.. కానీ ఒక సారి మధుమేహం వచ్చిన తర్వాత అది తగ్గుతుందా? ఇన్సులిన్‌ను వాడే వారు డోసేజ్ తగ్గించుకొనే అవకాశముందా?– ఇలాంటి ప్రశ్నలెన్నో తలెత్తుతూ ఉంటాయి. వీటికి సమాధానం చెబుతున్నారు డాక్టర్ సౌజన్య.

మధుమేహం తగ్గుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు– అసలు మధుమేహ సమస్య ఎందుకు వస్తుందో తెలుసుకోవాలి. మన శరీరంలో ఇన్సులిన్ అసలు ఉత్పత్తి కాకపోయినా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిపోకపోయినా– మధుమేహం వస్తుంది. మధుమేహం ఒక సారి వచ్చిన తర్వాత దానిని నియంత్రణలో ఉంచటానికి మందులు లేదా ఇన్సులిన్‌ను వాడుతూ ఉంటారు. చక్కెర విలువలు తెలుసుకోవటానికి పరీక్ష చేసుకుంటూ లేదా చేయించుకుంటూ ఉంటారు. గత కొన్నేళ్లుగా ఈ పద్ధతిని అనేక మంది పాటిస్తున్నారు. ఒకే రకమైన మందును ఏళ్ల తరబడి వాడేవారు కూడా అనేక మంది. దీనితో మధుమేహం తగ్గదనే అపోహ చాలా మందిలో ఉంది. అయితే ఈ మధ్యకాలంలో మధుమేహంపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. గ్లూకోజ్ విలువలను పరీక్షించటానికి అనేక ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కారణాల వల్ల మధుమేహంపై మనకు ఉన్న దృష్టి కోణం మారింది. దీని ఫలితమే ‘డయాబెటిక్ రివర్సల్’ చికిత్సా విధానం. దీని ద్వారా తాజాగా మధుమేహం వచ్చిన వారికి పూర్తిగా నయమయ్యే అవకాశముంటుంది. చాలా కాలంగా మధుమేహ చికిత్స తీసుకుంటున్నవారు మందుల డోసును తగ్గించుకొనే అవకాశం కలుగుతుంది.

అందుబాటులో..

మన శరీరంలో చక్కెర విలువలను తెలుసుకోవటానికి గ్లూకో మీటర్స్‌ను ఉపయోగిస్తారు. ఇవి మన శరీరంలో చక్కెర విలువలు ఎలా ఉన్నాయో తెలియజేస్తాయి. అయితే వీటికి కొన్ని పరిమితులు ఉన్నాయి. వీటిని అధిగమించటానికి ఈ మధ్యకాలంలో కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్ సిస్టమ్స్ (సీజీఎంఎస)లు అందుబాటులోకి వచ్చాయి. ఈ వ్యవస్థలో ఒక గ్లూకోజ్ మానిటర్ ఉంటుంది. దీనిని సీజీఎం వ్యవస్థకు అనుసంధానిస్తారు. ఈ మానిటర్ ద్వారా వ్యవస్థకు మన శరీరంలో వస్తున్న గ్లూకోజ్ మార్పులు తెలుస్తూ ఉంటాయి. అంటే ఏ ఆహారం తింటే గ్లూకోజ్ విలువలు పెరుగుతున్నాయో.. ఏ సమయంలో గ్లూకోజ్ విలువలు పెరుగుతున్నాయో వంటి రకరకాల విషయాలు తెలుస్తాయి. ఒకప్పుడు ఈ మానిటర్స్ ఖరీదు ఎక్కువగా ఉండేది. ఈ మధ్య కాలంలో వీటి ఖరీదు బాగా తగ్గింది. సీజీఎంఎసల అందిన సమాచారాన్ని విశ్లేషించిన తర్వాత– శరీర పనితీరు ఆధారంగా మందులను సూచించగలుగుతున్నారు. తాజాగా మధుమేహం నియంత్రణకు జీఎల్‌పీ1, ఎస్‌జీఎల్‌టీ మాలిక్యుల్స్ (ఇవి మూల మందులు. మార్కెట్‌లో వేర్వేరు పేర్లతో అందుబాటులో ఉన్నాయి) మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ మందుల వల్ల మధుమేహాన్ని నియంత్రించే పద్ధతే మారిపోయింది.

రకరకాలుగా..

మన శరీరంలోని క్లోమం (పేంకిరియాస)లో బీటా సెల్స్ ఉంటాయి. ఇప్పటి దాకా మధుమేహం కోసే వాడే మందులు– ఈ క్లోమములో ఉండే బీటా సెల్స్‌పై పనిచేస్తూ ఉంటాయి. దీని వల్ల రకరకాల దుష్పరిణామాలు ఏర్పడుతూ ఉంటాయి. అయితే కొత్త తరం జీఎసఎల్‌పీ1 మాలిక్యుల్స్ ఆకలిని తగ్గిస్తాయి. సాధారణంగా చాలా మంది ఆహారం ఎక్కువ తింటే ఆరోగ్యంగా ఉన్నామనుకుంటారు. ఆకలి వేసినా లేకపోయినా ఆహారాన్ని తింటూ ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆకలి చాలా మందికి ఒక అలవాటు! దీనిని నియంత్రించగలిగితే కణాలు విడుదల చేసే శక్తి నియంత్రణ కూడా జరుగుతుంది. గ్లూకోజ్ విలువలు కూడా తగ్గుతాయి. జీఎసఎల్‌పీ1 మాలిక్యూల్ ఆకలిని తగ్గిస్తే– దీని వల్ల ఆహారంపై నియంత్రణ ఏర్పడుతుంది.

అసలు సమస్య ఇదే..

జన్యు కారణాల వల్ల వచ్చే మధుమేహాన్ని పక్కనపెడితే– ఈ మధ్యకాలంలో ఎక్కువ మందికి జీవన శైలి, ఆహారపు అలవాట్లు వల్లే మధుమేహం వస్తోంది. ఇది అన్ని వయస్సుల వారిలోను కనిపించటం ఒక ప్రమాదకరమైన సంకేతం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. ఉదాహరణకు – చాలా కాలంగా కొందరు రోజుకు మూడు సార్లు ఆహారం తినాలని నమ్ముతారు. దీని ద్వారా ఆరోగ్యంగా ఉంటామనుకుంటారు. మన శరీరానికి తగిన శక్తిని ఇవ్వటానికి ఇది ఒక మార్గం. అయితే మన శరీరానికి అవసరమైన శక్తి– మనం చేసే శారీరక శ్రమపై కూడా ఆధారపడి ఉంటుంది. తక్కువ శారీరక శ్రమ చేసేవారు ఎక్కువ ఆహారాన్ని తింటే ప్రతికూల ఫలితాలు వస్తాయి. అదనంగా చేరిన గ్లూకోజ్ కాలేయంలోను, పొట్టలోను కొవ్వు రూపంలో పేరుకుపోతుంది. ఇలా అదనంగా పేరుకుపోవటాన్ని గ్లూకోటాక్సిటీ అంటారు. గ్లూకోజ్ అదనంగా పేరుకుపోవటం గమనించిన కణాలు– తమకు అంత శక్తి అవసరం లేదని క్లోమానికి సంకేతాలు ఇస్తాయి. తగినంత ఇన్సులిన్‌ను తీసుకోవు. ఇన్సులిన్‌ను తీసుకోకపోవటం వల్ల రక్తంలో గ్లూకోజ్ విలువలు పెరిగిపోతాయి. ఈ గ్లూకోజ్ విలువల నియంత్రణ కోసం శరీరంలోని వివిధ అవయాలు ప్రయత్నిస్తాయి. ఈ క్రమంలో అవి కూడా దెబ్బతింటాయి. ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది.

ఏం చేయాలి?

అవసరమైన దాన్ని కన్నా ఎక్కువ ఆహారం తినకూడదు. అవసరమైన దాని కన్నా ఎక్కువ




ప్రొటీన్‌ను తీసుకోకూడదు. ఏ ఆహారం తింటే గ్లూకోజ్ విలువలు పెరుగుతాయో గమనించాలి. చాలా మంది కార్బోహైడ్రేట్స్‌ను పూర్తిగా మానేస్తే మధుమేహ సమస్య తగ్గిపోతుందనే అపోహలో ఉంటారు. ఇది నిజం కాదు. కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారాన్ని పూర్తిగా మానేస్తే– ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల సంతులిత ఆహారాన్ని తీసుకుంటూ ఉండాలి. అంతే కాకుండా– కొన్ని ఆహార పదార్థాలను ఘన స్థితిలోనే తినాలి. ఉదాహరణకు చాలా మంది మధుమేహ రోగులు– రాగి జావ తినటం వల్ల ప్రయోజనం ఉందనుకుంటారు. కానీ రాగి ముద్ద తిన్నప్పుడు కలిగే ప్రయోజనం రాగి జావ తాగితే రాదు. ఇదే విధంగా పళ్లను తిన్నప్పుడు కలిగే ప్రయోజనం పళ్ల రసం తాగినప్పుడు రాదు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తే మధుమేహానికి రివర్స్ గేర్ వేయటం సాధ్యమే! డయాబిటిస్ రివర్సల్ చికిత్సలో మూడు ప్రధానమైన అంశాలుంటాయి. మొదటిది గ్లూకోజ్ విలువలను ప్రతి క్షణం కనిపెట్టడం. దాని ద్వారా ఎలాంటి ఆహారం తింటే, ఎలాంటి పరిస్థితుల్లో గ్లూకోజ్ విలువలు పెరుగుతున్నాయి అనే విషయాన్ని విశ్లేషించటం. ఈ విశ్లేషణ ఆధారంగా నిర్దిష్టమైన ఆహారాన్ని సూచించటం. మధుమేహం ఏ స్థాయిలో ఉందనే విషయాన్ని విశ్లేషించి– కొత్త రకం మందులు ఇవ్వటం. వీటి ద్వారా గ్లూకోజ్ నియంత్రణతో పాటుగా ఆకలిని తగ్గించటం.. శరీర అవయవాలపై ఒత్తిడి లేకుండా చేయటం.

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

# మోకాళ్లపై వెంకన్న చెంతకు టాలీవుడ్ హీరోయిన్





హీరోయిన్ లు అంటే.. చాలా సున్నితంగా, సుకుమారంగా ఉంటారు. అయితేనేం.. వారిలోని భక్తి ఒక్కోసారి వారి చేత వండర్లు చేయిస్తూ ఉంటుంది. ఇలాంటి సమయాల్లోనే మనం ఆశ్చర్యపోయే దృశ్యాలను చూస్తూ ఉంటాం. అలాంటి ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

టాలీవుడ్ లో పలు హిట్ సినిమాల్లో నటించిన హీరోయిన్ నందినీ రాయి%8ా% మోకాళ్లపై వెళ్లి కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. అలిపిరి నుంచి మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకున్న నందినీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మోకాళ్ల పర్వతం వద్ద ఆమె తన మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న వీడియో ఆమెలోని భక్తి ప్రపత్తులను తెలియజేస్తోంది.

తమిళ స్టార్ హీరో విజయ్ కథానాయకుడిగా టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మించిన వారసుడు చిత్రంలో శ్రీకాంత్ కు జోడిగా నందినీ రాయి నటించారు. సీనియర్ డైరెక్టర్ నీలకంఠ తెరకెక్కించిన మాయ చిత్రంలోనూ ఆమె లీడ్ రోల్ లో కనిపించింది.

ఇక సుధీర్ బాబు హీరోగా నటించిన మోసగాళ్లకు మోసగాడు సినిమాలోనూ నటించింది. వీటితో పాటు మరికొన్ని సినిమాల్లోనూ నటించినా నందినికి పెద్దగా గుర్తింపు రాలేదు. అయినా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ సాగుతున్న నందిని%8ా% తాజాగా పలు సినిమాల్లో అవకాశాలను చేజిక్కించుకుంది.

ఈ క్రమంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల వెంకన్నను దర్శించుకునేందుకు ఆమె తిరుమల వెళ్లారు. ఈ సందర్భంగా కాలి నడకన తిరుమల కొండ ఎక్కాలని నిర్ణయించుకున్న నందిని అలిపిరి నుంచి మెట్ల మార్గం మీదుగా వెంకన్న వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మోకాళ్ల పర్వతం వద్ద ఆమె మెట్లను మోకాళ్లపై ఎక్కుతూ కనిపించారు.

సెలబ్రిటీ అయి ఉండి.. అది కూడా హీరోయిన్ గా పలు సినిమాల్లో నటించిన నందిని ఇలా మోకాళ్లపై మెట్లు ఎక్కుతుండటం పలువురు భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. మోకాళ్లపై వెంకన్న వద్దకు వెళుతున్న తన వీడియోను నందిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. ఆ వీడియో ఇప్పుడు వైరల్ గా మారిపోయింది.

# బన్నీకి ఫుల్ రిలీఫ్ దొరికేసింది!



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కు ఇప్పుడు నిజంగానే ఫుల్ రిలీఫ్ దొరికిందని చెప్పాలి. తన తాజా చిత్రం పుష్ప 2 సినిమా భారీ హిట్ గా నిలిచి.. భారత చలన చిత్ర రికార్డులను తిరగరాస్తోంది. అయినా కూడా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తన అభిమాని ఒకరు చనిపోవడం, దానిపై కేసులు నమోదు కావడం, ఏకంగా తాను ఓ రాత్రంతా జైలులో గడపాల్సి రావడం, తెలంగాణ సర్కారుతో అనవసరంగా రేగిన వివాదం.. ఇలా అన్నీ ఒకే సారి మీద పడటంతో సక్సెస్ ఫీల్ అతడు అనుభవించలేకపోతున్నాడు. ఏదో కోల్పోయిన వాడిలా ఇంటి ఆవరణలో ఒక్కడూ కూర్చుని కుమిలిపోతున్న అతడికి శనివారం నాంపల్లి కోర్టు బిగ్ రిలీఫ్ ఇచ్చింది.

ఇప్పటికే బన్నీకి రెగ్యులర్ బెయిల్ ఇచ్చిన నాంపల్లి కోర్టు..ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరు కావాలని ఓ నిబంధన పెట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా హైదరాబాద్ విడిచి వెళ్లరాదని కూడా అతడికి ఓ కండీషన్ పెట్టింది. ఈ క్రమంలో అడుగు బయటపెట్టలేని పరిస్థితిని పంటి బిగువుననే భరిస్తూ వస్తున్న బన్నీ.. గత ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు వెళ్లి వచ్చారు. రేపు ఆదివారం కూడా పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సి ఉన్న నేపథ్యంలో అతడికి కోర్టు రిలీఫ్ ఇచ్చింది.

బన్నీకి బెయిల్ ఇచ్చిన సందర్భంగా పెట్టిన షరతులను సడలిస్తూ నాంపల్లి కోర్టు శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరు కావాల్సిన అవసరం లేదని కోర్టు తెలిపింది. అంతేకాకుండా.. విదేశాలకు వెళ్లకుండా బన్నీకి విధించిన షరతును కూడా ఎత్తివేస్తూ.. విదేశాలకు వెళ్లాలనుకున్నా వెళ్లొచ్చంటూ కీలక నిర్ణయాన్ని వెలువరించింది. అటు పోలీస్ స్టేషన్ కు వెళ్లే అవసరం లేకుండా.. ఇటు విదేశాలకు వెళ్లేందుకు కోర్టు అనుమతించడంతో బన్నీకి భారీ ఊరట లభించిందని చెప్పక తప్పదు.

# ప్రభాస్ పెళ్లి సస్పెన్స్ తీరబోతోందా

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ ట్యాగ్ ని సంవత్సరాల తరబడి మోస్తున్న ప్రభాస్ పెళ్లి శుభవార్తని వినాలనే కొద్దీ ఆలస్యమవుతూనే ఉంది. పెదనాన్న కృష్ణంరాజు గారు ఉన్నప్పుడే ఈ శుభకార్యం చేయాలని చూశారు కానీ అమ్మాయి దొరక్క వాయిదా పడుతూ వెళ్ళింది. ఈలోగా ఆయన కాలం చేయడం దురదృష్టం. బాహుబలితో ప్యాన్ ఇండియా ఇమేజ్ వచ్చాక డార్లింగ్ ఇంకా బిజీ అయిపోయాడు. ఇతర హీరోలు ఆచితూచి అడుగులు వేస్తూ రెండేళ్లకు ఒక సినిమా చేయడమే గగనంగా ఫీలవుతుంటే తను మాత్రం ఏకంగా రెండు సెట్స్ మీద ఉంచి మరో మూడింటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అంత వేగంగా పరుగులు పెడుతున్నాడు.త్వరలోనే ప్రభాస్ ఇంటివాడు ఖాయమనే మాట బలంగా వినిపిస్తోంది. అన్ స్టాపబుల్ 4లో బాలకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా రామ్ చరణ్, ప్రభాస్ ల మధ్యలో జరిగిన ఫోన్ సంభాషణ ద్వారా ఈ శుభవార్త బయటికి వచ్చేసిందిట. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంకు చెందిన అమ్మాయితో సంబంధం కుదిరిందని, త్వరలో ఈ కబురు అందరితో పంచుకుంటామని అన్నారట. అయితే పేరు, కుటుంబ వివరాలు ఏవీ చెప్పలేదు కానీ సస్పెన్స్ పూర్తిగా తీరలేదు. షోకు హాజరైన ప్రేక్షకుల ద్వారా ఈ లీక్ వచ్చింది కానీ ఎంతమేరకు నిజమో జనవరి 14 టెలికాస్ట్ అయ్యే రెండో ఎపిసోడ్ లో బయటపడుతుంది.బాలయ్య, రామ్ చరణ్ ల మధ్య జరిగిన సరదా సంభాషణలు బాగా ఎంజాయ్ చేసిన ప్రేక్షకులు ఇప్పుడు రెండో భాగం కోసం ఎదురు



చూస్తున్నారు. ట్రైలర్ లో చూపించిన అసలు కంటెంట్ ఇందులోనే ఉంది. ఒకవేళ ప్రభాస్ పెళ్లి కనక ఈ ఏడాదే ఉంటే సంబరం మాములుగా ఉండదు. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ దాకా సెలబ్రిటీలందరూ చేయబోయే సందడి చూసేందుకు రెండు కళ్ళు సరిపోవు. ఆతిథ్యానికి మారు పేరుగా చెప్పుకునే ప్రభాస్ ఇక తన పెళ్లికి ఎలాంటి విందు వినోదంతో ఉక్కిరిబిక్కిరి చేస్తాడో ఊహించుకోవడం కష్టం. ఆ శుభఘడియల కోసం ఫ్యాన్స్ తో పాటు సగటు ప్రేక్షకులూ వెయిటింగ్.

# మోక్షజ్ఞ కోసం ఎదురుచూపులు ఎప్పటిదాకా




గత డిసెంబర్ లో సర్వం సిద్ధం చేసుకుని పూజా కార్యక్రమాలతో సినిమా మొదలవుతుందని అందరూ ఎదురు చూస్తున్న టైంలో మోక్షజ్ఞ డెబ్యూకు బ్రేక్ పడటం అభిమానులకు షాక్ ఇచ్చింది. ముహూర్తం, హీరోకు స్వల్ప అస్వస్థత వల్ల వాయిదా వేయలేక తప్పలేదని బాలకృష్ణ చెప్పారు కానీ అసలేం జరిగిందనే దాని మీద రకరకాల ప్రచారాలు బయటికొచ్చాయి. దర్శకుడు ప్రశాంత్ వర్మ స్క్రిప్ట్ తో సహా సర్వం సిద్ధం చేసుకుని ఉండగా చివరి నిమిషంలో పోస్ట్ పోన్ కావడం ఊహించని పరిణామం. ఫాంటసీ బ్యాక్ డ్రాప్ లో మంచి పవర్ ఫుల్ సబ్జెక్టుని తయారు చేసుకున్నాడనే టాక్ అంతకు ముందే వచ్చింది. సంక్రాంతి పండగ వచ్చేసింది కాబట్టి ఇప్పుడేమైనా శుభవార్త వస్తుందేమోనని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. కానీ ప్రస్తుతానికి ఆ అవకాశం లేదని సన్నిహిత వర్గాల సమాచారం. డాకు మహారాజ్ విడుదల హడావిడి ఉంది కాబట్టి మోక్షజ్ఞకు సంబంధించిన అప్డేట్స్ ఇవ్వడం వల్ల తామే డైవర్ట్ చేయడానికి ఛాన్స్ ఇచ్చినట్టు ఉంటుంది కాబట్టి ఆ ఆలోచన మానుకున్నారు. జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరిలో సెట్స్ మీదకు తీసుకెళ్లేలా ప్లానింగ్ ఉందని అంటున్నారు. అసలు మోక్షజ్ఞ, ప్రశాంత్ వర్మ కాంబోలోనే డెబ్యూ ఉంటుందా లేక దర్శకుడు మారతాడా అనే అనుమానాలు కూడా జనంలో లేకపోలేదు.

ఇంకోవైపు ఆదిత్య 369 సీక్వెల్ కు బాలకృష్ణ రెడీ అవుతున్నారు. వెంటనే కాదు కానీ ఫైనల్ వెర్షన్ రెడీ చేసుకుని, క్యాస్టింగ్ తదితర పనులు త్వరలోనే షురూ చేస్తారట. దీంట్లో మోక్షజ్ఞని భాగం చేయాలనేది బాలయ్య ఆలోచన. దర్శకత్వం కూడా ఆయనే చేస్తారు. ఒకపక్క అభిమానులు మాత్రం రామ్ చరణ్ చిరుత, మహేష్ బాబు రాజకుమారుడు, ప్రభాస్ ఈశ్వర్ తరహాలో పక్కా కమర్షియల్ ఎంటర్ టైనర్ తో మోక్షజ్ఞని లాంచ్ చేయమని అడుగుతున్నారట. ఏది ఏమైనా వీలైనంత వరకు ఈ కన్ఫ్యూజన్ ని త్వరగా తీర్చే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. ఇప్పటికే బాగా ఆలస్యం జరిగిపోయింది.

# హాట్ టాపిక్ - గేమ్ ఛేంజర్ మొదటి రోజు ఓపెనింగ్

నిన్న విడుదలైన గేమ్ ఛేంజర్ యునానిమస్ గా బ్లాక్ బస్టర్ అనిపించుకోనప్పటికీ మిక్స్డ్ టాక్ తోనూ క్రమంగా పుంజుకుంటుందనే నమ్మకంలో అభిమానులు, బయ్యర్లున్నారు. ఇవాళ నిర్మాణ సంస్థ ఎస్విసి అధికారికంగా మొదటి రోజు వరల్డ్ వైడ్ గ్రాస్ 186 కోట్లకు పైగా వచ్చినట్టు ప్రకటించడం ఒక్కసారిగా హాట్ టాపిక్ గా మారింది. దేవర కంటే ఫస్ట్ డే పది కోట్ల కంటే ఎక్కువ రావడం నమ్మశక్యంగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వంద నుంచి నూటా పాతిక కోట్ల దాకా వచ్చే అవకాశం ఉండగా మరీ ఇంతగా జోడించారనే కామెంట్స్ సోషల్ మీడియాలో బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఎంత పెద్ద సినిమాకైనా ఇంతే కలెక్షన్లు వచ్చాయని చెప్పేందుకు ఎలాంటి అఫీషియల్ సోర్స్ లేదు. డిస్ట్రిబ్యూటర్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ట్రాకర్స్ తమ దగ్గరున్న సమాచారాన్ని క్రోడీకరించి నెంబర్లు పెడుతుంటారు. ఎక్కువో తక్కువో వీటితో దగ్గరగా మ్యాచ్ అయ్యేలా ప్రొడక్షన్ ఆఫీస్ పోస్టర్లు వస్తాయి. కానీ గేమ్ ఛేంజర్ కు అలా జరగలేదన్నది డిస్ట్రిబ్యూటర్ వర్గాల టాక్. నిజా నిజాలు నిర్ధారించేందుకు ఎలాంటి వ్యవస్థ లేదు కాబట్టి ప్రస్తుతానికి ఎస్విసి చెప్పిన 186 కోట్ల నెంబరే చెలామణిలోకి వస్తుంది. దీని సంగతి ఎలా ఉన్నా ఉత్తరాది బుకింగ్స్ ఊపందుకున్న ట్రెండ్ కనిపిస్తోంది. ఇప్పుడు దీని గురించే ఎక్స్, ఇన్స్ టా తదితర మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది. గేమ్ ఛేంజర్ స్పందన మరీ అన్యాయంగా లేకపోయినా డిజాస్టర్ తరహాలో ప్రొజెక్ట్ అవుతున్న విధానాన్ని మెగా ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. సినిమా చాలా బాగుందని చెప్పడం లేదని కానీ ఇలా కొందరు ఉద్దేశపూర్వకంగా నెగటివ్ క్యాంపైన్ చేయడం గురించి అడుగుతున్నారు. ఇది దేవర, పుష్ప 2, కల్కి, గుంటూరు కారం లాంటి వాటికి కూడా జరిగింది కానీ గేమ్ ఛేంజర్ కు కాస్త ఎక్కువ మోతాదు అయ్యిందనేది వాళ్ళ వెర్షన్. ఏది ఎలా ఉన్నా ఒకవేళ సక్సెస్ మీట్ లాంటిది ఏదైనా ప్లాన్ చేస్తే అప్పుడే ఓపెనింగ్ గురించి ఏమైనా చెబుతారేమో చూడాలి.




Printed & Published Owned by, B.Srinivas,H No:6-3-439,Kishan Nagar,Karimnagar, Telangana,505001.Printed at Sri Balaji Printing Press.
H No. 4-4-55, Tilak Road, Karimnagar.(TS). RNI No: APTEL/2006/19056, Cell : 63055 84064, Mail: tarajyothi999@gmail.com